నెరవేరుతున్న మరో హామీ
ఆటోడ్రైవర్ల సేవలో
శ్రమజీవులకు గౌరవం, స్వావలంబనకు ప్రోత్సాహం

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
గుంటూరు
: fb.com/vaartha Digital
Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
4-10-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 243 పేజీలు: 12 వెల: 6.50

నెరవేరుతున్న మరో హామీ
ఆటోడ్రైవర్ల సేవలో
శ్రమజీవులకు గౌరవం, స్వావలంబనకు ప్రోత్సాహం



నెరవేరుతున్న మరో హామీ
ఆటోడ్రైవర్ల సేవలో




ఆటో రిక్షా, మ్యాక్సీ క్యాబ్, మోటార్ క్యాబ్
డ్రైవర్లకు ఏడాదికి రూ.15,000 ఆర్థిక సాయం
అందిస్తోంది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

గౌరవ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి
శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారిచే

4వ తేదీ అక్టోబర్ 2025
ఉదయం 11 గంటలకు
పథకం ప్రారంభం

2,90,669 మంది
లబ్ధిదారుల ఖాతాల్లో
రూ.436 కోట్లు జమ



శ్రమజీవులకు గౌరవం, స్వావలంబనకు ప్రోత్సాహం



వరద పరిస్థితులపై వివరాలు సేకరిస్తున్న హోంమంత్రి అనిత

## భారీ వర్షాలు, వరదలపై హోంమంత్రి అనిత సమీక్ష

>> ప్రభావిత ప్రాంతాల్లో ప్రస్తుత పరిస్థితులపై మంత్రి ఆరా తీశారు. ప్రజలకు ఎటువంటి అసౌర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని, ప్రాణనష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. జిల్లాల్లో కంట్రోల్ రూమ్‌లు 24/7 ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సహాయక చర్యల్లో ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్, పోలీసు, ఫైర్ సిబ్బంది సమర్థవంతంగా, వేగంగా స్పందించాలని మంత్రి స్పష్టంచేశారు. వంశధార, నాగావళి నదుల తీర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరిక సందేశాలు పంపాలని అధికారులను ఆదేశించారు. విపత్తు సమయంలో ప్రజలు తక్షణమే టోల్ ఫ్రీ నెం. 112, 1070, 1800 425 0101ద్వారా సమాచారం పొందవచ్చని మంత్రి తెలిపారు. విపత్తుల సంస్థ నుంచి హెచ్చరిక సందేశం వచ్చిన వేంటనే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్ళాలని సూచించారు.

## ఒడిశాలోని గోపాల్‌పూర్ వద్ద తీరం దాటిన తీవ్ర వాయుగుండం

### విద్యుత్ శాఖ అధికారులతో మంత్రి గొట్టిపాటి రవికుమార్ టెలికాన్ఫరెన్స్

**విజయవాడ, అక్టోబరు 3, ప్రభాతవార్తప్రతినిధి:** ఒడిశాలోని గోపాల్‌పూర్ వద్ద తీవ్ర వాయుగుండం తీరం దాటినట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది. వాయువ్య దిశగా కదిలి బలహీన పడుతున్నట్లు పేర్కొంది. తీరం దాటినా తీవ్ర వాయుగుండం ప్రభావం కొనసాగుతుందని అధికారులు తెలియజేశారు. నేడు ఉత్తర కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు చెప్పారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. ఒడిశాలో కురిసిన వర్షాల కారణంగా శ్రీకాకుళం జిల్లాలో వరద ఉధృతి పెరిగింది. అటు నుంచి వచ్చిన నీరు వంశధార, నాగావళి, బహుదా, మహేంద్రతనయ నదుల్లో ప్రవేశిస్తోంది. దీంతో హిరమండలం గొట్టా బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఆ బ్యారేజీ నుంచి వచ్చిన వంశధార నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. బూర్జ మండలంలోని నారాయణపురం ఆనకట్ట వద్ద నాగావళి నదిలో వరద ప్రవాహం పెరుగుతోంది. మహేంద్రతనయ నదిలో పెరిగిన నీటి ప్రవాహం కారణంగా శ్రీకాకుళం పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్, మహేంద్రనగర్ వీధిలోకి వరద వచ్చి చేరింది. దీంతో నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలను జిల్లా కలెక్టర్ అప్రమత్తం చేశారు. వరద ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రాంతాల్లో కలెక్టర్, ఎస్పీ పర్యటించారు. జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. తీవ్ర వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాల నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం అలెర్ట్ అయ్యింది. ఉత్తరాంధ్ర జిల్లా కలెక్టర్లతో హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి అనిత సమీక్ష నిర్వహించారు. వాయుగుండం ప్రభావంతో ఈరోజు రాత్రి, రేపు ఉత్తరాంధ్రలో కొన్ని చోట్ల భారీ వర్షాలు పడతాయని అంచనా. ఇప్పటికే శ్రీకాకుళం జిల్లాల్లో అతిభారీ వర్షాల కారణంగా అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. తీరం వెంట ఈదురుగాలులకు ఆస్కారం ఉంది. ఈ రాత్రికి అధికారులు అందరూ అందుబాటులో ఉండాలని మంత్రి ఆదేశించారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా చూడాలన్నారు. రోడ్డు మీద పడే చెట్లను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. వంశధార, నాగావళి వరదకు ఛాన్స్ ఉన్నందున లోతట్టు ప్రాంత ప్రజలని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సూచించారు. ఉత్తరాంధ్రలో భారీ వర్షాలపై విద్యుత్ శాఖ అధికారులతో మంత్రి గొట్టిపాటి రవి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాల వల్ల ఏర్పడిన విద్యుత్ అంతరాయాన్ని ఎప్పటికప్పుడు పునరుద్ధరించాలని ఆదేశించారు. చెట్లు కూలి, కొమ్మలు విరిగి తలెత్తే విద్యుత్ అంతరాయం సమస్యలకు యంత్రాంగం తక్షణమే స్పందించాలన్నారు. వివిధ శాఖలను సమన్వయం చేసుకుంటూ సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ఫిర్యాదులు ఇప్పటికే 70 శాతం పరిష్కరించామని అధికారులు వివరణ ఇచ్చారు. వచ్చిన ఫిర్యాదుల్ని నిర్ణీత కాలపరిమితి పెట్టుకుని పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు.

## దక్షిణ మధ్య రైల్వేలో సిబిఐ దాడులు

### లంచం డిమాండ్ చేసిన రైల్వే ఆసుపత్రి ఆఫీసు సూపరింటెండెంట్ అరెస్టు

### త్వరలో విజయవాడ, గుంతకల్లు రైల్వే డివిజన్‌లలో కూడా..

**గుంతకల్లు రైల్వే, అక్టోబరు 3, ప్రభాత వార్త:** దక్షిణ మధ్య రైల్వేలో పనిచేస్తున్న అవినీతి అక్రమార్కులపై సి బి ఐ మరోసారి పంజా విసిరింది.. దక్షిణ మధ్య రైల్వే నాందేడ్ డివిజన్ లో క్లీనింగ్ పనులకు సంబంధించిన రూ.91,576 రూపాయల బిల్లును మంజూరు చేసేందుకు, ఓ ప్రైవేటు కంపెనీకి హౌస్ కీపింగ్, క్లీనింగ్ పనులకు సంబంధించి రూ.1.25 లక్షల రూపాయల విలువైన పనులనుకు సంబంధించి సదరు ఆఫీసు సూపరింటెండెంట్ పాతికవేల రూపాయలను డిమాండ్ చేయగా బాధితులు 20 వేల రూపాయల లంచాన్ని చెల్లించేందుకు ముందస్తు ఒప్పందం కుదుర్చుకున్నారు. బాధితులు విషయాన్ని సి బి ఐ కి ఆశ్రయించి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన సి బి ఐ వర్గాలు దక్షిణ మధ్య రైల్వే నాందేడ్ డివిజనల్ రైల్వే ఆసుపత్రిలో పనిచేస్తున్న ఆఫీసు సూపరింటెండెంట్ తోపాటు మరోకరిని అరెస్టు చేసినట్లు సి బి ఐ వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా, దక్షిణ మధ్య రైల్వే జోన్ లోని విజయవాడ, గుంతకల్లు రైల్వే ఆసుపత్రిలలో కూడా దీర్ఘకాలిక సిక్ లీవు, మెడికల్ డీ క్యాటగిరైజేషన్, రియంబర్స్ మెంట్, వికాలాంగుల ధృవీకరణ వంటి కేసులు ఏళ్ళతరబడి పెండింగ్ లో ఉన్న వాటిపై కూడా సి బి ఐ, సి వి సి వర్గాలు నిఘా ఉంచినట్లు అభిజ్ఞ వర్గాల సమాచారం.

## వరద ముంపులో ఉత్తరాంధ్ర

### భారీగా పంటనష్టం

### నలుగురు మృతి

**విజయనగరం, అక్టోబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** వర్షాలు, వరదలు ఉత్తరాంధ్రాని అతలా కుతలం చేస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం కారణంగా మూడు జిల్లాలు తీవ్రంగా నష్టపోయాయి. నలుగురు ప్రాణాలు కోల్పోగా వందలాది ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లింది. శ్రీకాకుళం జిల్లా మందస మండలం తొబ్బురులో ఇద్దరు, విజయనగరం జిల్లా కురుపాం మండలంలో ఒకరు, విశాఖలో మృతి చెందారు. భారీ వర్షాలతో వాగులు, వంకలు. వంశధార, నాగావళి పొంగి ప్రవహిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం రెడ్‌అలర్ట్ ప్రకటించింది. అప్రమత్తంగా ఉండాలని అధికారులు ప్రజలను హెచ్చరిస్తున్నారు. జిల్లా కలెక్టర్లు నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తున్నారు.



## భారత్ సత్తా ప్రపంచం చూసింది

### ఎయిర్ చీఫ్ మార్షల్

**న్యూఢిల్లీ, అక్టోబరు 3:** ఆపరేషన్ సిందూర్ సత్తా ఎలాంటిదో ప్రపంచం చూసిందని వాయుసేన అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ తెలిపారు. స్పష్టమైన లక్ష్యంతో ఆపరేషన్ సిందూర్‌ను భారత్ ప్రారంభించిదని, లక్ష్యం నెరవేరిన తర్వాత త్వరగా యుద్ధాన్ని ముగించిందని వ్యాఖ్యానించారు. యుద్ధాన్ని ఎలా ముగించాలో భారత్‌ను చూసి ప్రపంచం నేర్చుకోవాలని సూచించారు. భారత్ దాడుల్లో పాక్‌కు చెందిన ఎఫ్16, ఎఫ్ 17 యుద్ధ విమానాలు నేలకూలినట్లు తెలిపారు. సుదర్శన్ చక్ర గగనతల రక్షణ వ్యవస్థ కోసం త్రివిధ దళాలు పని చేయడం మొదలుపెట్టినట్లు తెలిపారు. 'ఆపరేషన్ సిందూర్ చరిత్రలో నిలిచిపోయే ఒక పాఠంలా నిలుస్తుంది. ఈ యుద్ధం స్పష్టమైన లక్ష్యంతో ప్రారంభించాం. దానిని దీర్ఘకాలం పొడిగించకుండా త్వరగా ముగించాం. ప్రస్తుతం ప్రపంచంలో ఏం జరుగుతుందో మనం చూస్తున్నాం. రెండు యుద్ధాలు (గాజా-ఇజ్రాయెల్, రష్యా ఉక్రెయిన్) ముగింపు గురించి అసలు ఎలాంటి చర్చలు లేవు. కానీ మేం త్వరగా పాకిస్తాన్ కాల్పుల విరమణ కోసం అడిగేలా చేశాం. నిర్దేశించిన లక్ష్యాలు నెరవేరినందున ఆ శత్రుత్వాలను ముగించాలని మేం కూడా నిర్ణయించాం. ఈ విషయాన్ని ప్రపంచం మనల్ని చూసి నేర్చుకోవలసిన అంశంగా నేను భావిస్తున్నా' అని ఏపీ సింగ్ తెలిపారు.

ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్తాన్‌కు చెందిన 5 యుద్ధ విమానాలను, త్రివిధ దళాల సమన్వయంతో పాక్‌కు చెందిన పది ఫైటర్ జెట్ విమానాలను ధ్వంసం చేసినట్లు తెలిపారు. వాటిలో ఎఫ్16, ఎఫ్17 యుద్ధ విమానాలు ఉన్నట్లు పేర్కొన్నారు. శత్రువుల స్థావరాలను గురిచూసి కొట్టడంతో పాక్‌లోని ఉగ్రస్థావరాలతో పాటు రాడార్ వ్యవస్థలు, కమాండ్ కంట్రోల్ సెంటర్లు, రన్‌వేలు, హ్యాంగర్లు, యుద్ధ విమానాలు, ధ్వంసమయ్యాయని వివరించారు. దీంతో కాల్పుల విరమణపై పాక్ కాళ్ల బేరానికి వచ్చిందన్నారు. ఈ విషయంలో మరెవరి జోక్యం లేదని, ఇస్లామాబాద్ కోరడంతోనే తాము కాల్పులవిరమణకు అంగీకరించామని తెలిపారు. భవిష్యత్తు భద్రతా సవాళ్లను విజయవంతంగా ఎదుర్కొనేందుకు రక్షణ రంగంలో స్వావలంబన ముఖ్యమని ఏపీసింగ్ స్పష్టం చేశారు. సుదర్శన్ చక్ర గగనతలరక్షణ వ్యవస్థ కోసం త్రివిధ దళాలు పని చేయడం మొదలుపెట్టినట్లు తెలిపారు.



శుక్రవారం హర్యానాలోని రోహ్‌తక్‌లో జరిగిన ఖాదీ మహోత్సవ్‌లో పాల్గొన్న కేంద్రహోంమంత్రి అమిత్‌షా

## అమరావతికి 'భూసేకరణ'

>> ని ఎన్సీసీకి ఇచ్చారని గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టును గత జగన్ ప్రభుత్వం మూలన పడేసిందని విమర్శించారు. తిరుపతిలో ప్రతి సంవత్సరం ఫ్లోటింగ్ పాపులేషన్ పెరుగుతూనే ఉందని తెలిపారు. ఈ అవసరాలను దృష్టిలో పెట్టుకొని అవసరమైన పనులు చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అనంతపురం ఉరవకొండ - వజ్రకరూరుకి కొత్త లిఫ్ట్ స్కీంకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్. దీని ద్వారా 10వేల 500 ఎకరాలకు సాగునీరు, తాగునీరు వస్తుంది. ఈ పనులకు మంత్రి మండలి ఆమోదం. ఏపీ టూరిజం పాలసీలో క్యారవాన్ టూరిజం, హోమ్‌స్టే ప్రోత్సాహకాలు చేర్చాం. పెన్నా నదిపై మిడ్ పెన్నా రిజర్వాయర్‌ని 1962లో నిర్మించారు. గత ఐదేళ్ల నిర్వహణ చేయకపోవడంతో చాలా ఇబ్బందులు వచ్చాయి. స్త్రీ శక్తి పథకాన్ని 10 కోట్ల మంది మహిళలు ఉపయోగించుకున్నారు. రూ.15వేల చొప్పున ఆటోడ్రైవర్‌లకు ప్రతి జిల్లాల్లో ఆటోడ్రైవర్‌ల సేవలో పథకం అమలు చేస్తున్నాం. పథకం ద్వారా 2 లక్షల 90వేల 669 మందికి లబ్ధి చేకూరనుంది. ఆంధ్రప్రదేశ్ పర్యాటక విధానం 2024 -2029కి క్యారవాన్ పార్కులు, క్యారవాన్‌లకి కేబినెట్ ఆమోదం. క్యారవాన్లు పెట్టేవారికి లైఫ్ ట్యాక్స్ , పార్కులు ఏర్పాటు చేసేవారికి స్టాంప్ డ్యూటీ మినహాయింపు. బదిలీల్లో 100శాతం ఇన్సెంటివ్ ఉంటుంది. మొదటిగా వచ్చిన 25 క్యారవాన్‌లకు 100శాతం లైఫ్ టాక్స్ మాఫీ. తర్వాత వచ్చే వాటికి ఇన్సెంటివ్‌లు ఉంటాయి. హోంస్టేలకు సంబంధించి టూరిజం పాలసీకి ఆమోదం. 1 నుంచి 6 రూములు హోంస్టేల కిందకు వస్తాయని.. అంతకు మించితే హోటల్‌గా పరిగణిస్తాం. ఈ హోంస్టేలలో ఓనర్‌లు కూడా అందులో నివాసం ఉండాలి అనే నిబంధన తప్పనిసర్థి అని తెలిపారు. **నూతన ఎమ్మెల్యేల పని తీరుపై సీఎం అసంతృప్తి:** ఏపీ అసెంబ్లీలో నూతన ఎమ్మెల్యేల పని తీరుపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశాల్లో వారు ఏ అంశాలపై మాట్లాడుతున్నారో ఆలోచన ఉండాలన్నారు. కేబినెట్ భేటీ తర్వాత పలు అంశాలపై మంత్రులతో సీఎం చంద్రబాబు చర్చించారు. ఎమ్మెల్యేలను నియంత్రించాల్సిన బాధ్యత ఇన్‌ఛార్జి మంత్రులదేనని స్పష్టం చేశారు. అసెంబ్లీలో కొందరు ఎమ్మెల్యేలు ఇష్టారీతిన మాట్లాడారని ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జి మంత్రుల మధ్య సమన్వయం ఉండాలని సూచించారు. శాఖాపరంగా ఎలాంటి విమర్శలొచ్చినా గట్టిగా స్పందించాలని సీఎం దిశానిర్దేశం చేశారు. చరిత్రలో తొలిసారి 93 శాతం రిజర్వాయర్లు నింపామని విజన్2047లోని 10 సూత్రాల్లో ఇదో కీలక పరిణామమని సీఎం అన్నారు. పూర్వోదయ పథకంలో ఏపీకి స్థానం లభించిందన్న సీఎం చంద్రబాబు తద్వారా రాష్ట్రానికి రూ.65 వేల కోట్లు వచ్చే అవకాశమున్నట్లు వెల్లడించారు. అలానే ఉద్యాన, ఆక్వా రంగాల్లో రూ.65 వేల కోట్లు వచ్చే అవకాశం ఉందన్న సీఎం పశువుల హాస్టళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోనూ విజయవాడ ఉత్సవ్ తరహా ఈవెంట్లు పెట్టాలని స్థానిక పండుగలను ప్రోత్సహించేలా నెలకో ఈవెంట్ ఉండేలా చూడాలని సూచించారు. కడపలో జిందాల్ ఉక్కు పరిశ్రమను 2028 లోపు పూర్తి చేస్తామన్న చంద్రబాబు ఈ నెల 16న ప్రధాని కర్నూలు పర్యటనను విజయవంతం చేయాలని మంత్రులకు దిశానిర్దేశం చేశారు. భవిష్యత్‌లో ఇలాంటివి పునరావృత్తం కాకుండా ఆయా జిల్లాల ఇన్‌చార్జ్ మంత్రులే బాధ్యత తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 16వ తేదీన జరిగే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమావేశాన్ని విజయవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు. జీఎస్టీ వల్ల కలిగే ప్రయోజనాలు ప్రజలకు వివరించాలని సీఎం చంద్రబాబు సూచించారు.

## 100మందిపైగా మావోయిస్టుల లొంగుబాటు

>> చట్టారు. నెలరోజుల క్రితం బీజాపూర్ జిల్లా ఎస్పీ జితేంద్ర యాదవ్ ఎదుట 80 మంది మావోయిస్టులు లొంగిపోగా తాజాగా గురువారం 103 మంది మావోయిస్టులు లొంగిపోవడం సంచలనం కలిగించింది. లొంగిపోయిన వారిలో ఇరవై మంది మహిళలు ఉన్నారు. మరో 49 మంది పై సుమారు కోటి రూపాయల రివార్డు ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులకు తక్షన పరిహారం ఒక్కొక్కరికి యాభై వేల రూపాయల నగదును అందజేసారు. మావోయిస్టు ఉద్యమంలో ఉండి సాధించేది ఏమి లేదని చత్తీస్‌గఢ్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షమ పథకాలు వినియోగించుకోవాలని జనజీవన స్రవంతిలో కలిసిపోయి ప్రశాంత జీవనం గడపాలని ప్రభుత్వం లోన్ వర్కట్ (ఇంటికి రండి ) కార్యక్రమానికి ఆకర్షితులై లొంగిపోతున్నారని ఎస్పీ జితేంద్ర యాదవ్ తెలిపారు.

## వరద బాధితులకు అండగా ఉంటాం

>> ఉత్తరాంధ్ర జిల్లాల్లో దాదాపు 90 శాతం మేర విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామని ఈపీడీసీఎల్ అధికారులు వెల్లడించారు. ఈ రోజు సాయంత్రంలోగా అన్ని ప్రాంతాల్లోనూ విద్యుత్ పునరుద్ధరించాలని సీఎం అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో ఎక్కడా జాప్యం లేకుండా చూడాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. ఆమదాలవలస నియోజకవర్గంలో ఆమదాలవలస, సరుబుజ్జిలి మండలాల్లో వంశధార నదీ ఉధృతంగా ప్రవహించడంతో 2 మండలాల్లో పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. నది ఉధృతిని ఆముదాలవలస ఎస్సై బాలరాజు సిబ్బందితో కలిసి పరిశీలన చేపట్టారు. వరద ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉందని, గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని అవసరమైతే ఆమదాసలవలస నిర్వాసిత ప్రాంతానికి తరలిస్తామని గ్రామస్థులకు తెలిపారు. సరుబుజ్జిలి మండలంలో పెద్ద మాలపేట, అగ్రహారం, ఎరగాం, పాతపాడు, చిన్న కాకితాపల్లి, పెద్ద సబలాపురం వద్ద వరి, మొక్కజొన్న, ఉద్యాన పంటలు ముంపునకు గురయ్యాయి. శ్రీకాకుళం జిల్లాలోని ఆమదాలవలస మండలం మున్సిపాలిటీ పరిధిలో భారీ వర్షాల కారణంగా విద్యుత్ శాఖకు రూ.9 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని వర్చువల్ సమావేశంలో విద్యుత్ శాఖ ఏఈలు శ్రీనివాస్, రవికుమార్ తెలిపారు. భారీ వర్షం ఈదురు గాలులకు పలు ప్రాంతాల్లో 11 పెద్ద విద్యుత్ స్తంభాలు, 7 చిన్న విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో ఎక్కడికక్కడ విద్యుత్ వైర్లు తెగిపడిపోయాయని తెలిపారు. 2 రోజుల నుంచి రాత్రి, పగలు పని చేస్తూ విద్యుత్ అందిస్తున్నామని అన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని సీఎం ఆదేశించారు. కొన్ని ప్రాంతాలకు వరద ముప్పు పొంచి ఉందన్న వాతావరణ శాఖ సమాచారంతో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, ప్రజలను ఎప్పటికప్పుడు అలెర్ట్ చేయాలని సూచించారు. కంట్రోల్ రూమ్ ద్వారా 24 గంటలు సేవలు అందిస్తూ, అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. పరిస్థితిని ఎదుర్కొనేందుకు బృందాలుసిద్ధంగా ఉండాలని, అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. మంత్రులు, విపత్తునిర్వహణ బృందాలు పరిస్థితులను పరిశీలిస్తూ ఉండాలనిఅలానే అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు.

## వారం - వర్జ్యం

04-10-2025, శనివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, శుక్లపక్షం
ద్వాదశి సా.5.03
ధనిష్ఠ ఉ.9.06
వర్జ్యం : మ.3.58-సా.5.30
దు.తె.5.59-ఉ.7.35
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** ప్రముఖులను కలుసుకొని ముఖ్య విషయాలపై చర్చిస్తారు.

**వృషభం :** ఆస్తి వివాదాలు పరిష్కారమై లబ్ధి పొందాయి. దీర్ఘకాలిక ఋణాలు తీరతాయి.

**మిథునం:** ఎంతటి కార్యాన్నైనా దీక్ష పట్టుదలతో సాధిస్తారు. గృహ నిర్మాణ ఆలోచనలు సాగిస్తారు.

**కర్కాటకం :** జీవితభాగస్వామి సలహాలు స్వీకరిస్తారు. నూతన ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

**సింహం:** అవకాశాలు సద్వినియోగం చేసుకుంటారు. ప్రయాణాలు.

**కన్య :** నూతనవ్యక్తులతో పరిచయాలు. మిత్రత్వానికి దారితీస్తాయి.

**తుల :** సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. ధన లాభం.

**వృశ్చికం:** కుటుంబ సభ్యుల నుండి ప్రోత్సాహం లభిస్తుంది. వస్తు లాభం.

**ధనుస్సు:** సన్నిహితుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు.

**మకరం:** జీవిత భాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీ కారం చుడతారు.

**కుంభం:** రాజకీయ, కళా రంగాల వారికి విదేశీ పర్యటనలు వుంటాయి.

**మీనం :** భాగస్వామ్య వ్యాపారాలు మినహా పూర్తి వ్యాపారాలు లాభాల బాటలో ఉంటాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## ఇంటర్ పరీక్షలు

>> ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒకే సమయానికి రాష్ట్ర వ్యాప్తంగా పరీక్షలు జరుగుతాయి. పరీక్షల ఇలా జరుగుతాయి. ఫిబ్రవరి 23న మొదటి సంవత్సరం 2 లాంగ్వేజ్ పేపర్ -1 ఫిబ్రవరి 24న రెండో సంవత్సరం-2 లాంగ్వేజ్ పేపర్-2, ఫిబ్రవరి 25న మొదటి సంవత్సరం ఇంగ్లీష్ పేపర్ - 1 ఫిబ్రవరి 26న రెండో సంవత్సరం ఇంగ్లీష్ పేపర్ -2, ఫిబ్రవరి 27న మొదటి సంవత్సరం హిస్టరీ పేపర్ - 1, ఫిబ్రవరి 28న రెండో సంవత్సరం హిస్టరీ / బోటనీ పేపర్ - 2. మార్చి 2న మొదటి సంవత్సరం మ్యాథ్స్ పేపర్ - 1, మార్చి 3న రెండో సంవత్సరం మ్యాథ్స్ పేపర్ - 2ఏ/ సివిక్స్ - 11, మార్చి 5న మొదటి సంవత్సరం జూలాజీ / మ్యాథ్స్ - 1బి, మార్చి 6న రెండో సంవత్సరం జూలాజీ - 2/ ఎకనామిక్స్ - 2 మార్చి 7న మొదటి సంవత్సరం ఎకనామిక్స్ - 1 మార్చి 9న రెండో సంవత్సరం మ్యాథ్స్ పేపర్ - 2బి, మార్చి 10న మొదటి సంవత్సరం ఫిజిక్స్ - 1 మార్చి 11న రెండో సంవత్సరం ఫిజిక్స్ / కామర్స్ / సోషియాలజీ/మ్యూజిక్ -2 పరీక్షలు జరుగుతాయి. మార్చి 12న మొదటి సంవత్సరం కామర్స్ / సోషియాలజీ / మ్యూజిక్ -1 మార్చి 13న రెండో సంవత్సరం ఫిజిక్స్ - 2 మార్చి 14న మొదటి సంవత్సరం సివిక్స్ - 1. మార్చి 16న రెండో సంవత్సరం మోడ్రన్ లాంగ్వేజ్ / జియోగ్రఫీ-2 మార్చి 17న మొదటి సంవత్సరం కెమిస్ట్రీ - 1, మార్చి 18న రెండో సంవత్సరం కెమిస్ట్రీ -2, మార్చి 20న మొదటి సంవత్సరం పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్/లాజిక్ - 1 మార్చి 23న రెండోసంవత్సరం పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ / లాజిక్ -2 మార్చి 24న మొదటి సంవత్సరం మోడ్రన్ లాంగ్వేజ్/జియోగ్రఫీ-1 పరీక్షలు జరుగుతాయి.

## అరేబియా సముద్రంలో తొలి తుపాను 'సైక్లోన్ శక్తి'

**న్యూఢిల్లీ, అక్టోబరు 3:** దేశ పశ్చిమ తీరంలో 'సైక్లోన్ శక్తి' మంచుకొస్తోంది. ఈ యేడాది అరేబియా సముద్రంలో తొలి తుపాను ఏర్పడనుందని భారత వాతావరణశాఖ వెల్లడించింది. ద్వారకకు నైరుతి దిశగా 240 కిలోమీటర్లు పోర్‌బందర్‌కు పశ్చిమం వైపు 270 కి.మీ. దూరంలో అరేబియా సముద్రంలో ఈ అల్పపీడనం ఏర్పడింది. అది వాయుగుండంగా బలపడి గంటకు 12 కి.మీ. వేగంతో పశ్చిమ వాయవ్య దిశగా కదులుతోంది. మరో మూడుగంటల్లో ఇది తుపానుగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. రానున్న 24 గంటల్లో తీవ్ర తుపానుగా మారవచ్చని అంచనా వేసింది. ఈ తుపానుకు 'శక్తి' అని పేరు పెట్టారు. ప్రపంచ వాతావరణ సంస్థ ఆదేశాల ప్రకారం హిందూ మహాసముద్రం తీరప్రాంతంగా కలిగిన 13 దేశాలు తుపాను పేర్లను నిర్ణయిస్తాయి. భారత్, బంగ్లాదేశ్, ఇరాన్, మాల్దీవులు, మయన్మార్, ఒమన్, పాకిస్తాన్, ఖతార్ సౌదీ అరేబియా, శ్రీలంక, థాయిలాండ్, యుఎఇ, యెమెన్ ఆ దేశాలు. కొన్ని తుపానుల ప్రభావం వారం కన్నా ఎక్కువ రోజులు ఉంటుంది.

## ఆటో డ్రైవర్ సేవలో..

>> లబ్ధిదారు నష్టపోకూడదని సిఎం స్పష్టం చేయడంతో గతానికంటే ఆర్థిక సాయం పెరగడంతో పాటు లబ్ధిదారుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. గత ప్రభుత్వంలో ఉన్న రోడ్ల దుస్థితి కారణంగా ఆటో డ్రైవర్లు, వాహనదారులు అనేక సమస్యలు ఎదుర్కొన్నారు. గుంతల రోడ్ల కారణంగా ఆటోలు, ఇతర వాహనాలు దారుణంగా దెబ్బతినేవి. వీటి రిపేర్ల ఖర్చు తడిసిమోపెడు అయ్యేది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ సమస్య నుంచి గట్టెక్కించింది. రూ.1,000కోట్లు ఖర్చు చేసి రోడ్ల మరమ్మతులు చేపట్టి సాఫీగా ప్రయాణం సాగేలా చేసింది. అంతేకాకుండా పాతవాహనాలపై గత ప్రభుత్వం భారీగా వేసిన గ్రీన్ ట్యాక్స్‌ను కుదించింది. నాడు రూ.20 వేలు ఉన్న గ్రీన్ ట్యాక్స్‌ను రూ.3 వేలకు తగ్గించి వాహనదారులకు పెద్దమొత్తంలో ఉపశమనం కలిగించింది. దీంతో ఆటోలు, క్యాబ్ లపై పెద్ద ఎత్తున భారం తొలగింది. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి పథకం అందేలా చేయాలని అధికారులకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు వెళ్లాయి. అర్హత ఉండి కూడా జాబితాలో పేరు లేకుంటే... వారి సమస్యను పరిష్కరించిన వెంటనే లబ్ధిదారుల జాబితాలో చేర్చేందుకు ఏర్పాట్లు చేశారు. దీని కోసం ప్రత్యేకంగా ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రభుత్వం ఓ వ్యవస్థను ఏర్పాటు చేసింది. వాట్సాప్ ద్వారా ఒక ప్రత్యేక గ్రీవెన్స్ హ్యాండ్లింగ్ సిస్టమ్‌ను కూడా అందుబాటులోకితెచ్చింది. లబ్ధిదారులు తప్పనిసరిగా ఆంధ్రప్రదేశ్‌లో చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## రక్తం చిందిన దేవరగట్టు

>> నాటుసారా, అక్రమ మద్యం అరికట్టడంలో జిల్లా ఉన్నతాధికారులు పూర్తిగా విఫలం చెందారని భక్తులు ఆరోపిస్తున్నారు. అర్ధరాత్రి దేవరగట్టు కొండపై విజయదశమి బన్ని ఉత్సవ కర్రల సమరం అత్యంత ఉత్కంఠ, ఉద్రిక్త వాతావరణంలో కొనసాగింది. జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ ఐపిఎస్, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ల పర్యవేక్షణలో సుమారు 800మందితో భారీ పోలీసు బందోబస్తు మధ్య దేవరగట్టు బన్ని జైత్రయాత్ర జరిగింది. సుదూర ప్రాంతాల నుండి లక్షల్లో భక్తులు దేవరగట్టు జైత్రయాత్రను తిలకించేందుకు తరలివచ్చారు. రాత్రి 11గం॥ల వరకు కాలినడకన వేలాదిగా భక్తులు దేవర గట్టు ప్రాంతానికి చేరుకున్నారు. అర్ధరాత్రి గిరిపైకి డుర్రు..గోపరాక్.. బహు పరాక్ అంటూ భక్తాదులు ఒక్కసారిగా ఇనుప రింగుకర్రలతో కదంతొక్కారు. అప్పటివరకు ప్రశాంతంగా ఉన్న దేవరగట్టు పరిసర ప్రాంతం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. కాగడాలు, దివిటీలతో నెరణికి, నెరణికి తాండ, కొత్తపేట, ఎల్లార్తి గ్రామాలతో పాటు చుట్టుపక్కల గ్రామప్రజలు కర్రలతో సమరానికి సై అం టూ ఉరకలేస్తూ గట్టుపైకి చేరుకున్నారు. శ్రీ మాళమల్లేశ్వరస్వాముల కళ్యాణ మహోత్సవం అనంతరం ఒంటిగంట ప్రాంతంలో కొండపై నుండి పాదాల కట్ట వద్దకు ఉత్సవ పల్లకిని ఊరేగింపుగా(జైత్రయాత్ర) తీసుకొచ్చారు. మణి, మల్లాసుర అనే రాక్షసుల బారి నుండి రుషులు తమనురక్షించుకునే క్రమంలో మాళవి మల్లేశ్వరులను ఆశ్రయించి రాక్షసులను అంతమోదించిన పిమ్మట విజయబావుట ఎగరేస్తూ మాలమల్లేశ్వరుల కళ్యాణోత్సవ జైత్రయాత్ర నిర్వహించడం అనాదిగా వస్తున్న సాంప్రదాయం. ప్రతి ఏట జరిగే ఈ జైత్రయాత్రలో చెదురు ముదురు సంఘటనలు మినహా ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో పోలీసులు ఊపిరిపీల్చుకునేవారు. ముళ్ల బండవద్ద ఉన్న రక్తపడి వద్ద గొరవయ్య రక్తపుబొట్టు చిందించడంతో జైత్రయాత్రకు తెరపడింది. **వైభవంగా కళ్యాణ మహోత్సవం:** శ్రీ మాలమ్మకు, శ్రీ మల్లయ్యకు వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి కళ్యాణోత్సవం నిర్వహించారు. విశేష పూజల అనంతరం స్వామి ఉత్సవ మూర్తులను పల్లకిలో ఉంచి గిరిపై నుండి సింహాసన కట్టవద్దకు తీసుకొచ్చారు. మరోవైపు ఉత్సవ మూర్తులను దక్కించుకోవడానికి కర్రలతో తలపడ్డారు. ఈ క్రమంలో 100మందికిపైగా భక్తులకు గాయాలు కాగా 40మంది తీవ్ర గాయాలయ్యాయి. ఐదు మంది భక్తులు హోళగుంద మండలం బిజిహాళ్లి గ్రామానికి చెందిన గురులింగ, ధర్మవరం సమర, విరుపాపురం వీరేష్, తెర్నేకల్ మారెన్న, అరికెర బలరాం లకు తీవ్రగాయాలు కాగా వారిని దేవరగట్టులో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం నుండిఆదోని, ఆలూరు ఆసుపత్రులకు వైద్యులు రెఫర్ చేశారు. అలాగే అరికె రకుచెందిన తిమ్మప్ప(40), ఆదోనికిచెందిన ఆంజనేయ(50)లు మృతిచెందారు. **భవిష్యవాణి వినిపించిన గిరిమల్లయ్య స్వామి:** ఉత్సవమూర్తులను పాదాల గట్టు, శమీవృక్షం, రక్తపడి వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం పల్లకిని ఎదురు బసవన్నగుడి వద్దకు తీసుకొచ్చారు. ఆక్కడ ఆలయ పూజారి గిరిమల్లయ్య స్వామి భవిష్యవాణి (కార్ణికం) కన్నడ భాషలో వినిపించారు. ఈ ఏడాది తెల్ల పంట అయిన పత్తి రూ.7200లు, జొన్నలు రూ.3400లు ముందుగా భారీగా పెరిగి మళ్లి తగ్గుతాయన్నారు. ఉత్సవ మూర్తులు పల్లకిలో సింహాసన కట్టవద్దకు చేరిన వెంటనే గొరవయ్యలు డుర్రుగొబరక్ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు.

## ఆసక్తిలేని సిఎం

>> కృష్ణా జలాల విషయంలో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని, 1995లో ఆల్మట్టి ఎత్తు 209.16 మీటర్ల నుండి 524.25 మీటర్లకు పెంచుతుంటే కనీసం పట్టించుకోలేదని పేర్కొన్నారు. అప్పట్లోనూ టిడిపి ఎంపిల బలం మీదే కేంద్రం ఆధారపడి ఉందని అన్నారు. అయినా రాష్ట్ర ప్రయోజనాల కోసం ఆ బలాన్ని వాడలేదని విమర్శించారు. గడిచిన రెండున్నర దశాబ్దాలుగా వర్షాభావం నెలకొన్న సంవత్సరాల్లో ఆల్మట్టి ఎత్తు పెంపు ప్రభావం తీవ్రంగా ఉందని, కృష్ణా జలాలపై ఆధారపడ్డ ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. ఇప్పుడు మరలా ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే ఆల్మట్టి ఎత్తు పెంచుతున్నారని తెలిపారు. నీటి నిల్వ సామర్థ్యాన్ని 129 టిఎంసిల నుండి 279 టిఎంసిలకు పెంచాలని నిర్ణయం తీసుకోవడంతోపాటురానున్న మూడేళ్లలో రూ.70 వేల కోట్లు ఖర్చు చేయాలని కర్ణాటక నిర్ణయించిందని తెలిపారు. ఇంత జరుగుతున్నా ముఖ్యమంత్రిగా చంద్రబాబు కనీస స్పందన లేదని విమర్శించారు. ఇప్పుడు కూడా కేంద్రంలో బలం ఉందని, దాంతో ప్రాజెక్టు ఎత్తు పెంపును ఆపాలని కోరారు. అలాగే బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ముందు రాష్ట్రం వినిపిస్తున్న వాదనలు బలహీనంగా ఉన్నాయని పేర్కొన్నారు.

VIJAYAWADA MUNICIPAL CORPORATION
'E' Procurement Notice No.27/VMC/CDB/2025-26, Dt.03-10-2025
Roads, Drain, Culvert, Water supply, Buildings, Labour Charges, repairs (Total 44 works)-Est. Amount Rs.713.86 Lakhs
All rights are resersed to the Commissioner to Cancel or Reject the tenders without assigning any reasons there of
Further details and any corrigendum can be seen @www.tender.apeprocurement.gov.in
S/d-
for COMMISSIONER

మాన్యువల్ గత వారం రోజుల్లో వెలువడిన పుస్తకాలు

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

గుంటూరు

fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

4-10-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 243 పేజీలు: 12 వెల: 6.50

జిఎస్టీ వసూళ్లలో ఏపి రెండో స్థానం

ప్రముఖ నవలా రచయిత లల్లాదేవి కన్నుమూత

9లో

## వరద బాధితులకు అండగా ఉంటాం



**శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ తదితర జిల్లాల కలెక్టర్లతో సమీక్షించిన సిఎం చంద్రబాబు**

**మృతుల కుటుంబాలకు రూ.4లక్షల పరిహారం**

**వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని సిఎం ఆదేశం**

**విజయవాడ,అక్టోబరు3,ప్రభాతవార్తప్రతినిధి:** భారీ వర్షాలకు పంట,ఆస్తి నష్టం జరిగిన వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు.భారీ వర్షాల బాదిత కుటుంబాలకు తక్షణ నష్టం పరిహారం అందిస్తామన్నారు.ఎవ్వరు కంగారు పడవద్దని,వరదల్లో చిక్కుకున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామని చెప్పారు.వరదలు పూర్తిగా తగ్గేవరకు వరద సహాయక శిబిరాల్లో ఆశ్రితులను ప్రభుత్వమే ఆదుకుంటుందని వివరించారు.ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు, వరద పరిస్థితులపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ తదితర జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. ప్రస్తుతం జిల్లాల్లో ఉన్న పరిస్థితులను సీఎం అడిగి తెలుసుకున్నారు. గొట్టా బ్యారేజికి 1.89 లక్షల క్యూసెక్కులు, తోటపల్లికి 44 వేల క్యూసెక్కుల వరద వస్తోందని శ్రీకాకుళం కలెక్టర్ వివరించారు. ఒడిశాలోని ప్రాంతాల్లో పడిన భారీ వర్షాల కారణంగా వంశధారకు 1.05 లక్షల క్యూసెక్కుల నీరు వస్తోందని తెలిపారు. భారీ వర్షాలు, ప్రమాదాల కారణంగా నలుగురు మృతి చెందినట్లు అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. విశాఖలోని కంచరపాలెంలో ఒకరు, శ్రీకాకుళం జిల్లా మందసలో ఇద్దరు, పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో ఒకరు మృతి చెందినట్లు తెలిపారు. బాధితకుటుంబాలకు 4 లక్షల రూపాయల చొప్పున పరిహారం ఇవ్వాలని అధికారులను సీఎం ఆదేశించారు. ప్రస్తుతం ఉత్తరాంధ్ర జిల్లాల్లో వర్షం లేదని, ఎగువ నుంచి వస్తున్న ప్రవాహాలతో నదుల్లో వరద ఉందని సీఎంకు వివరించారు. భారీ వర్షాల కారణంగా కొన్ని చోట్ల చెట్లు కూలాయని, ఇప్పటికే 90 శాతం కూలిన చెట్లను తొలగించామని చెప్పారు. >>2

# అమరావతికి 'భూసేకరణ'

**లాండ్‌పూలింగ్‌లో ఇవ్వని భూములను సేకరణ ద్వారా తీసుకోవడానికి కేబినెట్ ఆమోదం**

**కారవాన్ టూరిజం, హోంస్టేల పాలసీని ఆమోదించిన కేబినెట్**

**పలు సంస్థలకు భూకేటాయింపులు, కార్మిక చట్టాల్లో సవరణలకు గ్రీన్‌సిగ్నల్**



శుక్రవారం సిఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రి మండలి సమావేశం

**సిఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలు**

**విజయవాడ,అక్టోబరు 3,ప్రభాతవార్తప్రతినిధి:**ఎన్నికల వాగ్దానాలతో నిమిత్తం లేకుండా, ప్రజా అవసరాలను గుర్తించి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు.పేదరికం లేని వ్యవస్థ మనకు ముఖ్యమన్నారు, ఆర్థికంగా ఇబ్బందులున్నా మనం అనేక నూతన పథకాలు అమలు చేస్తున్నామన్నారు.ఆదాయం,సంపద సృష్టికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం మధ్యాహ్నం తరువాత ఏపీ సచివాలయంలో మంత్రి మండలి సమావేశం దగ్గరదగ్గర మూడు గంటల పాటు జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై కేబినెట్‌తో చర్చించారు సీఎం చంద్రబాబు. ల్యాండ్ ఇన్సెంటివ్ ఫర్ టెక్నికల్ హబ్స్‌కు కేబి నెట్ ఆమోదించింది. జలవనరుల శాఖ పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆటో, క్యాబ్ డ్రైవర్లకు రూ.15 వేలు చొప్పున ఇచ్చేందుకు ఆమోదం తెలిపింది. కారవాన్ పర్యాటకంపై నిర్ణయం తీసుకుంది. అమృత్ పథకం 2.వీ పనులను ఏపీ కేబినెట్ ఆమోదించింది .ఈ బేటీలో రాజధాని అమరావతి నిర్మాణంలో మరో కీలక ముందడుగు పడింది. అమరావతి నిర్మాణం కోసం ల్యాండ్ పూలింగ్ ద్వారా సీఆర్డీఏకు ఇవ్వని భూములను భూసేకరణ ద్వారా తీసుకునేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రాజధాని అమరావతి కోసం ల్యాండ్ పూలింగ్ కోసం కొందరూ రైతులు భూములు ఇవ్వలేదు. వారి నుంచి భూసేకరణ చట్టం 2013 ద్వారా భూములు తీసుకోవాలని కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఏపీ కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ల్యాండ్ ఫూలింగ్‌కు భూములు ఇచ్చి ఫూలింగ్‌కు భూములు ఇవ్వని రైతుల భూముల్లో ప్లాట్‌లు వచ్చిన వారికి ఊరట లభించింది. అటూ ప్రభుత్వ భవన సముదాయాల పక్కన ఉండి ల్యాండ్ ఫూలింగ్‌కు ఇవ్వని భూములను కూడా సేకరణ ద్వారా తీసుకోవాలని నిర్ణయం తీసుకుంది మంత్రి మండలి. ఈ నిర్ణయంతో అమరావతి భూముల విషయంలో పూర్తిస్థాయిలో అడ్డం కులు తొలగిపోయాయి. ఏపీలో అన్ని చెరువులు పూర్తి స్థాయిలో నీటి నిల్వాలు ఉన్నాయని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ సందర్భంగా నీటి పారుదల శాఖ అధికారులను అభినందించారు సీఎం చంద్రబాబు. పూర్ణోదయ పథకంలో ఆంధ్రప్రదేశ్‌ను చేర్చాలని సూచించారు. విజయవాడ ఉత్సవాన్ని విజయవంతం చేసిన నిర్వాహకులను సీఎం అభినందించారు. ఇలాంటి ఉత్సవాలు ప్రతి జిల్లాలో జరిగే విధంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కడప స్టీల్ ప్లాంట్ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. హంద్రీ-నీవా ప్రాజెక్ట్‌లో అమిద్యాల లిఫ్ట్ స్కీంని కేబినెట్ ఆమోదించింది ప్రకాశం బ్యారేజ్- దివిసీమ ప్రాంతాల్లో వరద నష్టం పనులకు అనుమతులను గత సంవత్సరమే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకోసం రూ.107 కోట్లను కూటమి ప్రభుత్వం విడుదల చేసిందని గుర్తుచేశారు. ప్రకాశం బ్యారేజీ వద్ద, దివిసీమ వద్ద వీక్ అయిన బండ్స్‌ను రూ.4.49 కోట్లకు పనులు చేయడానికి మంత్రిమండలి ఆమోదం తెలిపిందని అన్నారు. వైఎస్సార్ కడప జిల్లాలో మైలవరం రిజర్వాయర్‌ని 1981- 1982లో నిర్మాణం చేశారని తెలిపారు. 2021లో వచ్చిన భారీ ఫ్లడ్‌ను పట్టించుకోకపోవడంతో రూ. 3 కోట్లతో రిపేర్లు చేయించడానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. లక్ష 15వేలఎకరాలకు నీరు అందించడం, తిరుపతి, తిరుమలకు తాగునీరు అందించేందుకు 2017-2018లో టెండర్‌ల >>2



# త్వరలో ఆపరేషన్ సిందూర్-2

**ఈసారి ప్రపంచపటంలో పాక్ ఉండదు: ఆర్మీచీఫ్ జనరల్ ఉపేంద్రద్వివేది తీవ్ర హెచ్చరిక**

**న్యూఢిల్లీ, అక్టోబరు 3:** ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌కు భారత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది తీవ్ర హెచ్చరికలు చేశారు. 'సీమాంతర ఉగ్రవాదాన్ని ఆపకపోతే, ప్రపంచ పటం నుంచి పాకిస్తాన్‌ను లేకుండా చేస్తాం. దేవుడి అనుమతి ఉంటే అలాంటి అవకాశం త్వరలోనే లభిస్తుంది. భారత బలగాలు ఆపరేషన్ సిందూర్‌లో చూపించిన సంయమనాన్ని ప్రతిసారీ చూపించలేవు. ఈసారి నిర్ణయాత్మక, అత్యంత శక్తివంతమైన సమాధానం ఇస్తాం' అని హెచ్చరించారు. తక్షణమే పాక్ గడ్డపై ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడాన్ని ఆపేయాలని హితవు పలికారు. రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్ జిల్లా అనుప్‌గఢ్‌లో సైనికులతో ఆర్మీ చీఫ్ మాట్లాడుతూ, భవిష్యత్ ఘర్షణల్లో భారత్ విధానం 'ఆపరేషన్ సిందూర్' కంటే చాలా దూకుడుగా ఉంటుందని అన్నారు. ఆపరేషన్ సిందూర్ 1.0లోఉన్నట్లుగా కాకుండా,ఆపరేషన్ సిందూర్ 2.0లో పాకిస్థాన్‌పై మరింత తీవ్రమైన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. భవిష్యత్తులో తాము తీసుకునే చర్యలు, పాకిస్థాన్ తన ఉనికి గురించి ఆలోచించేలా చేస్తాయని జనరల్ ద్వివేది వ్యాఖ్యానించారు. భూమిపై ఉండాలనుకుంటే పాకిస్థాన్ తక్షణమే సీమాంతర ఉగ్రవాదాన్ని ఆపాలని గట్టిగా హెచ్చరికలు చేశారు.ఈసందర్భంగా సైనికులు ఎలాంటి పరిస్థితులకైనా సర్వసన్నద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఆటో డ్రైవర్ సేవలో..

**కొత్త పథకాన్ని నేడు ప్రారంభించనున్న సిఎం చంద్రబాబు**

**ఆటో, క్యాబ్ డ్రైవర్లకు యేటా రూ.15 వేలు**

**2.90 లక్షల మందికి లబ్ధి**

**విజయవాడ, అక్టోబరు 3,ప్రభాతవార్తప్రతినిధి:** కూటమి ప్రభుత్వం సంక్షేమం దిశగా మరో అడుగు వేసింది. ఇప్పటికే పెద్దఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ప్రభుత్వం ఈ క్రమంలో డ్రైవర్ల సంక్షేమం కోసం 'ఆటో డ్రైవర్ సేవలో..' పథకానికి శ్రీకారం చుట్టనుంది. రాష్ట్రంలోని సొంత ఆటో రిక్షా, మోటార్ క్యాబ్, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు ఆర్థికంగా అండగా నిలబడేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ పథకం రూపొందించింది. ఈ పథకం కింద అర్హులైన డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేల చొప్పున ఇవ్వ నున్నారు. ఈ పథకాన్ని శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభిం చనున్నారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిధిలో ఉదయం 11 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ హాజరుకానున్నారు. సొంత ఆటో, క్యాబ్ కలిగి వాటిపై ఆధారపడి జీవిస్తున్న వారి కోసం రూపొందించిన ఈ పథకానికి రాష్ట్రవ్యాప్తంగా 2,90,669 మంది లబ్ధిదారులను అర్హులుగా గుర్తించారు. వీరి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.436 కోట్లను కేటాయించింది. ఈ నిధులను నేరుగా డ్రైవర్ల ఖాతాలో ప్రభుత్వం జమ చేయనుంది. గత ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు కేవలం ఏడాదికి రూ.10వేలు మాత్రమే ఇచ్చింది. కానీ కూటమి ప్రభుత్వం గత పాలకులకంటే 50 శాతం అదనంగా రూ.15 వేలు ఇస్తోంది. అలాగే గత ప్రభుత్వం ఈ పథకానికి కేవలం 2,61,516 మందిని మాత్రమే అర్హులుగా గుర్తించి రూ. 261.51 కోట్లే ఖర్చు పెట్టింది. గత ప్రభుత్వంతో పోల్చుకుంటే కూటమి సర్కారులో లబ్ధిదారులు సుమారు 30 వేల మంది పెరిగారు.. అలాగే డ్రైవర్లకు రూ.175 కోట్లు అదనంగా లబ్ధి చేకూరుతోంది. కూటమి ప్రభుత్వం అందిస్తున్న ఈ పథకంలో ఆటో డ్రైవర్లు 2,25,621 మంది, త్రీ వీలర్ ప్యాసింజర్ వాహనాల డ్రైవర్లు 38,576 మంది, మోటార్ క్యాబ్ డ్రైవర్లు 20,072 మంది, మ్యాక్సి క్యాబ్ డ్రైవర్లు 6,400 మంది ఉన్నారు. విశాఖ పట్నం జిల్లాలో అత్యధికంగా 22,955 మంది డ్రైవర్లకు లబ్ధి కలగనుంది. వాస్తవంగా చూస్తే ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేలు అనే కార్యక్రమం పార్టీ మేనిఫెస్టోలో చెప్పలేదు. అయితే స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకం అమలు నేపథ్యంలో ఆటో డ్రైవర్లకు సాయం అందించాలనే ఉద్దే శ్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభిస్తోంది. ఏ ఒక్క >>2

## వచ్చే ఫిబ్రవరిలో ఇంటర్ పరీక్షలు

**షెడ్యూలు విడుదల చేసిన ఇంటర్ బోర్డు**

**విజయవాడ,అక్టోబరు 3,ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ బోర్డు 2026 సంవత్సరానికి సంబంధించిన ఇంటర్ పరీక్షల తాత్కాలిక షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఏపీ ఇంటర్ బోర్డు. 2026 ఫిబ్రవరి 23వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మార్చి 24వ తేదీ వరకు పబ్లిక్ ఎగ్జామ్స్ జరగనున్నాయి. ఎన్విరాన్ మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష జనవరి 23వ తేదీన జరుగుతుంది. ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు జరుగుతాయి. ఫస్ట్ ఇయర్ పరీక్షలు ఫిబ్రవరి 23న సోమవారం ప్రారంభమవుతాయి. సెకండ్ ఇయర్ పరీక్షలు ఫిబ్రవరి 24న మంగళవారం మొదలవుతాయి. >>2

## 100మందిపైగా మావోయిస్టుల లొంగుబాటు

**పోలీసులకు లొంగిపోయిన వారిలో సీనియర్‌నేత మల్లోజుల ఉన్నట్లు సమాచారం**

**చర్ల,అక్టోబరు 3, ప్రభాతవార్త:** దాదాపు నాలుగుదశాబ్దాల పాటు చత్తీస్‌గఢ్ దండకారణ్యంలో సామాంతర పాలన చేసిన మావోయిస్టు పార్టీ నేడు గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటుంది.ఉద్యమానికి ఊతం ఇచ్చిన ప్రాంతంలో నేడు మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.గడిచిన ఏడాదిన్న కాలంలో మునుపెన్నడూ చవిచూడవి ఎన్ కౌంటర్లు లొంగుబాట్లు ఆపార్టీ కకావికలం చేస్తుంది.కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా 2026 మార్చి 31 నాటికి మావోయిస్టు రహిత సమాజాన్ని చూస్తారని ప్రకటించారు.అందుకు అణుగుణంగానే నేటి పరిస్థితులు కనిపిస్తున్నాయి.ఇప్పటికే కేంద్ర కమిటీ సభ్యులను ఐదుగురు పొగొట్టుకున్న పార్టీకి మరో ఇద్దరు కేంద్రకమిటీ సభ్యులు సుజాత మల్లోజుల వేణుగోపాలరావు పోలీసుల ఎదుట లొంగిపొయారు.దట్టమైన దండకారణ్యంలో వర్షాకాలంలో సైతం విశృత కూబింగ్ చేపడుతున్న భద్రతా బలగాల గాలింపు చర్యలను ఎదుర్కొవడం మావోయిస్టులకు పెను సవాల్ గా మారింది. భద్రాతా బలగాల దాటికి తట్టుకోలేక ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఉద్యమాన్ని ముందుకు సాగిస్తున్నారు కొందరు.మరికొందరు పార్టీలో ఉండి ప్రాణాలు పొగొట్టుకోవడం కన్నా లొంగిపొయి ప్రజాజీవనంలో కలవడమే మంచిది అన్న అలోచనతో లొంగుబాట్లకు శ్రీకారం >>2



## రాష్ట్ర ప్రయోజనాలపై ఆసక్తిలేని సిఎం

**మాజీ సిఎం జగన్**

**విజయవాడ,సెప్టెంబరు 3,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర ప్రయోజననాల పట్ల సీఎం చంద్రబాబుకు ఏ మాత్రం ఆసక్తి లేదని మాజీ సిఎం వైఎస్ జగన్ విమర్శించారు. చంద్రబాబు పరిపాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి కట్టు కథలు అల్లుతున్నారన్నారు. కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి ఎత్తు పెంచుతున్నా.. ముఖ్యమంత్రి చంద్రబాబు కనీసం స్పందించడం లేదన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను పూర్తిగా గాలికొదిలేశారని . దీనిపై సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో ప్రకటన విడుదల చేశారు. ఆల్మట్టి ఎత్తు పెంచడం కోసం కర్ణాటక చకచకా అడుగులు వేస్తూ కేబినెట్లోనూ ఎత్తు పెంపు కోసం ఆమోదం తెలుపుకుందని తెలిపారు. దీనిపై సిఎం చంద్రబాబుకు చీమకుట్టినట్లయినా లేదని, రాష్ట్ర హక్కులను కాపాడాల్సిన స్థానంలో ఉండి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడలేకపోతే ఎలా? అని ప్రశ్నించారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న సమయం లోనూ >>2

# రక్తం చిందిన దేవరగట్టు



బన్ని జైత్రయాత్రలో కర్రలతో తలపడుతున్న భక్తులు

**ఆగని రింగుకర్రల సమరం**


**బన్ని జైత్రయాత్రలో ఇద్దరు మృతి, 100 మందికి పైగా గాయాలు**

**లక్షల్లో వచ్చిన వివిధ రాష్ట్రాల భక్తులు**

**ఆలూరు,అక్టోబరు 3,ప్రభాతవార్త:** కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలోని హొళగుంద మండలం దేవరగట్టు బన్ని జైత్రయాత్ర దేశవ్యాప్తంగా ప్రఖ్యాతిగాంచింది. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని దేవరగట్టు కొండపై మాళవి మల్లేశ్వర స్వాముల జైత్రయాత్ర వేడుకలో రక్తం చిందింది. సాంప్రదాయ వేడుకగా జరుగుతున్న ఈ జైత్రయాత్రను తిలకించేందుకు దేవరగట్టు చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో పాటు తెలంగాణ, కర్ణాటక,తమిళనాడు,మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుండి లక్షల్లో భక్తులు తరలివచ్చారు. శ్రీ మాళమల్లేశ్వరుల కళ్యాణ మహోత్సవం అనంతరం కొండపై నుండి ఊరేగింపుగా శ్రీ మాళమల్లేశ్వర స్వాముల ఉత్సవమూర్తుల వేడుక ఉత్కంఠభరితంగా కొనసాగింది. అనాదిగా వస్తున్న ఆచారంమేరకు నేరణి, నెరణికి తాండ, కొత్తపేట, దేవరగట్టు గ్రామస్తులు మాళమల్లేశ్వ రుల ఉత్సవ మూర్తులను గురువారం అర్ధరాత్రి అత్యంత భక్తిశ్రద్ధలతో గిరిపై నుండి కిందకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. ప్రజలు,భక్తులు డివిటిలు పెట్టుకొని రింగుకర్రలతో దుర్రు.. గొబరక్ అంటూ నినదిస్తూ గట్టుపైకి ఒక్కసారిగా ఎగబా కారు. దేవరగట్టులో ప్రతిఏటా విజయదశమి రోజున అర్ధరాత్రి జరిగే మాళవి మల్లేశ్వర స్వామి బన్ని ఉత్సవ ఊరే గింపు సంబరం ఇనుప రింగుకర్రల సమరానికి వేదికగా నిలిచింది. సాంప్రదాయాల ముసుగులో కొందరు రింగుకర్రలతో తలపడి ఆటవిక చర్యలకు పాల్పడుతుండడం సాదారణంగా మారిపోయింది. కర్రల సమరం కట్టడికి పోలీసులు చేపడుతున్న ముందస్తు చర్యలు భక్తుల కర్రల కరతాళనృత్యం ముందు చిన్నబోయాయి. గత 15రోజుల నుండి దేవరగట్టు చుట్టుపక్కల గ్రామాల్లో ప్రజలకు బన్ని ఉత్సవాలపై కలెక్టర్, ఎస్పితో పాటు అధికారులు ముందస్తు అవగాహన కార్యకమ్రాలు చేపట్టినా ఫలితం లేకుండా పోయింది. అలాగే >>2

## భారీ వర్షాలు, వరదలపై హోంమంత్రి అనిత సమీక్ష

**సచివాలయం,అక్టోబరు 3,ప్రభాతవార్త :** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలతో నాగావళి,వంశధార నదులు ఉప్పొంగుతున్ననేపథ్యంలో హోంమంత్రి వంగలపూడి అనిత శ్రీకాకుళం, విజయనగరం, మన్యంజిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వరద >>2



వార్త

తాము అజ్ఞానులమని ప్రజలు తెలుసుకోవడం కష్టం. ఎందుకంటే ఆ విషయం తెలుసుకోవడానికి విజ్ఞానం ఉండాలి.

-జేమ్స్ టైల్

# కాటేస్తున్న కాలుష్యం

కాలుష్య నివారణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆచరణయోగ్యం కాని విధానాలతో ప్రయోగాలు చేస్తూ రోజురోజుకు సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి. అన్నింటి కంటే ముఖ్యంగా పాలకులు కాలుష్య నివారణకు రూపొందిస్తున్న నిబంధనలు, చట్టాలను త్రికరణశుద్ధిగా అమలు చేయకపోవడంతో పర్యావరణం విషతుల్యంగా మారుతున్నది. దేశవ్యాప్తంగా కోట్లాది మంది అనేక వ్యాధులకు లోనవుతున్నారు. మరెందరో దీర్ఘకాలిక వ్యాధుల బారినపడి మంచానికే పరిమితమై అసువులు బాస్తున్నారు. అంతకంతకు కాలుష్యమేఘాలు కమ్ముకోవడం ఆందోళన కలిగించే అంశం. అన్నింటికంటే ముఖ్యంగా దేశంలోని అనేక నగరాల్లో పరిస్థితి రోజురోజుకు దారుణంగా తయారవుతున్నది. దేశ రాజధాని ఢిల్లీలో వాయుకాలుష్యం అదుపు తప్పిపోతున్నది. దీపావళి పండుగ వస్తున్నదంటేనే సామాన్యుల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ పండుగ సందర్భంగా విధించిన నిబంధనలు కొందరు పాటించకపోవడం, ఇష్టానుసారంగా దీపావళి మందులు కాల్చడంతో ప్రతిసారి పరిస్థితి అదుపు తప్పుతున్నది. ఈయేడాది ఢిల్లీలో రాబోయే దీపావళి సందర్భంగా మందులు కాల్చడం నిషేధించారు. అయితే ఒక్క ఢిల్లీలోనే కాలుష్యం వెదజల్లే ఈ దీపావళి మందులను నియంత్రించడం ఏమిటని, మిగిలిన ప్రాంతాల్లో ఎందుకు కట్టడి చేయలేరని న్యాయస్థానాలు కూడా ప్రశ్నిస్తున్నాయి. గత రెండు, మూడేళ్లుగా ఇష్టానుసారంగా దీపావళి మందులు కాల్చడంతో పరిస్థితి అదుపు తప్పిపోయింది. దీంతో ఏకంగా కేవలం కాలుష్యం కారణంగానే అక్కడ పదిరోజులపాటు పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. దీనికితోడుఎందరో ఈ కాలుష్య భూతానికి భయపడి చలికాలంలో ఢిల్లీవదలి కుటుంబ సమేతంగా సుదూర ప్రాంతాలకు వెళ్లి కాలుష్య భూతం శాంతించిన తర్వాతనే ఢిల్లీకి చేరుకుంటున్నారు. ఇలా వెళ్లే వారి సంఖ్య రానురాను పెరిగిపోతున్నది. ఢిల్లీలోనే కాదు దేశంలో అనేక నగరాలలో కాలుష్య పరిస్థితి ప్రమాదస్థాయికి చేరుకుంటున్నదనే వార్తలు అందుతున్నాయి. ముఖ్యంగా కోల్‌కతా, ముంబయి నగరాలతోపాటు దక్షిణాదిన బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లలో వాయు నాణ్యత క్షీణిస్తున్నది. మరొకపక్క ఢిల్లీకి పొరుగునున్న యుపి, హర్యానా, పంజాబ్, రాజస్థాన్‌లలో కూడా ఈ కాలుష్య భూతం విస్తరిస్తూనే ఉన్నది. ఆప్రాంతాల్లో వ్యవసాయ వ్యర్థాలను కాల్చడంతో దట్టమైన పొగలు వ్యాపించి కాలుష్యాన్ని పెంచుతున్నాయి. ఇది ప్రతియేడాది జరుగుతున్నా, అధికారులు నియంత్రిస్తున్నట్లు చెప్తున్నా ఆచరణకు నోచుకోవడంలేదు. కొన్నినగరాల్లో వాయు కాలుష్యం ప్రజారోగ్యాన్ని పట్టిపీడిస్తుంటే మరికొన్ని నగరాల్లో పారిశ్రామిక కాలుష్యం తీవ్రస్థాయిలో ఉన్నట్లు వెలుగు చూసింది. హైదరాబాద్ నగరంలో నీటికాలుష్యంతోపాటు నిర్మాణ రంగంవల్ల వచ్చే గాలిని పీల్చడంవల్ల ధూళికణాలతో ఆరోగ్యం దెబ్బతింటున్నట్లు వైద్యనిపుణులే చెబుతున్నారు. ఇక గ్రామాల నుండి నగరాలకు వలసలు పెరిగిపోవడంతో ఒక క్రమపద్ధతి ప్రణాళిక లేకుండా ఎక్కడపడితే అక్కడ ఇష్టానుసారంగా కాలనీలను నెలకొల్పకుంటున్నారు. కొన్నిప్రాంతాల్లో చిన్ననీటి వనరులను ఆక్రమించుకొని నిర్మాణాలు జరగడంవల్ల వర్షాకాలంలో ఆ కాలనీల్లో నీరు బయటకు వెళ్లడం గగనమైపోతున్నది. మురికినీరు బయటకు వెళ్లే మార్గాలు లేక దోమల్లాంటి క్రిమికీటకాలకు స్థావరాలై రకరకాల వ్యాధులను విస్తరింపచేస్తున్నాయి. మురికివాడల నిర్మూలనకు ప్రత్యేకకార్యక్రమం చేపడుతున్నా ఈవలసలతో అవి ఎక్కడికక్కడ పెరిగిపోతున్నాయి. కాలుష్యం తగ్గించేందుకు చేస్తున్న ప్రయత్నాలు అంతగా సఫలీకృతం కావడం లేదు. 2019లో భారత్‌లో ఎంపిక చేసిన 102నగరాల్లో ధూళికణాలు ముప్పును ఇరవైశాతం వరకు తగ్గించేందుకు జాతీయ వాయుశుద్ధి కార్యక్రమాన్ని ఆరంభించారు. ఆతర్వాత క్రమేపీ దాన్ని మరో ముప్పైనగరాలకు విస్తరించారు. 2025-26 నాటికి సూక్ష్మకణాలను యాభైశాతం వరకు నియంత్రిస్తామంటూ లక్ష్యాన్ని నిర్దేశించుకొని దాదాపు ఏడువేల కోట్ల రూపాయ లకుపైగా వెచ్చించినా పరిస్థితుల్లో పెద్దగా మార్పురావడం లేదు. పశ్చిమ బెంగాల్, యూపి, తదితర రాష్ట్రాల్లో నిబంధనలు పట్టించుకోవడం లేదు. అంతర్జాతీయంగా చైనా, అమెరికా లాంటి దేశాలు వాయుకాలుష్యాన్ని నియంత్రించడంలో సఫలీకృతం అవుతున్నట్లు అనేక అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. కాలుష్యానికి మూలమైన దాదాపు ఐదువందలకు పైగా కార్ల మోడళ్లను నిషేధించి ప్రజారవాణా వ్యవస్థను కాలుష్యరహితంగా మార్చేందుకు చైనా తీసుకున్న నిర్ణయాలు సత్ఫలితాలు ఇచ్చాయి. బొగ్గు ఆధారిత విద్యుత్ కర్మాగారాల నిర్మాణాలకు ఆ దేశం దాదాపు ఫుల్‌స్టాప్ పెట్టించింది. అడవుల సంరక్షణకు ప్రత్యేకదృష్టిసారించింది. భారత్‌లో పర్యావరణాన్ని కాలుష్యం చేస్తూ మోతాదుకు మించిన పొగను వదులుతున్న వాహనాలసంఖ్య కోట్లల్లో ఉండొచ్చు. వాటిని నియంత్రించేందుకుఎన్నో చట్టాలు తీసుకువచ్చారు. నిబంధనలను విధించారు. జరిమానాలు వేస్తున్నారు. అయినా ఇది ఏమాత్రం ఆగడంలేదు. చాలావరకు చట్టం కాగితాలకే పరిమితం అవుతున్నది. భారత్‌లో ధూళికణాలుండాల్సిన స్థాయికన్నా ఐదురెట్లు అధికంగా ఉండి శ్వాసకోశ సమస్యల నుంచి కేన్సర్‌దాకా రకరకాల వ్యాధులకు కారణమవుతున్నాయని వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజారోగ్యంపై తీవ్రప్రభావం చూపుతున్న ఈకాలుష్య భూతాన్ని నియంత్రించాల్సిన అవసరం ఉంది. అన్నింటికంటే ముఖ్యంగా పర్యావరణంపట్ల సామాన్యుల్లో సైతం అవగాహన పెంచేందుకు కృషి జరగాలి.

ఆలోచన వికసించే పుష్పం వంటిదైతే, ఆలాపన దాని అంకురం, ఆచరణ ఫలం.



ఎమర్సన్

అభిప్రాయాలు ఎప్పుడూ మార్చుకోని వ్యక్తి నిల్వ నీటితో సమానం. నిల్వ నీటిలో ఎన్నో జీవులు పెరుగుతాయి.



ఆస్కార్‌వైల్డ్

# ప్రజావాక్కు



## మాటే మంత్రం

మొన్న జరిగిన అసెంబ్లీ సమావేశాలలో ఓ రోజు ప్రముఖ సినీ నటుడు, ఎన్.టి.ఆర్. తనయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బావమరిది, హిందూపురం శాసన సభ్యుడు అయిన నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ కొంతమంది వ్యక్తుల మీదనోచ్చుకునే పదజాలాన్ని వాడారు. అందులో ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అయిన జగన్ మోహన్ రెడ్డినిఅనకూడని మాటలనడం, ప్రముఖ నటుడు, మెగాస్టార్ చిరంజీవి మీద తెచ్చిన ప్రస్తావన సభలోని వారికి, టి.వి. ముందు కూర్చుని యీ భాషణ విన్నవారికి బాధ కలిగించింది. ఆ రోజు అనారోగ్యంతో పవన్ కల్యాణ్, సభలో లేకపోవడం కాకతాళీయం. రాష్ట్రం మొత్తం ఆందోళనలను చేయడానికి సమాయత్తం అవగానే చిరంజీవి తన అభిమానులను వారించి కొత్త సమస్యలను తలెత్తకుండా ప్రశాంతతను కలిగించారు. మనుషుల మధ్య ప్రశాంత వాతావరణం నెలకొనాలంటే మాటే మంత్రంగా పనిచేయాలి.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## బాలల అక్రమ రవాణాకు పరిష్కారమేది?

మన దేశంలో బాలల అక్రమ రవాణా ఇంకా ఒక తీవ్రమైన, పరిష్కరించబడని సమస్యగా మిగిలిపోతోంది. ప్రతి ఎనిమిది నిమిషాలకు ఒక బాలుడు లేదా బాలిక గల్లంతవుతున్నారని గణాంకాలు చెబుతున్నాయి. అయినప్పటికీ, స్వాతంత్య్రం నుండి ఇప్పటివరకు కేంద్రం గాని, రాష్ట్ర ప్రభుత్వాలు గాని ఈసమస్యకు తగిన ప్రాధాన్యతను చూపలేదు. లక్షల సంఖ్యలో గల్లంతైన పిల్లల వివరాలు ఇంకా చీకటిలో మిగిలిపోవడం మన సమాజానికి బాధాకరం. పోలీస్ శాఖలు, బాలల సంక్షేమ సంస్థల మధ్య సమన్వయం లేకపోవడం ఈ ప్రయత్నాన్ని తక్కువ ప్రభావవంతంగా మార్చింది.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

## యుద్ధాన్ని ఆపలేరా?

ఇజ్రాయెల్ ఇప్పటికీ గాజా మీద దాడులు చేస్తూనే ఉంది. అమెరికా ట్రంప్ ప్రభుత్వం ఇజ్రాయెల్‌ను సమర్థిస్తూనే ఉంది. ఇండో-పాక్‌ల మధ్య జరిగిన యుద్ధాన్ని నాలుగు రోజులలోనే ఆపేశానని చెప్పుకుంటున్న ట్రంప్ ఉక్రెయిన్, రష్యాఔ మధ్యయుద్ధాన్ని ఆపలేకపోయాడు. ఏ యుద్ధం జరిగినా ప్రపంచదేశాలన్నిమూల్యం చెల్లించుకోవాలి.

- ఎన్.రామారావు, నల్గొండ జిల్లా

## హింసను ఆపలేమా?

కర్నూలు జిల్లా దేవరగట్టులో ప్రతి సంవత్సరం దసరా రోజున జరిగే బన్నీ ఉత్సవం చారిత్రాత్మకమైనది. శక్తి, ఉత్సాహానికి ప్రతీకగా వందలాది మంది గుంపులుగా చేరి ఒకరిపై ఒకరు కర్రలతో దాడిచేసుకోవడం ఈ ఉత్సవం ప్రత్యేకత. కానీ కాలక్రమేణా ఇది సాంప్రదాయ క్రీడగా కాకుండా ప్రమాదకర హింసగామారింది. ప్రతిసంవత్సరం దజన్లకొద్దీ గాయాలు, మరణాలు సంభవించడం దురదృష్టకరం. సాంప్రదాయం పేరుతో ప్రాణాలకు ముప్పు కలిగించే ఆచారం కొనసాగడమే విచారకరం. సాంస్కృతిక వైభవాన్ని కాపాడుకుంటూనే ప్రజల భద్రతను కూడా కాపాడడం అవసరం. పోలీసు, వైద్యసిబ్బంది నియామకం, అవగాహనకార్యక్రమాలు, ప్రత్యామ్నాయ పద్ధతులలో ఉత్సవాన్ని నిర్వహించే చర్యలుతీసుకోవాలి. యువతలో సహకారం, క్రమశిక్షణ పెరిగితే ఈ ఉత్సవం హింసాత్మక రూపం తగ్గుతుంది. ఆచారాన్ని గౌరవించడం తప్పు కాదు. కానీ దాని కోసం మానవ ప్రాణాలు బలవ్వకూడదు.

-తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

## సంస్థ నడవడికలో మార్పు అవసరం

ప్రపంచ దేశాల మధ్య శాంతి సౌభ్రాతృత్వం విలసిల్లేలా చేయడానికి వారధిలాగా ఉండే ఐక్యరాజ్యసమితి తన ప్రాసంగికతను కోల్పోతుంది. దానికి ప్రత్యక్ష ఉదాహరణే రష్యా, ఉక్రెయిన్ యుద్ధం కావొచ్చు, గాజా మారణకాండ కావొచ్చు, అయితే వీటి వెనుక అమెరికా ఉందని తెలిసిన సంస్థ నిస్సహాయంగా ఉండిపోయింది. మరోవైపు శాశ్వత సభ్యత్వ దేశాలు వర్ధమాన దేశాలకు ఇంచు మందం సందు ఇవ్వకుండా వాటికి శాశ్వత సభ్యత్వం రాకుండా అడ్డుకుంటున్నాయి. ఇది ఎంత మాత్రం కూడా ప్రపంచ దేశాల మధ్య సమిష్టి తత్వంను ఇచ్చేదిగా ఉండదు. మరి ఆఫ్రికన్ దేశాల నుండి ప్రధాన కార్యదర్శిని చేస్తే అయిన సంస్థ నడవడికలో మార్పు ఉంటుందా చూడాలి.

-భారత అవినాష్, జనగామ

## కాలనీ బోర్డులు అవసరం

తెలంగాణ రాష్ట్రంలో పట్టణాలు నగరాలలో కాలనీలకు జాతీయ నాయకుల పేర్లు పెట్టడం జరిగింది. అట్టి కాలనీలకు ప్రవేశద్వారం వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలి. కాలనీ ప్రజల ఆర్థిక సహాయంతో బోర్డులు ఏర్పాటు చేయాలి. స్థానిక సంస్థల గ్రామ పంచాయతీల వద్ద నమోదు చేసుకోవాలి. ఈ విధానం వలన అడ్రస్ సులువుగా దొరుకుతుంది.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ, వరంగల్ జిల్లా

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# జారుడు మాటలతో దిగజారుతున్న ప్రతిష్ట

**పథకాలన్నింటికి తమ పార్టీ పేరో, లేక నేతల పేరో ఉండేలా ప్రయత్నం చేస్తున్నారు. గతంలో ఒక ముఖ్యమంత్రి దాదాపు రెండు డజన్లకుపైగా పథకాలకు తన పేరేపెట్టుకున్నారు. కానీ ఆయన దిగిపోయిన తర్వాత ఆయన పేరును దుర్భిణి పెట్టి వెతికినా రాష్ట్రంలో ఎక్కడా కన్పించకుండా పోయింది. ఇక కొందరైతే ఢిల్లీ పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకు పథకాలకు, ప్రాజెక్టులకు పోటీపడి వారి పేర్లనే పెట్టారు. అవకాశం లేకనో, ఆలోచన రాకనో ఏమోకానీ కృష్ణా, గోదావరి లాంటి జీవన నదుల పేర్లు మార్చి ఆ పెద్దల పేర్లుపెట్టి తమ స్వామిభక్తిని ప్రదర్శించుకోకపోవడం మన అదృష్టం. ఏదిఏమైనా అందరికి ఆదర్శంగా అనుకరణీయంగా ఉండాల్సిన నేతల్లో కొందరు నాయకులు ఇలా వ్యవహరించడం వల్ల తమ ప్రతిష్టను తామే దిగజార్చుకొంటున్నారు.**

దామెర్ల సాయిబాబ

కాలు జారితే వెనక్కి తీసుకోవచ్చు. ఒకవేళ విరిగినా ఆస్పత్రికి వెళ్లి అతికించుకోవచ్చు. కానీ మాట జారితే వెనక్కి తీసుకోలేం, ఆ తర్వాత చేయగలిగిందేమీ ఉండదు. కీలక పదవుల్లో ఉన్నవారు ప్రతి విషయంలోనూ ఆచితూచి మాట్లాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. బాధ్యతలు, అంతస్తులు, అధికారాలు పెరిగే కొద్దీ మాటలకు విలువ పెరుగుతుంది. వారు మాట్లాడే ప్రతి మాటకు ఎంతో గౌరవం ఉంటుంది. అందుకే ఎవరు ఎంత రెచ్చగొట్టినా ఎంత విపత్కర పరిస్థితులు ఎదురైనా కీలకబాధ్యతలు నిర్వహించే వ్యక్తులు ఎంతో సంయమనంతో వ్యవహరించాలి. బాధ్యతాయుతంగా మాట్లాడాలి. ఎందుకో కానీ ఇటీవల కొందరు నాయకుల మాటలకు అదుపు లేకుండాపోతున్నది. ఏం మాట్లాడుతున్నారో, ఎలాంటి భాషవాడుతున్నారో వారికే తెలియకుండా పోతున్నది. కీలక పదవుల్లో ఉన్నవారు సైతం రెచ్చగొట్టే విధంగా కొన్నిసందర్భాల్లో బూతులు మాట్లాడటానికి కూడా వెనుకాడడం లేదు. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు దేశవ్యాప్తంగా కూడా ఈ సంస్కృతి విస్తరించిపోతున్నది. కొందరు నేతలు మాట్లాడుతున్న భాష సభ్యసమాజం తలవంచుకునేలా చేస్తున్నది. పత్రికల్లో రాయలేని భాష మాట్లాడుతున్నారు. అయితే గతంలో అలాంటి వారు వాడిన భాషను పత్రికలు ప్రచురించకపోవడంతో ప్రజలకు అంతగా తెలిసే అవకాశం లేకపోయేది. కానీ ఎలక్ట్రానిక్ మీడియా ముఖ్యంగా యూట్యూబ్ వచ్చిన తర్వాత యధాతథంగా ప్రసారం అవుతున్నాయి. కుటుంబ సభ్యులందరూ ఇంట్లో కూర్చొని టీవీల్లో చూడలేని, వినలేని దురదృష్టపు పరిస్థితులు దాపురించాయి. వీరా మన ప్రజాప్రతినిధులు? అంటూ ముక్కున వేలేసుకుంటున్నవారెందరో ఉన్నారు. అసలు రాజకీయంగా బూతులు మాట్లాడకపోతే నాయకులం కాలేమన్న భావన పెరిగిపోతుందేమోననిపిస్తున్నది. వ్యక్తిగత ధూషణకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇలా ఒకరినొకరు తీవ్ర పదజాలంతో ధూషించుకోవడం ఆ తర్వాత ఏదో సందర్భంలో కలుసుకున్నప్పుడు ఆప్యాయంగా, ఆహ్లాదకరంగా నవ్వుతూ మాట్లాడుకోవడాన్ని చూస్తున్నవారు ఏమనుకుంటారో ఒక్కసారి మనసుపెట్టి ఆలోచించాలి. రాజకీయంగా వేసే అడుగులు, విమర్శలు రాజకీయాలకే పరిమితం కావాలి. రాజకీయాలు ఎప్పుడు ఎలా ఉంటాయన్నది, సమీకరణలు ఎలా మారుతాయో, ఎప్పుడు ఏ పార్టీకి కప్పదాట్లకు పాల్పడతారో ఊహకందని పరిస్థితులు నెలకొన్నాయి. దేశవ్యాప్తంగా కూడా నెలకొన్న పరిస్థితులు ఏ పార్టీతో ఎవరు పొత్తుపెట్టుకుంటారో, ఎవరెవరు లోపాయికారీ ఒప్పందాలు చేసుకుంటారో చెప్పలేని పరిస్థితి. కత్తులు దూసుకున్నవారే కలిసిపోతున్నారు. ఎన్నికలు దగ్గరకు వచ్చే కొద్దీ కప్పదాట్లు పెరిగిపోతున్నాయి. చొక్కాలు మార్చినట్లుగా పార్టీలు మారుస్తున్న ఈ రోజుల్లో పార్టీ నేతలు కూడా దీన్ని ప్రోత్సహిస్తున్నారు. గతంలో పార్టీలు మారే సంప్రదాయం లేదని చెప్పడం లేదు. అప్పుడు కూడా ఈ సంస్కృతి కొద్దో గొప్పో ఉంది. ఆనాడు పార్టీలు మార్చాలనుకుంటే ప్రజలు ఏమనుకుంటారో? తమను భుజాన పెట్టుకొని మోసిన పార్టీ కార్యకర్తలకు ఏమని సమాధానం చెప్పాలనే జంకు, భయం, బిడియం ఉండేవి. సిద్ధాంతపరంగా విభేధాలు ఏర్పడినప్పుడు పార్టీలు మార్చిన వారు సైతం కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేసి వారితో చర్చించి తాము ఎందుకు పార్టీలు మార్చాల్సి వచ్చిందో వివరించి తామున్న పార్టీ ద్వారా వచ్చిన పదవులను, హోదాలను తృణప్రాయంగా త్యజించి పార్టీలు మార్చేవారు. ఇప్పుడు వేళ్ల మీద లెక్కపెట్టినవారు మాత్రమే ఇలాంటి సంప్రదాయాన్ని పాటిస్తున్నారు. ఇక ఒకపార్టీలో ఉన్నప్పుడు ప్రత్యర్థి

ఒక్క మాట

పార్టీని, అందులోని నేతలను ఇష్టానుసారంగా హద్దుపద్దు లేకుండా ఆరోపణలు, విమర్శలు చేసి మరుసటి రోజు మళ్లీ అదే ప్రత్యర్థి పార్టీలోకి మారిపోయి గతంలో తమకు రాజకీయ భిక్ష పెట్టిన పార్టీని, పార్టీ నేతలపై విమర్శనాస్త్రాలు, వ్యక్తిగత ఆరోపణలు గుప్పిస్తున్నారంటే ఏమనుకోవాలి. ఇదేదో ఎవరినో విమర్శించడానికి రాయడం లేదు. ఎవరికివారే ఆత్మ పరిశీలన చేసుకోవాలి. అందుకే పెద్దలన్నారు విడిపోయేటప్పుడు మళ్లీ కలుసుకుంటామని విడిపోవాలి. అలాగే కలుసుకునేటప్పుడు మళ్లీ విడిపోతామని కలుసుకోవాలి. ఈ సూత్రాన్ని గుర్తుంచుకొని పాటిస్తే ఎవరి పరిధిలో వారుంటారు. ఇది పార్టీ నేతలకే కాదు, కుటుంబాలకు, స్నేహితులకుకూడా వర్తిస్తుంది. తెలుగు రాష్ట్రాల్లో పొల్లుమాటలతో తమ ప్రతిష్టను తామే దిగజార్చుకుంటున్నారు. ఈ పార్టీ, ఆపార్టీ అని కాదు. అందరూ కాకపోయినా కొందరు నేతల మాటలకు అదుపులేకుండాపోతున్నది. ఎవరిపై విమర్శలు గుప్పిస్తున్నా గౌరవమైన ఉన్నత పదవుల్లో ఉన్నవారిని కూడా ఏకవచనంతో సంభోదించి వ్యక్తిగత ధూషణలకు పాల్పడడం ఎంతవరకు సమంజసమో విజ్ఞతతో ఆలోచించాలి. సాక్షాత్తుభారత దేశ ప్రధానమంత్రిని కూడా ఏకవచనంతో సంభోదిస్తూ విమర్శలు చేస్తున్న చోటానాయకులు ఇటీవలకాలంలో పెరిగిపోతున్నారు. ఇందువల్ల వారి గౌరవప్రతిష్టలు వారే దిగజార్చుకుంటున్నారు. ఇలాంటి భాష వాడినప్పుడు బహిరంగ సభల్లో కేరింతలతోపాటు చప్పట్లు కొట్టవచ్చు. ఆ చప్పట్ల కోసమే కొందరు నేతలు అలాంటి భాష మాట్లాడుతుండవచ్చు. అది సభ్యతా సంస్కారం కాదు. ప్రజలకుఆదర్శంగా, అనుకరణీయంగా ఉండాల్సిన నేతలు అలాంటి భాషను మాట్లాడడం ఏరకంగా చూసినా సమర్థనీయం కాదు. అలాంటి భాష మాట్లాడిన వారినెందరినో తెలుగు రాష్ట్రాల్లో గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు మూలన కూర్చో పెట్టారు. ఇప్పుడు ఈదుస్సంస్కృతి గ్రామాలకు కూడావిస్తరిస్తే మాటలకే కాక, చేతల యుద్ధాలుగా మారుతాయి. ఇక ప్రతీకార రాజకీయాల పర్వం కూడా తెలుగు రాష్ట్రాల్లో కొనసాగుతున్నది. ఇది ఏమాత్రం వాంఛనీయం కాదు. అధికారంలోఉన్నప్పుడు తప్పులుచేస్తే చట్టాలున్నాయి. న్యాయస్థానాలున్నాయి. వ్యక్తిగతంగా కక్షలు తీర్చుకునేందుకు అధికారాన్ని వినియోగించడం సమంజసంకాదు. గతంలో ఇలా వ్యవహరించిన నాయకులు ఫలితాలను చవిచూస్తున్నారు. అసలు ఈ వ్యక్తిగత ప్రతీకారకక్షలు తీర్చుకునే సంస్కృతి ఒకనాడు పొరుగునున్న తమిళనాడు పతాకస్థాయిలోఉండేది. ఇప్పుడు అక్కడ మార్పులు వచ్చాయి, వస్తున్నాయి. పొగడ్తలు, వ్యక్తిగతవిమర్శలన్నింటిని నియంత్రించేందుకు అక్కడ ముఖ్యమంత్రి స్టాలిన్ శక్తివంచన లేకుండా పనిచేస్తున్నారు. అసలు పొగడ్తలకు తలవంచని మనిషి అంటూ ఉండడు. ఒకసారి పొగడ్తలకు అలవాటుపడితే వదిలిపెట్టడం సులువు కాదంటారు. పూర్వం రాజుల కాలంలో వారిసభల్లో కేవలం పొగడ్తల కోసమే కొందరు ఉండేవారు. పొగిడించుకోవడం కోసమే వారికి జీతభత్యాలతోపాటు భూములు, మాన్యాలిచ్చి రాజులు పోషించేవారు. పొగిడేవారికి ఎలాఉన్నా పొగడ్తలు ఎంత కమ్మగా, ఆనందంగా, తీయగా ఉంటాయో పొగిడించుకునే వారికే తెలుస్తుదంటారు. రాజులు, రాజ్యాలు పోయాయి. ప్రజాప్రభువులు వచ్చారు. ప్రజాప్రభువుల్లో పొగిడించుకునేందుకు పోటీపడేవారు ఎక్కువైపోతున్నారు. అలాంటిది మొన్న ఆ మధ్య తమిళనాడు శాసనసభలో తమ పార్టీ సభ్యులు పొగడ్తలతో ముంచెత్తుతుంటే ఆ రాష్ట్రముఖ్యమంత్రి స్టాలిన్ అడ్డుకొని ప్రజాధనంతో నిర్వహిస్తున్న శాసనసభలో ముఖ్యమంత్రిని పొగడడం ఏమాత్రం సమంజసంకాదంటూ, అలా ఎవరైనా ఇకనుంచి పొగిడితే వారిపై చర్యలు తీసుకుంటామని సభాముఖంగా ప్రకటించారు. అలాగే గతప్రభుత్వం ప్రవేశపెట్టిన 'అమ్మ క్యాంటిన్' లాంటి పథకాలు యధాతథంగా అప్పటి ముఖ్యమంత్రి జయలలిత పేరుతోనే కొనసాగించాలన్నారు. ప్రతి పక్షనేతల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకుంటున్నారు. ముఖ్యమంత్రి, మంత్రుల ఫొటోలు లేకుండా ప్రభుత్వ ముద్రకే పరిమితం చేశారు. ఇలాంటి చర్యలెన్నో తీసుకుంటూ రాజకీయ హుందాతనాన్నిపాటిస్తూ దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఆ పరిస్థితి కన్పించడం లేదు. పథకాలన్నింటికి తమ పార్టీ పేరో, లేక నేతల పేరో ఉండేలా ప్రయత్నం చేస్తున్నారు. గతంలో ఒక ముఖ్యమంత్రి దాదాపు రెండు డజన్లకుపైగా పథకాలకు తన పేరేపెట్టుకున్నారు. కానీ ఆయన దిగిపోయిన తర్వాతఆయన పేరును దుర్భిణి పెట్టి వెతికినా రాష్ట్రంలో ఎక్కడా కన్పించకుండా పోయింది. ఇక కొందరైతే ఢిల్లీ పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకు పథకాలకు, ప్రాజెక్టులకు పోటీపడి వారి పేర్లనే పెట్టారు. అవకాశం లేకనో, ఆలోచన రాకనోఏమో కానీ కృష్ణా, గోదావరి లాంటి జీవన నదులపేర్లు మార్చి ఆ పెద్దల పేర్లుపెట్టి తమ స్వామిభక్తిని ప్రదర్శించుకోకపోవడం మన అదృష్టం. ఏదిఏమైనా అందరికి ఆదర్శంగా అనుకరణీయంగా ఉండాల్సిన నేతల్లో కొందరు నాయకులు ఇలా వ్యవహరించడం వల్ల తమ ప్రతిష్టనుతామే దిగజార్చుకొంటున్నారు. ●

# సుస్థిర అభివృద్ధితోనే వికసిత భారత్ సాధ్యం

ఐ.ప్రసాద రావు

నేటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దాదాపు ప్రజలందరినీ పండుగల పేరుతో మతం మత్తులో ముంచి తేలిస్తున్నారు. సహజంగా మన దేశంలో ప్రజలకు దైవభక్తి ఎక్కువ. దీనిని ఆసరాగా చేసుకుని భారత రాజ్యాంగం ప్రకారం ప్రమాణం చేసిన పాలకులు, ఆ ప్రమాణాలను, రాజ్యాంగ లక్ష్యాలను పక్కన బెట్టి, సెక్యులర్ అనే భావన పాటించకుండా ప్రత్యక్షంగా పరోక్షంగా అనేక మత క్రతువుల్లో పాల్గొంటూ, ప్రజలను కూడా వీటిలో భాగస్వామ్యం చేయడం జరుగుతుంది. దీంతో దేశంలో తాండవిస్తున్న నిరుద్యోగం, అధిక ధరలు, ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, మానవ అభివృద్ధి వంటి అంశాలు పక్కదోవ పట్టిస్తూ, ప్రజలను మభ్య పెడుతున్నారు. ప్రజలు కూడా ఇటువంటి అంశాలను సీరియస్‌గా ఆలోచించకుండా పండుగలు జరుపుకుంటూ కాలం వెలిబుచ్చుతున్నారు. ఈ మత మైకంలో వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకోకపోవడం బాధాకరం. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దాదాపు 78 సంవత్సరాలు పూర్తి చేసుకున్నా, నేటికీ మన అక్షరాస్యత 74 శాతంగా ఉంది. ఇది కూడా కేవలం సంతకాలు చేసిన వారినికలుపుకుంటే. లేదంటే అరవై శాతం లోపే. దీనివల్ల ప్రజల్లో చైతన్యం, అవగాహన లేకపోవడం వల్ల అసలు సమస్యలు, దేశంలో తాండవిస్తున్న నిరుద్యోగం అధిక ధరలు ప్రైవేటీకరణ వంటి అంశాలు అర్థం చేసుకోలేకపోవడంతో పాలకులు చెప్పే మాటల గారడీలో పడిపోతున్నారు. అందుచేతనే వారి జీవితాలు అన్నిరకాలుగా అంతంత మాత్రంగానేఉన్నాయి. నేటికీ దాదాపు సగం జనాభా ప్రభుత్వాలు ఇచ్చే పెన్షన్ పథకం, సంక్షేమ పథకాలు, ఉచిత పథకాల మీదే ఆధారపడి జీవిస్తున్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని వివిధ రకాల పండుగలు మనదేశంలో ఉన్నాయి. పూర్వకాలంలో పండుగ కార్యక్రమాలు జరుపుకుని, వారి దైనందిన జీవితంలో మునిగిపోయే వారు. కానీ నేడు పండుగలను 'పెద్ద పెద్ద ఈవెంట్స్' లాగా ప్రభుత్వాలే జరపటం ఆశ్చర్యంవేస్తుంది. కొద్ది మొత్తంలో ప్రభుత్వాలు ఖర్చుచేసి, భారీఎత్తున ప్రజల నుంచి ఆదాయం సమకూర్చుకోవడం జరుగుతుంది. అనగా భక్తిని 'వ్యాపారం'గా మార్చి వేసారు. ప్రజల నుంచి కొన్ని కోట్ల రూపాయలు దండుకుంటున్నారు. దేవస్థానాలు, ట్రస్టులు, ప్రభుత్వాలు, వ్యాపార సంస్థలు భారీగా ఆర్థికంగా బలపడుతున్న పరిస్థితి. నేటి ప్రభుత్వాలు ప్రజలకు కావలసిన విద్య, వైద్యం, కనీస అవసరాలు తీర్చడం మానేసి, ప్రజలను మభ్యపెట్టే మత క్రతువుల్లో పాల్గనేటట్లు ప్రోత్సహిస్తున్నాయి. ఇవా ప్రభుత్వాలు చేసే పనులు అని ఆలోచన చేయాలి. అసలు ఈ ఆధునిక కాలంలో ప్రపంచ దేశాలతో పోలిస్తే వివిధ రంగాల్లో అనగా అక్షరాస్యత, ఆరోగ్యం, ఉద్యోగ, ఉపాధి విషయంలో, సంతోష సూచిలో, మానవ అభివృద్ధి సూచికల్లో మనం ఎక్కడ ఉన్నాం?అని ప్రశ్నించుకుని, ప్రభుత్వాలు పని చేయాలి. కొంతమంది చేతిలోనే దేశ సంపద కేంద్రీకృతమై, కొద్దిమంది బిలియనీర్ల సంపద పెరుగుదల చూసి దేశం త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ మారుతుంది అని మురిసి పోవడం చాలా హాస్యాస్పదంగా ఉంది. ఎందుచేతనంటే దాదాపు సగం జనాభా ప్రభుత్వాలు ఇచ్చే ఉచిత, సంక్షేమ పథకాలతోనే జీవితాలు గడుపుతున్నారు. నిరక్షరాస్యత, నిరుద్యోగం నిరంతరం వెంటాడుతూనే ఉంది అనే వాస్తవాన్ని మరువరాదు. కావున ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల వాస్తవ జీవన ప్రమాణాలు ఎలా పెంచాలి అనే అంశంపై దృష్టి సారించాలి. అంతర్జాతీయ స్థాయిలో వివిధరంగాల్లో మనదేశం గర్వించదగ్గ స్థాయిలో ఉండే విధంగా చూసుకోవాలి. ఫిన్లాండ్, స్వీడన్, నార్వే వంటి దేశాలను దృష్టిలో ఉంచుకుని మన దేశాన్ని నడిపించాలి. వలసలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలి. అవినీతిని నిర్మూలించాలి. దక్షిణ కొరియా, జపాన్, చైనా, క్యూబా వంటి దేశాలు ఉత్పత్తి రంగంలో ఎలా అభివృద్ధి చెందుతున్నాయో చూసి, మన దేశంలో అమలు చేయాలి. నైపుణ్యాభివృద్ధికి పెద్ద పీట వేయాలి. శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలి. 'ఆత్మ నిర్భర్ భారత్, మేక్ ఇన్ ఇండియా' అనే కార్యక్రమాలు మొదలు పెట్టి దాదాపు దశాబ్దం కాలం గడిచినా ఏమేరకు ఆ లక్ష్యం చేరేమో ఈ ప్రభుత్వాలు పునఃసమీక్ష చేసారా? ఇటువంటి అంశాలపై దృష్టిసారించడమాని వేసి, కేవలం మత క్రతువులకు ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యత ఇస్తే ఎలా? ప్రపంచ దేశాలు అన్ని శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాకెట్లు స్పీడ్‌తో ముందుకు సాగుతుంటే, మన విద్యాలయాల్లో తిరిగి వాస్తు, జ్యోతిష్యం, మతపరమైన అంశాలువంటివి ప్రవేశపెడుతుంటే, ఇక మన విద్యార్థులు అంతర్జాతీయ విద్యార్థిగా ఎలా మారతాడో ప్రభుత్వాలు చెప్పాలి? ఇకనైనా ప్రభుత్వాలు ప్రజలను మభ్య పెట్టే కార్యక్రమాలు విడనాడాలి. ప్రజల తలసరి ఆదాయం పెరగడానికి, ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపరచడానికి తగు చర్యలు తీసుకోవాలి. ●

# జీవవైవిధ్య పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలి

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

పాతరాతి యుగం నుంచి నేటి వరకు కూడా ప్రపంచ మానవాళి ఆహారం, ఔషధాలు, గృహ నిర్మాణం, ఇంధనం, వస్త్రాల కోసం వనాలపై లేదా అటవీ వృక్ష జంతు జాలాలపై ఆధారపడి ఉంటున్నాడు. ప్రకృతి సహజ అందాల విందులు ఆరబోస్తున్న అటవీ సంపద పర్యావరణ వ్యవస్థను కాపాడడం జరుగుతున్నప్పటికీ మానవ తప్పిదాలతో జంతువుల సంఖ్య తగ్గడం, జీవ వైవిధ్యానికి విఘాతం కలగడం జరుగుతున్నది. అన్నిరకాల వృక్ష జంతు జాతులతో మనిషి కలిసి స్నేహంగా జీవితాలను గడపని యెడల రాబోయే తరాలు భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. జంతు సంక్షేమ సమతుల్యత దెబ్బతినకుండా వాటిని రక్షించుకుంటూ, జీవవైవిధ్యానికి పట్టం కట్టవలసిన సమయం ఆసన్నమైనది. భూమిపై సహజంగా జీవితాలను గడుపుతున్న అనేక రకాల జీవరాసులను పరిరక్షించుకోని యెడల పలు జాతులు అంతరించే ప్రమాదంతో పాటు మానవ ఉనికి కూడా ప్రశ్నార్థకంగా మారుతుందని అందరం తెలుసుకోవాలి. మన పిల్లలకు అపార సంపదలను సంపాదించిపెట్టినప్పటికీ తాగడానికి చుక్క శుద్ధ నీరు, పోల్చడానికి పరిశుద్ధ గాలి లేనప్పుడు మనిషి వద్ద ఎన్నిఉన్నా నిరర్థకమే అవుతాయని తెలుసుకోవాలి. పర్యావరణ వ్యవస్థను కాపాడడం, జీవ వైవిధ్యాలను సంరక్షించడం, సహజ ప్రక్రియలను నియంత్రించడం, మానవ జాతికి కనీస అవసరాలు తీర్చడం, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరడానికి వన్యప్రాణులు అమూల్య సేవలను అందిస్తున్నాయి. మనిషి అడగక ముందే తనకు కావలసిన కనీస అవసరాలైన కూడు, గూడు, గుడ్డను ఇస్తున్న జంతువుల పరిరక్షణ అవసరాలను ప్రజల్లో ఏకరువు పెట్టడానికి, హెచ్చరికలు చేయడానికి సెయింట్ ఫ్రాన్సిస్ ఆఫ్ అస్సిసీ ఫీస్ట్ డే" రోజు ప్రతి ఏటా 04 అక్టోబర్ ప్రపంచ జంతు సంక్షేమ దినోత్సవం లేదా వరల్డ్ ఆనిమల్ వెల్ఫేర్ డే' నిర్వహించడం జరుగుతున్నది. అడవుల్లో దాదాపు 60,000 వృక్ష జాతులు, 80శాతం ఉభయచర జాతులు, 75శాతం పక్షిజాతులు ప్రపంచవ్యాప్త 1.6 మిలియన్ల ప్రజలకు నేరుగా నిత్యావసరాలను తీర్చుతున్నాయి. నేటి జీవజాతుల్లో దాదాపు ఒక్క మిలియన్ వరకు అంతరించే అంచున ఉన్నాయని



భయంకర వాస్తవమే నిజమైతే మానవ శాంతియుత జీవనం బుగ్గిపాలు కావడం తప్పనిసరి. భూమిని, భూగ్రహంపై సహజంగా జీవిస్తున్న జీవరాశులను కాపాడకపోవడం మన కనీస కర్తవ్యం అని తెలపడంతో పాటు జీవవైవిధ్య పరిరక్షణకు అవసర నిధులు కూడా సహకరించడం ప్రధాన అంశమని ఐరాస పేర్కొంటున్నది. ప్రపంచ సగం జిడిపీ ప్రకృతి సంపద మీదనే ఆధారపడి ఉంటున్నది. జీవవైవిధ్య పరిరక్షణకు, పునర్నిర్మాణానికి ప్రతి ఏటా 143 బిలియన్ల డాలర్ల నిధులను ప్రపంచ దేశాలు అందిస్తున్నాయని, ఈ సత్కార్య నిర్వహణకు 824 బిలియన్ డాలర్లు అవసరం అవుతాయని, కనీసం ఏడాదికి 500బిలియన్ డాలర్లు అయినా ప్రపంచ దేశాలు వెచ్చించాలని ఐరాస ప్రధాన కార్యదర్శి పేర్కొనడం విశేషం. ఇంటర్నేషనల్ ట్రేడ్ ఇన్ ఎండేంజర్డ్ స్పీసీస్ ఆఫ్ వైల్డ్ ఫానా అండ్ ఫ్లోరా అనే సంస్థ 50వ వర్షికోత్సవం సందర్భంగా అంతర్జాతీయ స్థాయిలో జంతు సంక్షేమ కార్యాలు పటిష్ట పథకాలతో నడవాలి. ప్రపంచ జంతు సంక్షేమ దినం 2025 ఇతివృత్తంగా జంతు సంరక్షణతో భూగృహ పరిరక్షణ (సేవ్ ఆనిమల్స్, సేవ్ ది ప్లానెట్) అనబడే అంశాన్ని తీసుకున్నారు. ప్రపంచ మానవాళి ఆయురారోగ్యాలకు జీవవైవిధ్యంతోపాటు పర్యావరణ వ్యవస్థల సమతుల్యత అవసరం అవుతాయని, వీటి సాధనకు అవసరమైన ఆర్థిక నిధులు అందించారని ప్రపంచదేశాలను, ముఖ్యంగా అభివృద్ధి చెందిన దేశాలను కోరడం జరుగుతున్నది. ప్రపంచ జంతు సంక్షేమ దినం వేదికగా ప్రజలకు అవగాహన కల్పించడం, వన్యప్రాణులను కాపాడే సంస్థలు లేదా వ్యక్తులను గుర్తించడం, ఆర్థిక నిధుల సేకరణ, ప్రభుత్వాల చొరవ, ప్రజల సహకారం, ఎన్జీవోల చొరవ లాంటివి నిర్వహిస్తేనే వన్యప్రాణుల పరిరక్షణ ఆవశ్యకతను వివరించేకార్యశాలలు, సెమినార్లు, ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ అవగాహనలు, నిధుల సేకరణ కార్యక్రమాలు, ప్రపంచ దేశాల సమన్వయ సహకారాలు, విజ్ఞాన వితరణలు లాంటివి నిర్వహించడం మంచిది. పర్యావరణ సమతుల్యతకు గొడుగు పట్టడం, జీవవైవిధ్యానికి ఊపిరులూదడం, సహజ అందాలను ఆస్వాదిస్తూ కాపాడుకోవడం లాంటివి నిరంతరం కొనసాగాలి. జీవవైవిధ్య పరిరక్షణతో ఆహార భద్రత, ఔషధాల లభ్యత, శుద్ధ జలాలు/పీల్చే గాలులు, వాతావరణ సానుకూల మార్పులు సమకూరుతాయి. ఈ విషయాలను నేటి మనిషి పెడచెవిన పెట్టివిధ్వంసానికి పాలుపడితే రేపటి తరం మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని, మనం కూర్చున్నా కొమ్మను మనమే నరుక్కోవద్దని గుణపాఠం నేర్చుకోవడంతో పాటు జీవవైవిధ్య దీపం ఉండగానే భూగృహాన్ని చక్కదిద్దుకుందాం. ●

గుంటూరు వార్త



# పెదవడ్లపూడి గోసేవలో పీవీ సింధు

మంగళగిరి, అక్టోబర్ 3, ప్రభాతవార్త: పెదవడ్లపూడి భగవాన్ శ్రీ సత్య షిరిడి సాయి బాబా మందిరం పరిసరాల్లో ఏర్పాటుచేసిన గోశాల లను శుక్రవారం ఒలంపిక్ క్రీడల్లో రజిత పథకం సాధించిన తొలి భారతీయ మహిళ, పద్మశ్రీ పీవీ సింధు దత్త సాయి దంపతులు, తండ్రి పీవీ రమణతో కలసి సందర్శించారు. సింధు దంపతులు బాబా వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మందిరం గోమాత గోశాలను సందర్శించి గోవులకు దానా పెట్టారు. ఈ సందర్భంగా సింధు దంపతులను మందిరం చైర్మన్ పాతూరి నాగభూషణం శాలువాతో సత్కరించి, బాబా వారి చిత్రపటం, గోశాల ఆవు నెయ్యి అందజేశారు. అనంతరం పద్మశ్రీ సింధు మాట్లాడారు. పెదవడ్లపూడి సాయి మందిరం విశిష్ట గురించి విన్నానని, తొలిసారి వచ్చి బాబా ను దర్శించుకోవడంతో పాటు గో సేవలో కూడా పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఆవు పాలు, నెయ్యి, పెరుగు ను పిల్లల నుంచి పెద్దల వరకు తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఆధ్యాత్మిక సేవతో పాటు గోశాల ఏర్పాటు చేసి గోవులను పెంచుతున్న నాగభూషణం సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గోమాత గోశాల కన్వీనర్ పాతూరి శ్రీనివాసరావు, యు బ్లడ్ వ్యవస్థాపకులు యలమంచిలి జగదీష్ బాబు, నాయకులు అన్నే శరత్, చర్లపల్లి కిరణ్, యేళ్ళ కిరణ్, ముసునూరు ప్రసాద్, జవ్వాది అమ్మయ్య చౌదరి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.





## సీఎం చంద్రబాబును ఆశీర్వదిస్తున్న అవ్వ,తాతలు..

గుంటూరు క్రైమ్,అక్టోబర్ 3,ప్రభాతవార్త : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక అన్ని వర్గాలకు ఆర్థిక భద్రత లభించిందని,పింఛన్‌దారులకు ఒకరోజు ముందుగానే దసరా పండుగ వచ్చిందని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు.స్థానిక ఇస్రాయేల్‌పేట,మద్దిరాల కాలనీలో సచివాలయ సిబ్బందితో కలసి ప్రతి ఇంటికి వెళ్ళి ఫించన్లు పంపిణీ చేశారు.అవ్వతాతలకు పింఛన్లు అందించి వారితో ఆప్యాయంగా మాట్లాడారు.ప్రతినెలా ఒకటో తేదిన ఫించన్లు అందిస్తుంటే మా పెద్దకొడుకు చంద్రబాబు నాయుడు చల్లంగుండాలయ్య అని దీవిస్తున్నారని చెప్పారు.పింఛన్ తీసుకుంటూ భాగస్వామిలో ఒకరు చనిపోతే మరొకరికి వెంటనే పింఛన్ అందిస్తున్నామని వెల్లడించారు.పుట్టెడు దు:ఖంలో ఉన్న కుటుంబానికి వెన్నుదన్నుగా నిలుస్తున్నామన్నారు.కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గ పరిశీలకులు గంజం రాఘవేంద్ర,కార్పొరేటర్ రిహానా,చెట్టు కనకారావు,ఖాశిం బాబు,ఖాసిం వలి,ఇమ్రాన్,శివరాజ్,దాసు మాస్టారు,బెనర్జీ మాస్టారు,నిరంజన్,అప్పారావు,ఖాజా,బుసి కిరణ్,నూర్ సాంబశివరావు, వేంకటేశ్వర్లు,సుబ్బారావు,తదితరులు పాల్గొన్నారు.



## సోమరౌతు సేవలు నిరూపమానం



గుంటూరు నగరపాలక సంస్థ,అక్టోబర్ 3,ప్రభాతవార్త : ప్రొగ్రెసివ్ మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులుగా సోమరౌతు శ్రీనివాసరావు అందిస్తున్న యూనియన్ పరమైన ఉపాధ్యాయ సేవలు నిరుపమానమని పలువురు ఉపాధ్యాయులు ప్రశంసల జల్లు కురిపించారు.సోమరౌతు శ్రీనివాసరావు జన్మదిన సందర్భంగా యూనియన్‌లోని పలువురు నాయకులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు అందజేశారు.ఈ సందర్భంగా సోమరౌతు యూనియన్ పరంగా ఉపాధ్యాయులకు అందిస్తున్న సేవల పట్ల ప్రశంసలు కురిపించారు.

## ఎన్‌డిఎస్‌ఎఫ్ జాతీయ చైర్మన్‌గా వడ్లమూరి కృష్ణ స్వరూప్

గుంటూరు విద్య,అక్టోబర్ 3,ప్రభాతవార్త : జాతీయ ప్రజాస్వామిక లౌకిక కూటమి ఎన్‌డిఎస్‌ఎఫ్ మూడోసారి జాతీయ చైర్మన్‌గా వడ్లమూరి కృష్ణస్వరూప్ ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని నూతన చైర్మన్ కృష్ణస్వరూప్ తెలిపారు.ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన మహాసభలో వివిధ పార్టీలు ప్రజా ఉద్యమ సంస్థలకు చెందిన ప్రతినిధులతో నూతన కమిటీ ని ఎన్నుకోవడం జరిగింది.ఎన్‌డిఎస్‌ఎఫ్ వర్కింగ్ చైర్మన్‌లు డాక్టర్ వి.ఎల్.రాజు,జె.ఎస్.రావు,ఎమ్.బి ఆశోక్ చక్రవర్తులు ఎన్నికయ్యారు.ప్రధాన కార్యదర్శులుగా పి.రాజలింగం,ఎస్.అశోక్‌కుమార్,షేక్ భాషా,ఉప-అధ్యక్షులుగా పులూరి వెంకట రాజేశ్వరరావు,సిహెచ్ రోజిలీలా,గంధం శంకర్‌లు ఎన్నికయ్యారు. జాతీయ అధికార ప్రతినిధులుగా కొల్లి సుధాకర్,గోతల శ్రీనివాస్,లీగల్‌సెల్ కన్వీనర్‌గా కె.శరత్‌కుమార్,కార్యవర్గ సభ్యులు ఎస్.ఆంజనేయులు,ఉప్పు రాంబాబు,ఉయ్యాల చిన్నా,సునీల్ కుమార్ షిండేలను ఎన్నుకోవడం జరిగిందని వెల్లడించారు.త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలు మరియు 11వసెంబ్లీ ఉప ఎన్నికల్లో ఎన్‌డిఎస్‌ఎఫ్ తరుపున ఉమ్మడిగా పోటీ చేయాలని,జనవరి 26న చలో గవర్నర్ రాజ్‌భవన్ కార్యక్రమాలను నిర్వహించాలని మహా సభ ఏకగ్రీవంగా తీర్మానం చేయడం జరిగిందని ఫ్రంట్ చైర్మెన్ వడ్లమూరి కృష్ణ స్వరూప్ తెలిపారు.



## 18వ సెవెన్ హిల్స్‌ఫార్మసీ బ్రాంచ్ ప్రారంభించిన డేగల

గుంటూరు క్రైమ్,అక్టోబర్ 3,ప్రభాతవార్త : ప్రజాసేవే లక్ష్యంగా ప్రజలకు నాణ్యమైన మందులను అత్యధిక డిస్కౌంట్ తో తక్కువ ధరలకే అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న ఏకైక ఫార్మసీ సెవెన్ హిల్స్ ఫార్మసీ అని సెవెన్ హిల్స్ ఫార్మసీ చైర్మన్ మరియు ఏపిఐఐసి పూర్వ చైర్మెన్ డేగల ప్రభాకర్ అన్నారు.స్థానిక మాయాబజార్ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన 18వ సెవెన్ హిల్స్‌ఫార్మసీ బ్రాంచ్‌ను తూర్పు ఎమ్మెల్యే నసీర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా డేగల మాట్లాడుతూ గత 30సంవత్సరాలుగా ప్రజాసేవే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఏకైక ఫార్మసీ సెవెన్ హిల్స్ అని కొనియాడారు.ప్రజలు చూపిస్తున్న ఆదరణకు నిదర్శనంగా ప్రారంభించిన 18వ బ్రాంచ్ ఉదాహరణ అని అన్నారు.ప్రజలు కష్టమర్లు సెవెన్ హిల్స్ ఫార్మసీ పై చూపిస్తున్న ఆదరణకు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో హాజ్ కమిటీ చైర్మన్ షేక్ హసన్ బాషా,జీఎంసి డిప్యూటీ మేయర్ షేక్ సజీల,కార్పొరేటర్లు ఖాజా,మొయినుద్దీన్ చిష్తి,షేక్ మీరావలి,యర్రగొర్ల నాగేశ్వరరావు,మహాకాళి నరసింహారావు,జగద్గురుమూడి శ్రీను,అమర్‌నాథ్,రాగం సదాశివరావు,మేకల బాబురావు,బొక్కిసం శివరామ్ తదితరులు పాల్గొన్నారు.




## కలెక్టర్‌ను కలిసిన బిజెపి జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు

గుంటూరు విద్య,అక్టోబర్ 3,ప్రభాతవార్త : జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాను బిజెపి జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై చర్చలు జరిపారు.ముఖ్యంగా ఫ్లైఓవర్ల విభాగాన్ని మరింత బలోపేతం చేసి,ప్రజలకు సులభంగా అందుబాటులోకి తేవాలని కలెక్టర్‌ను కోరారు.అలాగే నగరంలోని శంకర్‌విలాస్ వంతెన పనులు చాలా కాలంగా నిలిచిపోయి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న నేపథ్యంలో వాటిని త్వరితగతిన పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని అభ్యర్థించారు.సమావేశంలో బిజెపి జిల్లా ప్రధానకార్యదర్శి భజరంగ్ రామకృష్ణ,వైస్ సుబ్బారావు,వరకా కుమార్ గౌడ్ పాల్గొన్నారు.



## జీఎంసికి రాష్ట్రస్థాయి అవార్డు



గుంటూరు నగరపాలక సంస్థ,అక్టోబర్ 3,ప్రభాతవార్త : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా అమలుచేస్తున్న స్వచ్ఛ ఆంధ్ర రాష్ట్రస్థాయి అవార్డుల్లో జీఎంసి కి స్వచ్ఛ మున్సిపాలిటీ ల్లో (స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు ప్రత్యేక కేటగిరి)లో అవార్డు దక్కిందని,ఈ అవార్డును ఈనెల 6న విజయవాడలో జరిగే స్వచ్ఛ ఆంధ్ర సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు చేతుల మీదుగా నగర మేయర్,కమిషనర్లు అందుకుంటారని జీఎంసి కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ మిషన్ స్ఫూర్తితో దేశంలో తొలిసారిగా ఏపి ప్రభుత్వం 17కేటగిరిల్లో ఎంపిక చేసిన వివరాలను జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ప్రకటించారని అందులో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు ప్రత్యేక కేటగిరిలోజీఎంసి స్థానం దక్కించుకోవడం గర్వకారణమన్నారు.ఉత్తమ స్వచ్ఛత వారియర్స్ విభాగంలో కూడా జీఎంసి పారిశుద్ధ్య కార్మికులను కల్లా సుమలత స్థానం దక్కించుకున్నారన్నారు.ఇప్పటికే జాతీయ స్థాయిలో జీఎంసి పలు అవార్డులు గత ఏడాది సైతం దక్కించుకుందని,రాష్ట్ర స్థాయిలో తొలిసారిగా ప్రవేశపెట్టిన అవార్డుల్లో కూడా స్థానం దక్కించుకోవడం ఆనందంగా ఉందని,ఇందుకు కృషి చేసిన ప్రజారోగ్య కార్మికులు,అధికారులు,కార్యదర్శులు,స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు,నగర ప్రజలు అభినందనలు తెలుపుతున్నామన్నారు.

## ఆర్థిక బకాయిలు చెల్లించండి

గుంటూరు విద్య,అక్టోబర్ 3,ప్రభాతవార్త : ఆర్థిక,విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం అక్టోబర్ 7వ తేదిన విజయవాడ ధర్నా చౌక్ వద్ద జరిగేరా ష్ట్ర ఫ్యాప్టో పోరుబాట విజయవంతం చేయడానికి మంగళగిరి ప్రాంతీయ ఫ్యాప్టో సన్నాహక సమావేశం శుక్రవారం సాయంత్రం కెకె మున్సిపల్ హైస్కూల్లో ఫ్యాప్టో జిల్లా చైర్మన్ కె.నరసింహారావు అధ్యక్షతన జరిగింది.జిల్లా ఫ్యాప్టో డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ యు.రాజశేఖర్,డి.కె.సుబ్బారెడ్డి,ఎండి ఖలీద్, సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించారు.మనకి న్యాయంగా రావలసిన ఆర్థిక అవసరాలు ఇంతవరకు ఏమీ తీర్చలేదు.ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలను వివరించారు. 7వ తేది విజయవాడలో జరగనున్న ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఎండి సాలార్‌బేగ్ (ఏరియా కార్యదర్శి),సంగినేని శ్రీనివాస్,షేక్ సైదా నాయక్, బి.మదన్‌కుమార్, ఐ.గోపిచంద్, కె.కృష్ణ,ఎం. నాగరాజు, టి.ఆంజనేయులు, ఆ.శ్రీనివాసరావు, ఏ.జోజప్ప, పి.అరుణ్‌కుమార్, కెవి కోటేశ్వరరావు,సుబ్బారెడ్డి,యు.ఏడుకొండలు (యుటిఎఫ్) ఎం.ధనరాజారావు (యుటిఎఫ్), డి,చిన్న అంకారావు (యుటిఎఫ్), మొదలైనవారు ఇతర ఫ్యాప్టో సభ్యులు పాల్గొన్నారు.సమావేశంలో జిల్లా ఫ్యాప్టో చైర్మన్ కె.నరసింహారావు,డిప్యూటీ జనరల్ సెక్రటరీ జనరల్స్ కలసి ధర్నా పోస్టర్లను,కరపత్రాలను ఆవిష్కరించారు.



శుక్రవారం సిఎం చంద్రబాబునాయుడు అధ్యక్షతన కేబినెట్ భేటీ చిత్రం. (గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి)

# అమరావతిలో పెట్టుబడులు పెట్టేందుకు మలేషియా కంపెనీల ఆసక్తి

గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, అక్టోబర్ 3: సచివాలయంలో శుక్రవారం మునిసిపల్ పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రినారాయణను మలేషియా ప్రతినిధి బృందం కలిసింది. ఈ సమావేశంలో మలేషియాలోని సెలాంగార్ స్టేట్ ఎక్స్‌కో మంత్రి పప్పారాయుడు, క్లాంగ్ ఎంపీ గణపతిరావు, మలేషియాఆంధ్రా బిజినెస్ చాంబర్ ప్రతినిధులు మరియు పలు ప్రైవేట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.మంత్రి నారాయణ అమరావతి నిర్మాణ పురోగతిని మలేషియా బృందానికి వివరించారు. ఆయన మాట్లాడుతూ అమరావతిని ప్రపంచంలోని టాప్ 5 రాజధానుల్లో ఒకటిగా అభివృద్ధి చేస్తున్నామని, ఇప్పటికే రూ.51 వేల కోట్ల విలువైన పనుల టెండర్లు పూర్తయ్యి పనులు ప్రారంభమైనట్లు తెలిపారు. 360 కి.మీ. ట్రంక్ రోడ్లను ఏడాదిన్నరలోగా, 1500 కి.మీ. లేఅవుట్ రోడ్లను రెండేళ్లలోగా పూర్తి చేస్తామని, అలాగే అధికారుల, ఉద్యోగుల, ప్రజాప్రతినిధుల కోసం 4000 ఇళ్లను వచ్చే మార్చి నెలాఖరులోగా పూర్తి చేయాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నట్లు చెప్పారు. సచివాలయ టవర్లు, అసెంబ్లీ, హైకోర్టు భవనాలను రెండున్నరేళ్లలోగా పూర్తి చేసే విధంగా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఇటీవల వర్షాల వలన కొంత ఆలస్యం జరిగినప్పటికీ పనులు వేగవంతం అవుతున్నాయని తెలిపారు.మలేషియా ప్రతినిధులు రాబోయే ఐదేళ్లలో రూ.6,000 కోట్ల నుంచి రూ.10,000 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమని, ముఖ్యంగా విద్య, టూరిజంహాస్పిటాలిటీ, ట్రేడ్ అండ్ కామర్స్, రియల్ ఎస్టేట్, తెలుగు సంస్కృతిసంప్రదాయాలకు సంబంధించిన ప్రాజెక్టులలో ఆసక్తి చూపుతున్నట్లు వెల్లడించారు. మలేషియాలోని సైబర్ జయ యూనివర్శిటీ అమరావతిలో మెడికల్ యూనివర్శిటీ స్థాపనకు ముందుకు రాగా, బెర్జయా గ్రూప్ ఐదు స్టార్ హోటళ్ల ఏర్పాటు ప్రతిపాదనను ఉంచింది.ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గారు నారా చంద్రబాబు నాయుడు, మునిసిపల్ పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ గౌరవ మంత్రి పి. నారాయణ, మునిసిపల్ పరిపాలన ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్, ఏపీ సిఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, అదనపు కమిషనర్ భార్గవ తేజ, మరియు డిప్యూటీ డైరెక్టర్ (కమ్యూనికేషన్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్), హెడ్ శీనితి రీజియన్ ఎం. సిద్ధార్థ వర్మ పాల్గొన్నారు.





## జాతీయ స్వాతంత్ర్య ఉద్యమకారులను విద్యార్థులు మరువరాదు

గుంటూరు విద్య,అక్టోబర్ 3,ప్రభాతవార్త : ప్రముఖ జాతీయ నాయకులు పోరాట ఉద్యమాలు,ప్రాణత్యాగల ఫలితంగా మనం స్వాతంత్ర్యాన్ని సాధించుకోగలిగామని,అలాంటి మహనీయులను విద్యార్థులు ఎన్నటికి మరవరాదని సెయింట్ లారెన్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ సెక్రటరీ కరస్పాండెంట్ మేకల రవీంద్రబాబు అన్నారు. మహాత్మాగాంధీ,లాల్ బహదూర్ శాస్త్రిల పుట్టినరోజు వేడుకలను స్కూల్ ప్రాంగణంలో విద్యార్థులు,ఉపాధ్యాయులు,కార్యాలయ సిబ్బంది మధ్య అత్యంత ఘనంగా జరిపారు.అనంతరం వారి చిత్రపటాలకు పూలమాలలవేసి ఘనంగా నివాళులర్పించారు.కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్లు శ్రీకర్,శేష్‌కుమారి,ప్రధానోపాధ్యాయులు,ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.



## రోడ్లపై ఆక్రమణలు యుద్ధప్రాతిపదికపై తొలగింపు

గుంటూరు నగరపాలక సంస్థ,అక్టోబర్ 3,ప్రభాతవార్త : రోడ్లమీద ట్రాఫిక్ సమస్య,డ్రైన్లపై మురుగుపారుదలకు అడ్డుగా ఉన్న ఆక్రమణలను తొలగించాలని జీఎంసి కమీషనర్ పులి శ్రీనివాసులు పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు.శుక్రవారం స్థానిక పట్టాభిపురం మెయిన్ రోడ్డు,భాగ్యనగర్,తుఫాన్‌నగర్,మారతీనగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య,అభివృద్ధి పనులను పరిశీలించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ వర్షం నీరు డ్రైన్లలో సక్రమంగా వెళ్ళడానికి వీల్లేకుండా ట్రాఫిక్‌కు అంతరాయంగా ఆక్రమణలు ఉండడానికి వీల్లేదని,ఇప్పటికే పలుమార్లు ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని తెలిపినందున పట్టణ ప్రణాళిక అధికారులు తొలగించాలని ఆదేశించారు.రోడ్లవెంబడి ఉన్న టీస్టాల్స్,టిఫిన్ స్టాల్స్ వ్యర్థాలను డ్రైన్లలో వేస్తున్నారని దీనివల్ల చిన్నపాటి వర్షాలకు కూడా డ్రైన్లు ఓవర్ ఫ్లో జరిగి ప్రజలు ఇబ్బందుల పడుతున్నందున అలాంటి వారి ఆక్రమణలు తొలగించడంతోపాటు భారీ మొత్తంలో అపరాధ రుసుం విధించాలన్నారు.కమీషనర్ పర్యటనలో పట్టణ ప్రణాళిక,ఇంజనీరింగ్,ప్రజారోగ్య అధికారులు,సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.




## తోట చంద్రయ్య కుటుంబానికి న్యాయం జరగకుండా అడ్డుకుంటున్న వైసీపీ
### -గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి

గుంటూరు, ప్రభాతవార్త ప్రతినిధి, అక్టోబర్ 3: తోట చంద్రయ్య కుటుంబానికి న్యాయం జరగకుండా వైసీపీ అడ్డుకుంటుందని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ "2024 ఎన్నికల్లో వైసీపీకి 11 సీట్లే ఇచ్చి ప్రజలు బుద్ధి చెప్పిన.. ఇప్పటికి అదే కూరత్వాన్ని కొనసాగిస్తుంది వైసీపీ. నా బీసీలు, నా ఎస్టీలు, నా ఎస్సీలు అంటూ గొప్పలు చెప్పుకునే వైసీపీ స్థానిక సంస్థల్లో అన్న ఎన్టీఆర్ గారు, ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు బడుగు బలహీన వర్గాలకు 34 శాతం రిజ్వరేషన్లు కేటాయిస్తే.. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత దానిని 24 శాతానికి కుదించింది. ఈ కుదింపుతో దాదాపు 16,800 మంది రాజ్యాంగ పదవులకు దూరం అవ్వటానికి జగన్ రెడ్డి కారణం అయ్యాడు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో 26 మంది బీసీలను హత్య చేసి, 750 మందిపై తప్పుడు కేసులు, 2,500 మందిపై దాడులు జరిగాయి. జగన్ రెడ్డి పాలనలో ప్రపంచం అంతా కూడా కరోనాతో బాధపడితే.. ఆంధ్ర రాష్ట్రం మాత్రం ఇటు కోవిడ్ - 19తో, అటు జగన్ - 19తో సతమతమైంది. తెలుగుదేశం పార్టీ జెండాను బలంగా మోశాడనే కారణంతో తోట చంద్రయ్యకు వైసీపీ ప్రభుత్వం చేసిన దాష్టికం అంతాఇంతా కాదు. వైసీపీ నాయకులు కృరంగా, అతి కిరాతకంగా నడిరోడ్డు మీద బండరాళ్లతో హతమార్చిన ఘటనను గుర్తు తెచ్చుకుంటే కన్నీరు వచ్చే పరిస్థితి. అదే చంద్రయ్య కుటుంబానికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వారికి న్యాయం చేయాలనే ఆలోచనతో చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చేందుకు శాసనమండలిలో బిల్లును ప్రవేశపెట్టింది. వైసీపీ ఎమ్మెల్సీ బోత్స సత్యనారాయణ ఆ కుటుంబంలో ఎవరికి కూడా ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాల్సిన ఇవ్వకూడదని చెప్పి ఆయన ఖండించిన తీరు ఎంతో హేయంగా ఉంది. నా బీసీలు, నా ఎస్సీ, నా ఎస్టీలు అంటూ ప్రగల్భాలు పలికిన జగన్ రెడ్డే బోత్స సత్యనారాయణతో ఇలా మాట్లాడించినట్లు స్పష్టంగా కనిపిస్తుంది. చంద్రయ్య బీసీ వర్గానికి చెందిన వారు కాబట్టే ఈ బిల్లు వ్యతిరేకించాడని చాలా స్పష్టంగా కనిపిస్తుంది. శాసనమండలి సాక్షిగా బీసీల ప్రగతిని జగన్ రెడ్డి డైరెక్షన్ లో బోత్స సత్యనారాయణ అడ్డుకున్నది వాస్తవం కాదా..? జగన్ రెడ్డి పెత్తందారి పోకడలు ఈ సంఘటనల ద్వారా సుస్పష్టంగా కనిపిస్తున్నాయి. బీసీల ప్రగతిని అడ్డుకున్న వైసీపీకి రాజకీయ సమాధి కట్టేది బీసీలే అని గుర్తు పెట్టుకోవాలి. అనాటి నుంచి ఈనాటి వరకు బీసీల పట్ల జరుగుతున్న దాష్టికానికి ప్రయత్నిస్తున్న వైసీసీ తీరును రాష్ట్రవ్యాప్తంగా ప్రజలందరూ గమనిస్తున్నారు. ఇటీవల వడ్డెర సోదరుల మీద జరిగిన దాడిని, అలాగే 15 రోజుల క్రితం రజక సోదరుల మీద కులం, జాతి పేర్ల మీద జరిగిన దాడి.. అన్ని కూడా వైసీపీ నాయకుల అడ్డగోలు నాయకత్వానికి నిదర్శనంగా నిలుస్తాయి. రానున్న రోజుల్లో 11 సీట్లు కాదు కదా.. కనీసం 1 సీటు కూడా వైసీపీకి గెలిచే అవకాశం లేదు. అందుకు వైసీపీ నాయకులు అసలు అర్హులు కారనే విషయం ప్రజలందరికీ తెలుసు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో నక్స్ లైట్ల చేతిలో పిన్నెల్లి సుందరామి రెడ్డి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చిన విషయం వైసీపీ నాయకులు గుర్తు చేసుకోవాలి. అదే తోట చంద్రయ్య కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం కేటాయిస్తుంటే ఎందుకు అడ్డుకుంటున్నారో అత్మవిమర్శ చేసుకోవాల్లి అని అన్నారు.



## ఘనంగా లియాపీ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు

గుంటూరు విద్య,అక్టోబర్ 3,ప్రభాతవార్త : లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అసోసియేషన్ అయిన లియాఫి వ్యవస్థాపక దినోత్సవం వేడుకలు అమరావతి రోడ్డులోని సిపిబి 706బ్రాంచిలో ఘనంగా జరిగాయి.ఎల్ఐసి ఏజెంట్ అధ్యక్షులు పులివర్తి సుబ్బారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పెద్దఎత్తున ఏజెంట్లు పాల్గొన్నారు.తొలుత జాతిపిత మహాత్మాగాంధీ,దేశ రెండవ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రిల జన్మదిన వేడుకలు జరిపి వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ముఖ్యఅతిధిగా లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ బి.మార్కండేయులు మాట్లాడుతూ భారతీయ జీవితభీమా సంస్థ మహోన్నతమైందన్నారు.దీనిద్వారా జీవితభీమా జ్యోతి నలు దిశలు వ్యాపింప చేస్తున్న ఘనత ఏజెంట్ మిత్రులదన్నారు.ఎల్ఐసీ ఏజెంట్లకు బోనస్ పెంపుదల చేసే విధంగా ఎల్ఐసి సంస్థ నిర్వాహకులు తగిన చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.సీనియర్ బ్రాంచ్ మేనేజర్ జె.వి.ఎస్.ఎన్.సురేష్‌బాబు మాట్లాడుతూ ఎల్ఐసి ప్రాముఖ్యతను వివరించారు.లియాపి వ్యవస్థాపక దినోత్సవ ప్రాముఖ్యతను,ఏజెంట్స్ నైతిక విలువలను తెలియజేశారు.మచిలీపట్నం డివిజన్ వైస్ ప్రెసిడెంట్ పల్నాటి భావనారాయణ,ట్రెజరర్ పసుమర్తి జగన్నాధం,తదితరులు మాట్లాడుతూ ఎల్ఐసీ ఏజెంట్ల వృత్తి పరిరక్షణ సంక్షేమం గురించి వివరించారు.బ్రాంచ్ కార్యదర్శి జగదీష్ కోశాధికారి గార్లపాటి శ్రీనివాసరావు,మాజీ సెక్రటరీ పెనుమాక కోటేశ్వరరావు,లియాపి వ్యవస్థాపక కార్యదర్శి పి.నాగేశ్వరరావు,జయప్రకాష్,సిహెచ్ వెంకటేశ్వరరావు,గుంటూరు పరిశుద్ధరావు,యామినీ దేవి,సుమతి తదితరులు పాల్గొన్నారు.ఏజెంట్ల విధి నిర్వహణలో అసువులు బాసిన ఎస్ఎస్ఆలీ,దేవ్ ముదిబిద్రి,ఏకే పురకాఇస్తాలకు నాయకులు ఘన నివాళులర్పించారు.



## భాషోపాధ్యాయులకు దక్కిన పదోన్నతులు

గుంటూరు విద్య,అక్టోబర్ 3,ప్రభాతవార్త : రాష్ట్రవ్యాప్తంగా భాషా పండిత పోస్టులు రద్దు కారణంగా గత 6సంవత్సరాలుగా భాషేతర పోస్టుల్లో జీతాలు తీసుకుంటూ భాషలు బోధిస్తున్న తెలుగు,హిందీ,ఉర్దూ భాషోపాధ్యాయులను డీఈవో పూల్ నుండి విముక్తి కలిగింది.స్కూల్ అసిస్టెంట్ భాషలుగా,భాషోపాధ్యాయులుగా పదోన్నతులు లభించాయి.జిఓ నెం 77రద్దుచేస్తానంటూ హామీ ఇచ్చి నెరవేర్చిన డిప్యూటీ సీఎం కొణిదెల పవన్‌కళ్యాణ్ కి హిందీ ఉపాధ్యాయ సంఘం ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు సంఘ రాష్ట్ర అధ్యక్షులు వలిమిరెడ్డి విజయ్‌కుమార్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడికొండ సదానందబాబు పేర్కొన్నారు.విజయానికి ప్రత్యక్షంగా సహకరించిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్,రాష్ట్ర విద్యాశాఖ కమీషనర్ విజయరామరాజుకి హిందీ ఉపాధ్యా సంఘం ఆంధ్రప్రదేశ్ తమ కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వెల్లడించారు.భాషల ఔన్నత్యానికి భవిష్యత్తు బాషల మనుగడకు కూటమి ప్రభుత్వం కృషి చేయాలని,2021నుంచి నిలిపి వేసిన ఎల్పీసెట్‌ను పునరుద్ధరించి భాషా శిక్షణా కేంద్రాలు తిరిగి ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని విద్యాశాఖకు విజ్ఞప్తి చేశారు.ఇంకా మున్సిపల్ పాఠశాల్లో పదోన్నతులు లభించని భాషా పండితులకు వెంటనే పదోన్నతి కల్పించాలని హిందీ ఉపాధ్యా సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు వనిమిరెడ్డి విజయ్‌కుమార్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడికొండ సదానందబాబు విజ్ఞప్తి చేశారు.



## ఎంపీ వల్లభనేని బాలశౌరితో జనసేన నేత కంకణాల శంకర్ భేటీ



మంగళగిరి, అక్టోబర్ 3, ప్రభాతవార్త: మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరిని గుంటూరులోని ఆయన నివాస గృహంలో మంగళగిరి నియోజకవర్గ జనసేన పార్టీ సీనియర్ నాయకులు కంకణాల శంకర్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందజేసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ బాలశౌరి జనసేన నేత కంకణాల శంకర్ యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మంగళగిరి నియోజకవర్గ జనసేన పార్టీ సీనియర్ నేతగా కొనసాగుతూ పార్టీ బలోపేతానికై అహర్నిశలు అంకితభావంతో కృషి చేస్తోన్నందుకు అభినందనలు తెలిపారు. జనసేన పార్టీ బలోపేతం కోసం కృషి చేసిన నేతలకు తప్పకుండా తగిన గుర్తింపు లభిస్తుందని, పదవీ నియామకాల్లో తగిన ప్రాధాన్యత కల్పించడం జరుగుతుందని ఎంపీ బాలశౌరి పేర్కొన్నారు.

## మంగళగిరి నగర కమిషనర్ అలిమ్ భాషాకు అభినందన



మంగళగిరి, అక్టోబర్ 3, ప్రభాతవార్త: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయంలో నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి అహర్నిశలు పని చేసి స్వచ్ఛ ఆంధ్ర అవార్డు 2025 ఎంపికకు కృషి చేసిన నగర కమీషనర్ అలిమ్ భాషాను శుక్రవారం టీడీపీ నాయకులు కలసి అభినందించారు. టీడీపీ నాయకులు గోవాడ దుర్గారావు, కమిషనర్ అలిమ్ భాషా ను శాలువాతో సత్కరించి పూల మొక్క అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు గోవాడ రవి, ఐ టీడీపీ ప్రతినిధి యేమినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ఉమ్మడి అనంతపురం,నెల్లూరు జిల్లాల వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్‌గా మిథున్‌రెడ్డి

తాడేపల్లి,అక్టోబర్ 3,ప్రభాతవార్త : ఉమ్మడి అనంతపురం,నెల్లూరు జిల్లాల వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్‌గా పి.వి.మిథున్‌రెడ్డి ని వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి నియమించారు.కూటమి ప్రభుత్వ అక్రమ కేసుల్లో అరెస్టైన తర్వాత మిథున్‌రెడ్డి బాధ్యతలు సీనియర్ నాయకులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,కారుమూరి నాగేశ్వరరావులకు అప్పగించారు.ఇటీవలే మిథున్‌రెడ్డి బెయిల్‌పై విడుదల కావడంతో ఆయా జిల్లాల బాధ్యతలు తిరిగి ఆయనకే అప్పగించారు.ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రకటన విడుదల చేసింది.

## నూతన యంత్రం ప్రారంభం




పొన్నూరు, అక్టోబరు 3,ప్రభాతవార్త: వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా సంగం డెయిరీ పాలు, పదార్థాలను తయారు చేసి సరఫరా చేస్తోందని సంగం డెయిరీ ఛైర్మన్, ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. చేబ్రోలు మండలం, వడ్లమూడి సంగం డెయిరీలో విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని మల్టీప్యాక్ పన్నీర్ ప్యాకేజింగ్ యంత్రాన్ని నరేంద్రకుమార్ లాంఛనంగా ప్రారంభించారు. పన్నీరు కొత్త ప్యాకింగ్‌లలో మార్కెట్లోకి విడుదల చేస్తామన్నారు. ఆధునిక జీవన శైలిలో ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారం అవసరమని గుర్తించి ప్రోటీన్ పుష్కలంగా కలిగిన పన్నీర్‌ను ఆధునిక, పరిశుభ్రమైన ప్యాకేజింగ్‌లో సంగం డెయిరీ అందిస్తుందన్నారు. అత్యాధునిక సాంకేతికత కలిగిన మల్టీ ప్యాక్ ప్యాకేజింగ్ వల్ల పన్నీర్ ఎక్కువ కాలం నిలువ చేసుకోవచ్చన్నారు. తద్వారా అన్నీ ప్రాంతాలకు సరఫరా చేయడం వల్ల అందరికీ స్వచ్ఛమైన, సురక్షితమైన పన్నీర్‌ను వినియోగదారులకు అందజేయవచ్చన్నారు.పన్నీర్ 200గ్రాములు, 500గ్రాములు, ఒక కిలో ప్యాకింగ్‌లో వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో సంగం డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ గోపాలకృష్ణన్, సంగం డెయిరీ డైరెక్టర్ బొర్రు రామారావు, పాలక వర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. తొలుత సంగం డెయిరీలో విజయదశమి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిసి హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ ధూళిపాళ్ళ జ్యోతిర్మయి పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమాలు లేని సమాజం రావాలి



పొన్నూరు, అక్టోబరు 3,ప్రభాతవార్త: వృద్ధాశ్రమాలు లేని సమాజస్థాపనకు ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలని పెన్షనర్స్ అసోసియేషన్ నాయకుడు, విశ్రాంత తెలుగు పండిత ప్రధానోపాధ్యాయుడు సూరా రామారావు అన్నారు. మండల పరిధిలోని కసుకర్రు గ్రామంలో ఉన్నటువంటి వృద్ధాశ్రమాన్ని అసోసియేషన్ నాయకులు సందర్శించి అక్కడ వృద్ధుల సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా పలువురు వృద్ధులకు చీరలను, దుప్పట్లను అందజేశారు. ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రులను తామే చూసుకొనేవిధంగా ప్రతి కొడుకు ఆలోచన చేయాలన్నారు. బిడ్డకు తల్లిదండ్రులు భారం అని తలచకూడదన్నారు. తల్లిదండ్రులు లేకపోతే మన జన్మ లేదన్న విషయాన్ని ప్రతి కుమారుడు, కూతురు గ్రహించాలన్నారు. తల్లిదండ్రులు, తాత ముత్తాలు ఇంటికి అలంకార ప్రాయమన్న విషయాన్ని కొడుకులు గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ఎం.సాంబిరెడ్డి, పి.సాంబిరెడ్డి, హరనాథ్, వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

## 300 బస్తాల పిడిఎస్ బియ్యం సీజ్



పొన్నూరు, అక్టోబరు 3,ప్రభాతవార్త: పేదలకు చెందాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తే చూస్తూ ఊరుకోబోమని అర్బన్ సిఐ లావూరి వీరానాయక్ హెచ్చరించారు. గురువారం తెల్లవారు జామున(2వతేదీ) అక్రమంగా బియ్యం రవాణా అవుతుందన్న సమాచారం మేరకు స్థానిక ఐలాండ్ సెంటర్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న నేపథ్యంలో టాటా కంటైనర్ ఆగి ఉంది. పోలీసులను చూసి ఓ వ్యక్తి పారిపోయేందుకు ప్రయత్నించాడు. సదరు వ్యక్తిని పోలీసులు ఛేజింగ్ చేసి పట్టుకొన్నారు. అతన్ని వివరాలు అడిగారు. ఆ వ్యక్తి పల్నాడు జిల్లా, నాదెండ్ల మండలం, గణపవరం గ్రామానికి చెందిన తాళ్లూరి మహేష్‌గా చెప్పాడు. అతన్ని పోలీసులు పిడిఎస్ బియ్యం ఎక్కడి నుండి తెస్తున్నావని అడుగగా భట్టిప్రోలు గ్రామానికి చెందిన శ్రీనివాసరావు వద్ద నుంచి తీసుకొని చిలకలూరి పేటలోని మా టాటా కంటైనర్ ఓనర్ కిషోర్ వద్దకు తీసుకెళ్తున్నట్లు చెప్పాడు. ఒక్కొక్కటి 50కిలోల పరిమాణం కలిగిన 300బస్తాలను ఎక్కించుకొని వస్తున్నట్లు పోలీసులకు చెప్పాడు. అర్బన్ సిఐ లావూరి వీరానాయక్ 300బస్తాల పిడిఎస్ బియ్యాన్ని, టాటా కంటైనర్ వాహనాన్ని సీజ్ చేసినట్లు చెప్పారు.

## భక్తిశ్రద్ధలతో శమీపూజ



పొన్నూరు, అక్టోబరు 3,ప్రభాతవార్త: పట్టణంలోని సాయినగర్‌లో వేంచేసియున్న శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో విజయదశమి, శ్రీ షిరిడి సాయి బాబా 107వ పుణ్యతిథి ఉత్సవాల సందర్భంగా శమీ పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మందిర స్థలదాత ఆలపాటి శ్రీనివాసరావు-వేద కళ్యాణి దంపతులు శమీ పూజలో పాల్గొని శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అర్చకస్వాములు వేద మంత్రోచ్ఛారణల నడుమ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా శ్రీ షిరిడి సాయి సేవా మండలి ఛైర్మన్ సజ్జా మధుసూదనరావు నేతృత్వంలో కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

## మాజీ సైనికోద్యోగి మస్తాన్‌కు వికసిత్ భారత్ అవార్డు



పొన్నూరు, అక్టోబరు 3,ప్రభాతవార్త: మాజీ సైనికోద్యోగుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ సైనికోద్యోగి షేక్ మస్తాన్‌కు మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ సారథ్యంలో వికసిత్ భారత్ అవార్డు వరించింది. గత నెల 29,20వతేదీల్లో ఢిల్లీలో జరిగిన వికసిత్ భారత్ కార్యక్రమంలో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. షేక్ మస్తాన్ మిలటరీలో మేజర్ సుబేదార్‌గా విధులు నిర్వహించారు. సైనికోద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా మునిసిపల్‌శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న అనేక సేవా కార్యక్రమాల్లో కూడా తన వంతు కర్తవ్యాన్ని నిర్వహించారు. మస్తాన్ అవార్డు అందుకోవడం పట్ల నాయకులు దుశ్శాలువాతో, బొకేతలతో, మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో షేక్ బాజిసాహెబ్, పఠాన్ పిరోజ్‌ఖాన్, అబ్దుల్ ఖదీర్, జానీబేగ్ తదితరులున్నారు. షేక్ సిలార్‌బాషా, పఠాన్ అహమ్మద్‌ఖాన్ తదితరులున్నారు.

## భక్తిశ్రద్ధలతో విజయదశమి వేడుకలు



పొన్నూరు, అక్టోబరు 3,ప్రభాతవార్త: పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవాలయంలో విజయదశమి పర్వదినం సందర్భంగా కన్యకాపరమేశ్వరీ అమ్మవారు కనువిందు చేసే అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దసరా పండుగ సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఈ అలంకరణ భక్తులకు కనువిందు చేసింది. పట్టణంలోని మారుమూల ప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకొన్నారు. అమ్మవారి అలంకరణను తనివితీర తిలకించిన భక్తులు తన్మయత్వం చెందారు. దసరా రోజున ప్రత్యేకాలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకొంటే సర్వసుఖాలు, సుభాలు కలుగడంతోపాటు ఈతి బాధలుత ఈరుతాయని భక్తుల విశ్వాసం. దీంతో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆర్యవైశ్య సంఘం పట్టణాధ్యక్షుడు కారుమూరి ప్రకాష్ నేతృత్వంలో కమిటి సభ్యులు ఏర్పాట్లు చేశారు.

## అహింసా మార్గాన్ని నమ్మిన నాయకుడు మహాత్మాగాంధీ



పొన్నూరు, అక్టోబరు 3,ప్రభాతవార్త: అహింసా మార్గం ద్వారానే మన దేశానికి స్వాత్యంత్యం సిద్దిస్తుందని, నమ్మి సత్యం, అహింసా అనే ఆయుధాలతో ఉద్యమించి అనుకున్నది సాధించిన ఏకైక నాయకుడు మహాత్మాగాంధీ అని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. స్థానిక ఆచార్య ఎన్జీ రంగా విగ్రహం వద్ద జరిగిన గాంధీ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశ ప్రజలందరినీ ఏకతాటిపైకి తెచ్చి దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించారని, అందుకే ఆయన జాతిపిత అయ్యారన్నారు. మహాత్ముని ఆశయ సాధనకు మనమందరం కృషి చేయాలన్నారు. మహనీయుడు సాధించిన స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రస్తుతం రాష్ట్రాభివృద్ధిలో కూటమి నేతృత్వంలోని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక దృష్టి పెట్టి అభివృద్ధిలో దూసుకుపోయేవిధంగా కృషి చేస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన అని హామీలను నెరవేర్చడం జరిగిందన్నారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయిందన్నారు.అనంతరం మునిసిపల్‌కార్మికులకు, ఇంజనీరింగ్‌లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు బట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు, మునిసిపల్ డిఈ వెంకయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇత్తడి శ్రీనివాసులు, పట్టణ ప్రణాళికాధికారి రఘురాం, రెవెన్యూ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, ఇతర శాఖల సిబ్బంది, మునిసిపల్ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాది తుమాటి రమేష్‌బాబు, నాయకులు ఆకుల సాంబశివరావు, మాదల వెంకటేశ్వరరావు, బొర్రు రామారావు, బండ్లమూడి బాబూరావు, పఠాన్ పిరోజ్‌ఖాన్, చలమశెట్టి సీతారామయ్య, షేక్ బాజిసాహెబ్, షేక్ బాజ్జి, తోట ప్రసాద్, పఠాన్ అహమ్మద్‌ఖాన్, బండారుపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు చేయూత నివ్వడం మానవ ధర్మం



పొన్నూరు, అక్టోబరు 3,ప్రభాతవార్త: పేదలకు చేయూతనివ్వడం అనేది మానవ ధర్మమని లయన్స్ క్లబ్ ఆఫ్ పొన్నూరు మహిళాక్లబ్ అధ్యక్షురాలు బేతాల ఝాన్సీరాణి అన్నారు. నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు పేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఝాన్సీరాణి మాట్లాడుతూ సొంతలాభం కొంత మానుకొని పొరుగువాడికి సహాయపడవోయ్ అన్న గురజాడ సూక్తిని అనుసరించి ప్రతి ఒక్కరూ పేదల అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రీజినల్ ఛైర్మన్ పరాశరం రంగవల్లి, మాజీ అధ్యక్షురాలు మన్నవ అనసూయాదేవి, కార్యదర్శి శోభా కలూష, కోశాధికారి పి.నిర్మలాదేవి, ఉపాధ్యక్షులు బి.శబలాదేవి, ఎన్‌వి పద్మావతి, కృష్ణకుమారి,పరాశరం శేషుకుమారి తదితరులు పాల్గొన్నారు.

## జాతిపిత మార్గం ప్రతి ఒక్కరికీ అనుసరణీయం



పొన్నూరు, అక్టోబరు 3,ప్రభాతవార్త: జాతిపిత మహ్మాగాంధీ మార్గం ప్రతి ఒక్కరికీ అనుసరణీయం,ఆచరణీయమని ఆర్యవైశ్య సంఘమ జిల్లా మాజీ అధ్యక్షుడు బాపనపల్లి ప్రభాకర లక్ష్మీప్రసాదరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోనిక మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రతి ఒక్క భారతీయుడు గురు_ంచుకోవలసిన వ్యక్తి మహాత్మాగాంధీ అని చెప్పారు. తొలుత మహాత్ముని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అవ్వారు వెంకటేశ్వరరావు, గండు శ్రీనివాసరావుతదితరులున్నారు.

## వైకాపా రాష్ట్ర ఎస్‌ఈసి సభ్యురాలుగా డాక్టర్ రూత్‌రాణి




పొన్నూరు, అక్టోబరు 3,ప్రభాతవార్త: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ స్టేట్ ఎగ్జిక్యూటీవ్ కౌన్సిల్ సభ్యురాలుగా పట్టణానికి చెందిన మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్ డాక్టర్ నల్లమోతు రూత్‌రాణిని నియమిస్తూ పార్టీ అధిష్ఠానం ఉత్తర్వులు జారీ చేసింది. వైకాపా ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి విశేషమైన సేవలందించారు. గతంలో బాపట్ల నియోజకవర్గ పరిశీలకురాలుగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం జిల్లా ఉపాధ్యక్షురాలుగా కూడా కొనసాగుతున్నారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయడంతోపాటు ప్రజల్లో మంచి పేరున్న నాయకురాలుగా గుర్తింపు పొందడంతో రూత్‌రాణి సేవలను రాష్ట్రస్థాయిలో ఉపయోగించుకునేందుకు రాష్ట్ర ఎస్‌ఈసి సభ్యురాలుగా నియమించారు. ఈ సందర్భంగా డాక్టర్ రూత్‌రాణి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ పదవి కట్టబెట్టిన పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస జగన్మోహనరెడ్డికి, నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణకు, జిల్లా పార్టీ అధ్యక్షుడు అంబటి రాంబాబుకు, ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ పటిష్టతకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు డాక్టర్ రూత్‌రాణిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ బోయిన శివనాగరాజు, మాజీ వాణిజ్యవిభాగం అధ్యక్షుడు షేక్ షఫాయితుల్లా, మాజీ జిల్లా అధికార ప్రతినిధి గేరా సుబ్బయ్య, బోయిన శివశంకర పద్మారావు, చక్కా హరీష్, చింతలపూడి మురళీకృష్ణ, అంకమ్మరావు, గోవర్ధన్, మౌలాలి, ఇమ్మానియేలు తదితరులున్నారు.

## భక్తిశ్రద్ధలతో అమ్మవారి నిమజ్జనోత్సవం



పొన్నూరు, అక్టోబరు 3,ప్రభాతవార్త: మండల పరిధిలోని ములుకుదురు గ్రామంలో విజయదశమి ఉత్సవాలలో భాగంగా నవరాత్రి ఉత్సవాలను నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గుడారంలో అమ్మవారికి తొమ్మిది రోజుల పాటు వివిధ రకాల పూజలు, అలంకరణలు, అభిషేకాలు, విశేషార్చనలు నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారు వివిధ అలంకరణలలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు ఆనందపారవశ్యం పొందారు. ఉత్సవాలు ముగింపు సందర్భంగా శుక్రవారం అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ట్రాక్టర్‌పైకి వేంచేపు చేసి ఉత్సవం నిర్వహించారు. ములుకుదురు గ్రామ సమీపంలోని కాలువలో అమ్మవారికి నిమజ్జనోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కోలాటాలు, చక్కభజనలు, తీన్‌మార్‌డప్పు విన్యాసాలు, పెద్ద ఎత్తున భాజా భజంత్రీలతో, బాణా సంచాతో అమ్మవారికి నిమజ్జనోత్సవం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కమిటి సభ్యులు కిష్టా సుబ్బారావు, బి.హనుమంత్‌ప్రసాద్, సిహెచ్ పెంచలయ్య, బి.కొండయ్య, సిహెచ్ రాజేష్, పి.మహేష్, కిష్టా వివేక్, ఇ. శివకృష్ణ తదితరులు ఏర్పాట్లు చేశారు.

## 3వ విడత రీసర్వేకి సహకరించండి




పొన్నూరు, అక్టోబరు 3,ప్రభాతవార్త: అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యల పరిష్కారానికి కూటమి సర్కార్ శ్రీకారం చుట్టిందని, రైతులందరూ సహకరించి నూరుశాతం రీ సర్వే జరిగేవిధంగా చూడాలని తహశీల్దార్ మహ్మద్ జియావుల్ హక్ సూచించారు. మండల పరిధిలోని ఆరెమండ, దొప్పలపూడి, ఉప్పరపాలెం గ్రామాల్లో మూడవ విడతలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభమైందన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో గ్రామ సభలు, అవగాహనా ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ జియావుల్ హక్ మాట్లాడుతూ మొదటి విడతలో దండమూడి, పచ్చలతాడిప్రరు గ్రామాల్లోనూ, రెండవ విడత పైలట్ ప్రాజెక్టు కింద వల్లభరావుపాలెం గ్రామంలో రీ సర్వే పూర్తి చేయడం జరిగిందన్నారు. మూడవ విడతగా ఆరెమండ, దొప్పలపూడి, ఉప్పరపాలెం గ్రామాల్లో ప్రారంభించామన్నారు. రీ సర్వే చేయడం ద్వారా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. రైతులు తమ వద్ద ఉన్న పూర్తి ఆధారాలతో సర్వే సిబ్బందికి సహకరించాలన్నారు. ఎప్పుడో సుమారు వంద సంవత్సరాల క్రితం మాత్రమే సర్వే చేప్టినట్లు తెలుస్తుంది. అప్పటి నుండి ఇప్పటి వరకు మళ్ళీ రీ సర్వే చేయకపోవడంతో భూ సమస్యలు ఎక్కువై రైతులు ఎంతో మంది ఎన్నో ఇబ్బందులు పడుతున్నట్లు కూటమి ప్రభుత్వం గుర్తించిందన్నారు. రైతుల ఆవేదనను గుర్తించిన ప్రభుత్వం రైతులకు ఒక చక్కటి పరిష్కార మార్గం చూపించేందుకు రీ సర్వే చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో తెనాలి డివిజన్ సర్వే ఇన్‌స్పెక్టర్ జయరాజు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామారావు, సీనియర్ అసిస్టెంట్ మొగసాటి శ్రీనివాస్ పాల్గొన్నారు

## అహింసే మహాత్ముని నినాదం: డాక్టర్ సాంబశివుడు



తెనాలి టౌన్, అక్టోబర్ 3, ప్రభాతవార్త: అహింసే తన నినాదంగా మార్చుకొని, దేశానికి స్వాతంత్ర సమపార్ధనలో కీలకపాత్ర పోషించిన నిజమైన అహింసావాది మహాత్మా గాంధీ అని, తెనాలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి డాక్టర్ చందు సాంబశివుడు పేర్కొన్నారు.మహాత్మాగాంధీ 156వ జయంతి సందర్భంగా,పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో, మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలవేసి, నివాళులర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ,మహాత్మా గాంధీ భారతదేశ స్వాతంత్రం కోసం తన జీవితాన్ని పణంగా పెట్టారని, దేశ స్వాతంత్రం కోసం దేశ ప్రజలందరినీ ఏకతాటిపై తీసుకొచ్చి, అనేకమార్లు జైలుజీవితం అనుభవించి,అహింసే తన ఆయుధంగా చేసుకొని, జాతిపితగా భారతీయుల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని, డాక్టర్ చందు సాంబశివుడు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు పొన్నూరు నాగ సూర్య శశిధర్,పెనుగొండ శివకుమార్, స్టీవెన్ బాబు, శంకర్రావు,కోటేశ్వరరావు సుబ్బారావు,శీను, కార్తీక్ వెంకటేశ్వరావు, పోలేరయ్య, మల్లికార్జునరావు,తదితరులు పాల్గొన్నారు

## సరస్వతీదేవి అలంకారంలోని అమ్మవారిని దర్శించుకున్న, బిసీ నేత వెంకటేశ్వరరావు



తెనాలి టౌన్, అక్టోబర్ 3, ప్రభాతవార్త: దేవి శరన్నవరాత్రుల సందర్భంగా గాజులపేట నందు, కనకదుర్గమ్మ విగ్రహమును ఏర్పాటు చేసి దానితో పాటుగా మట్టితో అమ్మవారి విగ్రహాన్ని తయారుచేసి,గత పదకొండు రోజులుగా ఉదయం, సాయంత్రం అమ్మవారికి నైవేద్య ప్రసాదాలు, పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఉప్పాల జయసందీప్ ని అభినందించిన విద్యుత్తు బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షులు పరిశ వెంకటేశ్వరరావు. దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా పదకొండోరోజు శ్రీ రాజరాజేశ్వరిదేవి అలంకారంలో అమ్మవారిని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో ఉప్పాల వసంత లక్ష్మి ్మ, ఉప్పాల శ్రీనివాసరావు, ఉప్పాల అఖిల్ సాయిచంద్, జంపని రామ్ గోపాల్,మోర్ల తులసినాగవీరకుమార్, ఉప్పాల యువరాజ్ తదితరులు పాల్గొన్నారు

## మహాత్మునికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే శివవకుమార్



తెనాలి టౌన్, అక్టోబర్ 3, ప్రభాతవార్త: మహాత్మా గాంధీ 156వ జయంతి సందర్భంగా, పట్టణంలోని గాంధీచౌక్ ప్రాంతంలోని మహాత్ముని విగ్రహనికి పూలమాలలతో నివాళు లర్పించారు. మాజీ శాసనసభ్యులు శివకుమార్, మద్దాలి శేషాచలం, దేసు శ్రీనివాసరావు,భాస్కరుని శ్రీనివాసరావు, కొల్లా గుర్నాథ్ గుప్తా,చుండూరు సాయి, భాస్కర్లుని లక్ష్మీ ్మనారాయణ, మరియు పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు

## మునిసిపల్ కార్యాలయంలో గాంధీ జయంతి



తెనాలి మునిసిపాలిటీ, అక్టోబర్ 3, ప్రభాతవార్త: జాతిపిత మహాత్మాగాంధీ 156వ జయంతి సందర్భంగా, పురపాలక సంఘ కార్యాలయంలో, మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన మునిసిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక. ఈ కార్యక్రమం లో 38వ వార్డు కౌన్సిలర్ విజయలక్ష్మి ్మ,మునిసిపల్ ఇంచార్జి కమీషనర్ మువ్వా ఏసుబాబు,రెవిన్యూ ఆఫీసర్ రాంప్రసాద్,మునిసిపల్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన కమీషనర్‌గా రామ అప్పలనాయుడు బాధ్యతల స్వీకారం



తెనాలి మునిసిపాలిటీ, అక్టోబర్ 3, ప్రభాతవార్త: మున్సిపల్ కమిషనర్ గా జె.రామఅప్పలనాయుడు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.ఇప్పటివరకు ఆయన విజయనగరం జిల్లా రాజాం మున్సిపాలిటీలో విధులు నిర్వర్తిస్తున్న ఆయన్ను ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా తెనాలి మున్సిపల్ కమిషనర్ గా నియమించారు.ఈ సందర్భంగా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించి అనంతరం మున్సిపల్ చైర్మన్ తాడిబోయిన రాధికను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు, పురపాలక సిబ్బంది,నూతన మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు ని అభి నందించారు.స్పెషల్ గ్రేడ్ హోదా కలిగిన తెనాలి మున్సిపాలిటీలో గత కొన్ని నెలలుగా ఇన్చార్జి కమిషనర్ పాలన కొనసాగుతుంది,నేడు కొత్త కమిషనర్ రాకతో ఆ లోటు భక్తి అయింది.

## నేడు సామూహిక ఎలుకల నివారణ




వేమూరు అక్టోబరు 3 (ప్రభాతవార్త) : పంట పొలాల్లో ఎలుకలు నివారణకు రైతులందరూ సామూహిక ఎలుకల నివారణ దినోత్సవాన్ని పాటించాలని మండల వ్యవసాయ అధికారి ప్రేమ్‌సాగర్ తెలియజేశారు. అందుకు సంబంధించి శనివారం అన్ని గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో బ్రో మోడల్ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. రైతులు రైతు సేవా కేంద్రాల వద్దకు నూకలు నూనె తెచ్చుకున్నట్లయితే బ్రో మోడల్ మందు కలిపి ఇవ్వటం జరుగుతుందన్నారు. మందు కలిపిన నూకలను చిన్ని చిన్న పొట్లాలుగా కట్టి రైతులందరూ ఒకేరోజు సామూహికంగా ఎలుక రంధ్రాలు వద్ద పెట్టినట్లయితే ఎలుకల నివారణ జరుగుతుందని వివరించారు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అదే విధంగా శుక్రవారం మండలంలోని వరహాపురం గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రైతులకు పంట పొలాల సస్యరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను గురించి వివరించారు. ఆయనతో పాటు ఏఈవోలు రైతులు ఉన్నారు.

## ఘోర అగ్ని ప్రమాదం..సర్వం కోల్పోయిన బాధితులు





కొల్లిపర,అక్టోబరు 3 ప్రభాతవార్త: మండల పరిధిలోని దావులూరుపాలెంలో ఘోర అగ్ని ప్రమాదం చోటు చేసుకోవటంతో బాధితులు సర్వం కోల్పోయారు.విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించి గృహాలు కాలి బూడిదయ్యాయని బాధితులు దేవరకొండ మంగమ్మ,మిద్దే నగ్నలు తెలిపారు.ఒక్కసారిగా ఎగిసిన మంటలతో కట్టుబట్టలతో..ప్రాణాలతో బాధితులు భయటపడినట్లు స్థానికులు చెబుతున్నారు.నిరుపేదలైన తల్లి,కూతుళ్ళు రెండు పోర్షన్‌లలో నివాసముంటూ కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారని గ్రామస్తులు చెబుతూ సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ఆర్ధిక సహాయం అందించి సాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు,ఈ విషయం తెలుసుకున్న మండల బిసీ సంఘం నాయకులు మోర్ల శ్రీనివాసరావు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాలను పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేసి జరిగిన ప్రమాద ఘటనపై గౌడ సంఘం నాయకులు దృష్టికి తీసుకెళ్ళినట్లు మోర్ల శ్రీనువాసరావు తెలిపారు.

## ఇంట్లో దొంగలు పడి..రూ.10 లక్షలు దోచుకెళ్లారు..!!



కొల్లిపర,అక్టోబరు 3 ప్రభాతవార్త: ఇటీవల వరుస దొంగతనాలు చేస్తూ నగదు..బంగారు వస్తువులను దోచుకెళుతున్న దొంగలు గురువారం మండ పరిధిలోని తూములూరు గ్రామంలో కూడా ఓ ఇంట్లో పడి భారీ దొంగతనానికి పాల్పడ్డారు.ఇంటి తాళాలు పగల కొట్టి ఇంటిలోని బంగారం వస్తువులను దోచుకెళ్ళారు .తూములూరు చెరువు ఆపీసు బజారులో నివాస ముంటున్న మోటూరు మధుసూధనరావు ఇంట్లో తాళాలు పగల కొట్టి ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు బీరువాను పగల కొట్టి అందులో ఉన్న కూ.10 లక్షల విలువ గలిగిన బంగారం వస్తువులను దోచుకెళ్ళినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.మధుసూధనరావు చెరుకుపల్లి మండలం రాజోలులో రైస్‌మిల్లు నడుపుతూ వారానికి ఒకసారి ఇంటికి వచ్చి వెలుతుండగా అతని భార్య,కుమారుడు ఇంట్లో ఉంటారు.దసరా పండుగను పురస్కరించుకుని భార్య,కుమారుడు బంధువుల ఇంటికి వెళ్ళటంతో ఇది గమనించిన దొంగలు తాళాల పగులకొట్టి బంగారం దోచుకెళ్ళినట్లు బాధితులు తెలిపారు.ఈ దొంగతనానికి సంభంధించి చుట్టుప్రక్కల వారు ఇచ్చిన సమాచారం మేరకు ఇంటికి చేరుకున్న బాధిత కుటుంబం బీరువా పగలకొట్టి బీరువాలో ఉన్న రెండు బంగారు గాజులు,3 బంగారు చైన్‌లు,ఒక బ్రాస్‌లైట్,ఒక ఉంగరం దొంగలు దోచుకెళ్ళారని చెబుతున్నారు.మొత్తం 96 గ్రాముల బంగారం దోచుకెళ్ళినట్లు చెప్పారు.జరిగిన ఘటనపై కొల్లిపర పోలీసులకు పిర్యాదు చేసామన్నారు.

## జిఎస్‌టి తగ్గింపుతో ప్రజల తలసరి ఆదాయం మెరుగుపడుతుంది : ఎమ్మెల్యే కన్నా



సత్తెనపల్లి, అక్టోబరు 3 ప్రభాతవార్త : జిఎస్‌టి తగ్గింపుతో ప్రజల తలసరి ఆదాయం మెరుగుపడుతుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలోని గడియారస్తంభం సెంటర్‌లో వాణిజ్య దుకాణాలను సందర్శించి వ్యాపారులకు, వినియోగ దారులకు అవగాహన కల్పించారు. జిఎస్‌టి 2.0 తో చేసిన మార్పులతో కుటుంబానికి నెలకు రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు ఆదా అవుతుందన్నారు. కొత్త జిఎస్‌టి పై వ్యాపారులు అభిప్రాయాలను ఎమ్మెల్యే కన్నా తెలుసుకున్నారు. అలాగే వ్యాపారుల ఇబ్బందులు, వసూళ్ళలో తేడాలపై ఆరా తీశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే జిఎస్‌టి తగ్గింపు జరిగిందన్నారు. వ్యాపార వర్గాలకు ఇది ఊరటనిస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కన్నా వెంట వివిధ హోదాలలో ఉన్న రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, వార్డు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ పై అవగాహన



సత్తెనపల్లి, అక్టోబరు 3 ప్రభాతవార్త : మండలంలోని నందిగామ గ్రామంలో శుక్రవారం సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి మండల వ్యవసాయ అధికారి బి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ కొత్త జిఎస్‌టితో వివిధ రకాల యంత్ర పరికరాలపై తగ్గిన జిఎస్‌టి గురించి వివరించారు. ముఖ్యంగా రైతులు వినియోగించే యంత్ర పరికరాలైన మినీ ట్రాక్టర్లు, రోటోవేటర్లు, పవర్ టిల్లర్లపై జిఎస్‌టి 12 శాతం నుండి 5 శాతం కు మినీ ట్రాక్టర్ల టైర్లు, విడిభాగాలు 18 శాతం నుండి 5 శాతంకు డ్రిప్ ఇరిగేషన్ సిస్టం, స్ప్రింక్లర్లు 12 శాతం నుండి 5 శాతంకు, టార్పాలిన్, శిల్పాలిన్ పట్టలపై 12 శాతం నుండి 5 శాతం కు తైవాన్ స్ప్రేయర్స్, రక్షిత గృహాలు నిర్మించుటకు ఉపయోగించే పరికాలపై 18 శాతం నుండి 5 శాతంకు బయో పురుగుమందులు, సూక్ష్మ పోషకాలపై, వివిధ పంటల వారీగా సూక్ష్మ సేద్యంతో సాగు చేయు రైతులకు పరికాలపై 12 శాతం నఉండి 5 శాతం తగ్గించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి మండల పార్టీ అధ్యక్షులు ఆళ్ళ అమరేశ్వరరావు, నందిగామ గ్రామ నాయకులు ఆళ్ళ సాంబయ్య, పంచాయితీ సెక్రటరీ విపిఏ రేష్మ, భార్గవి, రైతులు పాల్గొన్నారు.

## ముగిసిన దసరా ఉత్సవాలు





సత్తెనపల్లి, అక్టోబరు 3 ప్రభాతవార్త : పట్టణంలో దసరా ఉత్సవాలు వైభవంగా జరిగాయి. వేడుకలు చివరి రోజైన గురువారంతో ముగిసాయి. పట్టణంలోని వెంకటపతికాలనీలో వేంచేసియున్న శ్రీలక్ష్మి ప్రత్యంగిర పీఠము నసందు దసరా మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. 11వ రోజు గురువారం శ్రీ రాజరాజేశ్వరి దేవిగా శ్రీ నీలంపాటి శ్రీలక్ష్మి అమ్మవారు దర్శనమిచ్చారు. శరన్నవరాత్రులు పురస్కరించుకొని భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. అదే విధంగా శ్రీలలితాంబికా దేవి శరన్నవరాత్రి కమిటీ ఆధ్వర్యంలో వడ్డవల్లి పెద్ద బొడ్రాయి సెంటర్‌లో శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే పట్టణంలోని మెయిన్‌రోడ్డులో వేంచేసియున్న శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

## లాల్ బహదూర్‌శాస్త్రీ, గాంధీ మహాత్మునికి నివాళులర్పించిన డాక్టర్ గజ్జల



సత్తెనపల్లి, అక్టోబరు 3 ప్రభాతవార్త : మహాత్మాగాంధీజీకీ, లాల్‌బహదూర్‌శాస్త్రీ చిత్రపటాలకు, విగ్రహాలకు సత్తెనపల్లి నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో గాంధీజీ పాత్ర గొప్పదన్నారు. అహింసతో స్వాతంత్ర్యాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. అదే విధంగా లాల్‌బహదూర్ శాస్త్రీ స్వాతంత్ర్య పోరాటంలో కీలకపాత్ర పోషించారని తెలిపారు. మొదటి రైల్వేమంత్రిగా, హోంమంత్రిగా, ప్రధానమంత్రిగా దేశానికి సేవలు అందించడం జరిగిందని డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి తెలియజేశారు. ఆయన వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## జిఎస్‌టి సేవింగ్స్ పై అవగాహన కార్యక్రమం

సత్తెనపల్లి, అక్టోబరు 1 ప్రభాతవార్త : సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని మండలంలోని కొమెరపూడి గ్రామంలో బుధవారం నిర్వహించారు. వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ కొత్త జిఎస్‌టితో వివిధ రకాల వ్యవసాయ యంత్ర పరికరాలపై జిఎస్‌టి తగ్గిందన్నారు. మినీ ట్రాక్టర్లు, రోటోవేటర్ తదితర వాటితో 12 శాతం నుండి 5 శాతంకు ధరలు తగ్గాయన్నారు. మినీ ట్రాక్టర్లు, విడి భాగాలపై 5 శాతంకు జిఎస్‌టి దిగి వచ్చిందన్నారు. బయో పురుగు మందులు, సూక్ష్మపోషకాలపై 5 శాతం మాత్రమే జిఎస్‌టి ఉంటుందని తెలియజేశారు. ఏడిఏ రవిబాబు, ఏవో బి.సుబ్బారెడ్డి, సర్పంచ్ అనీల్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో గాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రీ జయంతి



సత్తెనపల్లి, అక్టోబరు 3 ప్రభాతవార్త : పట్టణంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో గాంధీజీ, లాల్‌బహదూర్‌శాస్త్రీ చిత్రపటాలకు ఆ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ పట్టణ అధ్యక్షులు దాసరి జ్ఞాన్‌రాజ్‌పాల్ మాట్లాడుతూ ప్రధానిగా ఉన్న సమయంలో లాల్‌బహదూర్‌శాస్త్రీ విశేషంగా పాకిస్థాన్‌తో యుద్ధం జరిపి జై జవాన్...జై కిసాన్ అనే నినాదాన్ని తీసుకువచ్చారని గుర్తు చేశారు. జాతిపిత మహాత్మాగాంధీ పిలుపుతో కోట్లాది మంది ప్రజలు అహింసా పద్ధతులతో, సత్యాగ్రహాలతో స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేదాద్రి, షేక్ చాంద్‌బాషా, కొత్త లక్ష్మయ్య, కె.ఆనంద్, ఎస్.మోహన్‌రావు, జెట్టి శేఖర్, హైదర్ ఆలీ పాల్గొన్నారు.

## సరికొండ లచ్చరాజు మెమోరియల్ సాహితీ కళావేదిక అవార్డులు

సత్తెనపల్లి, అక్టోబరు 3 ప్రభాతవార్త : సరికొండ లచ్చరాజు మెమోరియల్ సాహితీ కళావేదిక అవార్డులను శుక్రవారం పట్టణంలో ప్రముఖులకు అందజేశారు. రచయిత్రి సరికొండ రమాదేవి తన తండ్రి పేరుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. పిన్నమనేని పాములయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రతి ఏడాది దసరా రోజున కళాసాహిత్య రంగాలలో ప్రతిభ చూపిన ప్రముఖులకు ఈ అవార్డులను అందజేస్తున్నట్లు తెలియజేశారు. అదే విధంగా ఫోటోగ్రాఫర్ పిన్నమనేని భానుప్రకాష్‌కు, ప్రజానాట్యమండలి అధ్యక్షులు ఎం.రాంబాబుకు అవార్డులతో పాటు ప్రశంసాపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో చెన్నకేశవనాయుడు, సత్యనారాయణ, సాంబశివరావు, ఊర్ధయ్య, అనుపమ శేఖర్, గుర్రం వెంకటేశ్వర్లు, కోండ్రు హనుమంతరావు పాల్గొన్నారు.



## చెంచు కాలనీలో పడకేసిన పారిశుద్ధ్యం

### - మురుగులో నివాసం...కన్నెత్తి చూడని అధికారులు







అమరావతి, అక్టోబరు 3 ప్రభాతవార్త : ధరణికోట గ్రామానికి చెందిన బేడ బుడగ జంగాల నివసించే చెంచుకాలనీలో పారిశుద్ధ్యం పడకేసిందని, ప్రజలు మురుగు దుర్గంధంలో నివసిస్తున్నామని తెలిపారు. సైడ్ కాలువలలో మురుగు, పూడు పేరుకుపోయి వ్యర్థాలు, నీరు ముందుకు కదలడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. జననివాసాల మధ్య మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తూ పలు రకాల అంటు వ్యాధులకు కారణమవుతుందన్నారు. గత కొద్ది రోజులుగా చెంచు కాలనీలో జ్వరాలు ప్రబలుతున్నాయన్నారు. వృద్ధులు, చిన్నారులు ఈ మురుగునీటిలోనే సహవాసం చేస్తున్నారన్నారు. మరో తురకపాలెం లా అమరావతి, ధరణికోట చెంచుకాలనీ మారకముందే పంచాయితీ అధికారులు స్పందించాలని, ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేయాలని చెంచుకాలనీవాసులు కోరుతున్నారు. త్రాగునీరు కూడా మురుగుకాలువలో కలుషితం అవుతుందని, ఆ కలుషిత నీరు తాగడం ద్వారా పలు రకాల వ్యాధులు సంభవిస్తున్నాయన్నారు. అధికారులు మురుగు తొలగింపు చర్యలు చేపట్టాలని లేకుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. తమ ఆరోగ్యాన్ని కాపాడమని ప్రాధేయపడతామని చెంచుకాలనీవాసులు వాపోతున్నారు.

# పల్నాడు జిల్లా వార్త



## జిఎస్‌టి తగ్గింపుతో రైతులకు మేలు : ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



నరసరావుపేట, అక్టోబరు 3 ప్రభాతవార్త : జిఎస్‌టి తగ్గింపుతో రైతులకు ఎంతో మేలు జరిగిందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. శుక్రవారం జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు, పి.డి. శిద్దా లింగమూర్తి, పశు సంవర్ధకశాఖ అధికారి రామారావు, మండలంలోని యల్లమంద గ్రామంలో జిఎస్‌టి కార్యక్రమంపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయన్నారు. వ్యవసాయ నూతన యాంత్రీకరణపై స్టాల్స్ ఏర్పాటు చేయడం సంతోషమన్నారు. 18 నుండి 5 శాతం వరకు తగ్గిన ధరలు రైతులకు తప్పనిసరిగా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. రైతులకు అవసరమైన సూక్ష్మ దాతువులను కూడా స్టాల్స్‌లో ఉంచడం జరిగిందన్నారు. ప్రభుత్వం రైతు ప్రభుత్వమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తెలియజేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నిందితుల అరెస్ట్



నరసరావుపేట క్రైం, అక్టోబరు 3 ప్రభాతవార్త : గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నిందితులను నకరికల్లు పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను సత్తెనపల్లి డిఎస్పీ కె.హనుమంతరావు, రూరల్ సి.ఐ. కిరణ్, నకరికల్లు ఎస్.ఐ. సతీష్‌లు తెలియజేశారు. మొత్తం ఎనిమిది మంది నిందితులు పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలోనే అరెస్ట్ చేస్తామన్నారు. నిందితుల వద్ద నుండి 10 కేజీల గంజాయి, ఒక స్కూటీ, రూ.5 వేలు నగదు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. అరెస్ట్ అయిన వారిలో నర్రా హనుమంతరావు, పి.శంకరరావు, కె.శ్రీనివాసరావు, కె.మల్లికార్జునరావు, ఎ.వినోద్, బాలునాయక్, ఎస్.శ్రీనివాసరావు, బండారు హనుమంతరావు, ఆవుల పెద్దసాంబయ్య తదితరులు ఉన్నారన్నారు. వారు ఒరిస్సా నుండి గంజాయి తీసుకువచ్చి కొంతకాలంగా చిన్నచిన్న ప్యాకెట్లు చేసి విక్రయించడం జరుగుతుందన్నారు. నిందితులను అరెస్ట్ చేసిన సి.ఐ, ఎస్.ఐ, సిబ్బందిని డిఎస్పీ కె.హనుమంతరావు అభినందించారు.

## పట్టణంలో ఉద్యం రిజిస్ట్రేషన్ వర్క్‌షాప్

నరసరావుపేట, అక్టోబరు 3 ప్రభాతవార్త : పట్టణంలో శుక్రవారం ఉద్యమం రిజిస్ట్రేషన్ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జిఎస్‌టి 2.0 సంస్కరణలు ప్రజలకు ఎంతో మేలు చేశాయన్నారు. వాణిజ్య పన్నులశాఖ జాయింట్ కమిషనర్ స్టీవెన్‌సన్ అందరికీ మేలు జరిగే విధంగా అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా స్మాల్ స్కేల్ వ్యాపారాలకు ఈ కార్యక్రమం ఎంతో మేలు చేస్తుందని తెలియజేశారు. ఇంటింటికి వెళ్ళి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో సంతోషమని తెలియజేశారు. ముఖ్యంగా ఆటో మొబైల్, మందులు, దస్తువులు, పాదరక్షలు, టీవీలు, ఎయిర్ కండీషన్‌లు, స్టేషనరీ అనేక వస్తువులపై భారీగా పన్ను తగ్గిందని తెలియజేశారు. దేశ వ్యాప్తంగా ప్రజలకు రూ.1.60 లక్షల కోట్లు లాభం జరిగిందన్నారు. మన రాష్ట్రంలో రూ.8 వేల కోట్లు ప్రజలకు ఆదా జరిగినట్లు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య పన్నులశాఖ అధికారి ఎం.రామారావు, ఆడిటర్స్ అసోసియేషన్ నాయకులు ఫణిరాజ్‌కుమార్, కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.



## కెరిడ్జ్ పాఠశాల విద్యార్థులకు ఫోక్ డ్యాన్స్‌లో ప్రథమస్థానం



నరసరావుపేట టౌన్, అక్టోబరు 3 ప్రభాతవార్త : కెరిడ్జ్ పాఠశాల విద్యార్థులు విజయవాడ ఉత్సవ్ - 2025లో పాల్గొని ఫోక్ డ్యాన్స్ విభాగంలో ప్రథమస్థానం కైవసం చేసుకున్నారని పాఠశాల ఛైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు శుక్రవారం తెలియజేశారు. 12 విభాగాలలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారని తెలిపారు. ఈ పోటీలలో భాగంగా మొత్తం 24 జట్లతో తమ కెరిడ్జ్ విద్యార్థులు పోటీపడటం జరిగిందన్నారు. విజయవాడ ఎం.పి.కేశినేని చిన్ని చేతుల మీదుగా తమ విద్యార్థులు బహుమతులు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఛైర్మన్ నాతాని వెంకటేశ్వర్లుతో పాటు డైరెక్టర్ కె.నాసరయ్య, ప్రిన్సిపాల్ బర్నబాస్, క్యాంపస్ ఇన్‌చార్జి కోట బాపూజీ, డ్యాన్స్ టీచర్స్ వెంకట్, జ్యోతిర్మయి పాల్గొన్నారు.

## కొండవీడు ఇ.యన్.టి.వైద్యశాలలో వైద్య శిబిరం



నరసరావుపేట, అక్టోబరు 3 ప్రభాతవార్త : కొండవీడు ఇ.యన్.టి.వైద్యశాలలో 78వ ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకొని ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు హాస్పటల్ ఛైర్మన్ డాక్టర్ కంజుల జగన్ మోహన్‌రెడ్డి తెలియజేశారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ చిత్రపటంతో పాటు లాల్‌బహదూర్‌శాస్త్రీ చిత్రపటాలకు పూలమాలలు వేసి వారు నివాళులర్పించారు. డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళుగా ఈ కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. మహాత్మాగాంధీ జయంతితో పాటు జాతీయ పర్వదినాలలో ప్రత్యేకంగా కొండవీడు ఇ.యన్.టి.హాస్పటల్లో ఉచిత క్యాంపులు నిర్వహించి వందల మందికి వైద్య పరీక్షలు నిర్వహించడం సంతోషమన్నారు. మొత్తం 218 మందికి ఉచిత పరీక్షలు నిర్వహించారు. రూ.2 లక్షలకు పైగా విలువైన మందులను ఉచితంగా అందించారు. అదే విధంగా ఎక్స్‌రే, వినికిడి పరీక్షలను ఉచితంగా నిర్వహించి 28 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కంజుల శ్రీవర్షిణి, డాక్టర్ విష్ణురాజు, డాక్టర్ సుధీర్‌చంద్ర, కంజుల కోటిరెడ్డి, మస్తాన్‌రెడ్డి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## బిసి సంక్షేమ సంఘం నూతన కార్యాలయం ప్రారంభం



నరసరావుపేట, అక్టోబరు 3 ప్రభాతవార్త : పట్టణంలో బిసి సంక్షేమ సంఘం జిల్లా నూతన కార్యాలయాన్ని శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు, పట్టణ ప్రముఖులు కపలవాయి విజయ్‌కుమార్, నాగసరపు సుబ్బరాయగుప్తా, పట్టణ ప్రముఖులు రాయల శ్రీనివాసరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ బిసిల డిమాండ్ల సాధనే తమ లక్ష్యమన్నారు. బిసి హక్కుల కోసం పోరాడతామన్నారు. దసరా రోజున ఈ కార్యక్రమం జరగడం సంతోషమని తెలియజేశారు. ఢిల్లీ వరకు బిసిల రిజర్వేషన్లు, హక్కుల కొరకు పోరాటం కొనసాగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం బిసిల ప్రభుత్వమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తెలియజేశారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో లక్ష ఓపి స్లిప్పుల వితరణ



నరసరావుపేట, అక్టోబరు 3 ప్రభాతవార్త : నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి రాష్ట్ర బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కపలవాయి విజయ్‌కుమార్ లక్ష ఓపి స్లిప్పులను ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమానికి హాస్పటల్ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ డాక్టర్ లక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడారు. ఆసుపత్రి సేవలను మరింత సమర్ధవంతంగా నిర్వహించేందుకు, రోగులకు వేగవంతమైన రిజిస్ట్రేషన్ సౌలభ్యం కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు. కపలవాయి విజయ్‌కుమార్ మాట్లాడుతూ సమాజ సేవ తమ కుటుంబానికి మొదటి బాధ్యతగా భావిస్తామన్నారు. పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేశామని తెలియజేశారు. అదే విధంగా సమాజంలో పేదలకు అవసరమైనటువంటి చేయూతను అందించేందుకు ఎప్పుడూ ముందుంటామన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సురేష్‌కుమార్, ఆర్ఎంఓ డాక్టర్ ఏడుకొండలు పాల్గొన్నారు.

## ఇంటింటి గాంధీ...ఇంటింటకీ గ్రంథాలయం



నకరికల్లు, అక్టోబరు 3 ప్రభాతవార్త : ఇంటింటి గాంధీ...ఇంటింటికి గ్రంథాలయం కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమానికి గాంధీ సార్మకసమితి నాయకులు ఈదర గోపిచంద్ అధ్యక్షత వహించారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ళల్లో చిన్న గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. గాంధీజీ జీవిత విశేషాల పుస్తకాలను పంపిణీ చేశారు. ఇటువంటి కార్యక్రమాలు ఆదర్శనీయమని డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు మద్ది రామ బ్రహ్మానందం, మాగులూరి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రాజరాజేశ్వరి దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు





యడ్లపాడు, అక్టోబర్ 3, ప్రభాతవార్త : మండల పరిధిలోని బోయపాలెం గ్రామంలోని జాతీయ రహదారి ప్రక్కనే ఉన్న శ్రీ పార్వతీ దేవి అమ్మవారు భక్తులకు శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకారములో గురువారం భక్తులకు దర్శనమిచ్చారు. అదేవిధంగా మండల పరిదిలోని వివిధ దేవాలయాలలోని అమ్మవార్లు మరియు శ్రీ హరిహర క్షేత్రములోని శ్రీ పార్వతీ దేవి అమ్మవారుకూడా శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకారములో భక్తులకు దర్శనమిచ్చారు. దసరా శరన్నవరాత్రులలో భాగంగా ఉదయం అమ్మవారికి గణపతి పూజతో ప్రారంభమైన పూజా కార్యక్రమాలు బాలపూజ, మంత్రానుష్ఠానములు, అభిషేకములు, అఖండ స్థాపన, ఋత్విక్కులకు దీక్షావస్త్ర సమర్పణ, అనంతరం మన్త్రానుస్టానములు, సువాసినీ పూజ, సూర్యనమస్కారములు నిర్వహించటం జరిగిందని, అనంతరం అమ్మవారికి శ్రీ చక్రార్చన, సాయంత్రం నీరాజన మంత్రపుష్పములు, సువాసినీ పూజ అనంతరం తీర్థప్రసాదముల వినియోగం నిర్వహించటం జరిగిందని అలయ నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా అమ్మవారికి ప్రత్యేకంగా కుంకుమ పూజను నిర్వహించారు. విద్యుత్ దీపాలతో భారీ విద్యుత్ బొమ్మలను ఏర్పాటుచేసారు. ఈ కార్యక్రమాలలో మహిళలు అధికంగా పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అదేవిధంగా సాయంత్ర సమయంలో వివిధ గ్రామాలలో స్వామివార్ల ఊరేగింపు నిర్వహించారు.

## అభివృద్ధి నిరోధకులను కఠినంగా శిక్షించాలి : ప్రత్తిపాటి






యడ్లపాడు, అక్టోబర్ 3, ప్రభాతవార్త : ఐదేళ్ల పాటు సాగించిన అభివృద్ధి నిరోధక విధానాలను గతపాలకులు ఇప్పటికీ కొనసాగించే ప్రయత్నాలు చేస్తున్నారని, కూటమిప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనుల్ని అడ్డుకోవడానికి తప్పుడు మార్గాలు అనుసరిస్తున్నారని మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. మండలంలో గురువారం పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. తొలుత 1కోటీ 94లక్షలతో బోయపాలెం నుండి ఉన్నవ వరకు వేసే బీటీ రోడ్డు, 370మీటర్ల సీసీరోడ్డు, డ్రైనేజ్‌ల నిర్మాణానికి, బోయపాలెం నుంచి లింగారావుపాలెం వరకు 2కోట్ల 40లక్షల సీఆర్డీఏ నిధులతో నిర్మిస్తున్న బీటీరోడ్డుకు శంఖుస్థాపన చేశారు. తదుపరి జాలాది గ్రామంలో 32లక్షలతో నిర్మిస్తున్న పంచాయితీ భవనం నిర్మాణపనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా అయా గ్రామాల్లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.

**..డేటా సెంటర్ ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ అడ్డుకోవడం క్షమించరాని తప్పిందం :** ఐదేళ్లపాటు రాష్ట్రంలో ఎక్కడా ఒక్క కిలోమీటరు రోడ్డు వేయని గత పాలకుల నిర్లక్ష్యంతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారని, కూటమి ప్రభుత్వం వచ్చాక యుద్ధప్రాతిపదికన రోడ్ల నిర్మాణం చేపట్టిందన్నారు. గత ప్రభాత్వానికి రోడ్లపై గుంతలు పూడ్చటం కూడా చేతకాలేదన్నారు. వారికి అభివృద్ధి చేయడం చేతగాదని, ఇతరులు చేస్తున్నా ఓర్చుకోలేరన్నారు. ఐదేళ్లపాటు రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు రాకుండా చేసిన ఘనత పాలకులదేనన్నారు. ప్రజలు ఛీకొట్టినా వారి వైఖరి మారలేదని, వారి అభివృద్ధి నిరోధక చర్యలు ఇప్పటికీ కొనసాగుతున్నాయన్నారు. అసియాలోనే అతిపెద్ద డేటాసెంటర్ ఏర్పాటుకు గూగుల్ సంస్థ ముందుకొస్తే అందుకు అవసరమైన భూ సేకరణను కొందరు కావాలనే అడ్డుకుంటున్నారని, వారి చర్యలు క్షమించరాని వన్నారు. ప్రత్యక్షంగా 25వేల మందికి, పరోక్షంగా వివిధ రంగాల పురోగతితో మరో 50వేల మందికి ఉపాధి కల్పించే గూగుల్ డెటా సెంటర్ ఏర్పాటుకు మోకాలడ్డేవారిని ప్రభుత్వం చట్టపరంగా కఠినంగా శిక్షించాలని అభిప్రాయపడ్డారు. అనంతరం బోయపాలెం గ్రామంలో జీఎస్టీ ఉత్సవ్ కార్యక్రమంలో పాల్గొని జీఎస్టీ సంస్కరణల సమాచారాన్ని తెలియజేసే కరపత్రాలను స్వయంగా ప్రజలకు పంపిణీచేశారు. అనంతరం స్థానిక ప్రజలకు ఉపయోగపడే మొబైల్ రేషన్ పంపిణీ వాహనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్, వైస్ ఛైర్మన్ షేక్ టీడీపీ కరిముల్లా, పిల్లి కోటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కామినేని సాయిబాబు, మద్దూరి వీరారెడ్డి, కందిమళ్ల రఘురామారావు, కుర్రా రత్తయ్య, ముద్దన నాగేశ్వరరావు, తులశమ్మ, పోపూరి రాఘవయ్య, కక్కెర నాగేశ్వరరావు, తోకల రాజేష్, అధికారులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


## గాంధీజీ కన్నకలలు నెరవేరిన నాడే దేశం సురక్షితం



యడ్లపాడు, అక్టోబర్ 2, ప్రభాతవార్త : ఎన్నో వ్యయప్రయాసలకువోడి శాంతి యుత మార్గంలో స్వర్ణరాజ్యాన్ని తీసుకువచ్చిన మహనీయుడు గాంధీజీ, అయన కన్న కలలు నెరవేర్చిన నాడే దేశం సురక్షితంగా ఉంటుందని, దానికి అందరూ తమవంతు ప్రయత్నం చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని ఎస్సై టి శివరామకృష్ణ పేర్కొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన మహాత్మా గాంధీ జయంతి పురస్కరించుకొని స్టేషన్ అవరణలో ఏర్పాటుచేసిన గాంధీజీ చిప్రతటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గాంధీజీ జీవిత సిద్ధాంతాలు, అహింసా మార్గం మరియు దేశసేవపై అయన చూపిన నిబద్ధత గురించి తెలియజేయడం, గాంధీజీ అదర్శాలను అనుసరిస్తూ పోలీస్ శాఖలో విధులపై మరింత నిబద్ధతతో పరిచేయాలని సిబ్బందిని ప్రోత్సహించారు.

## లింగారావుపాలెంలో రైతులతో జీఎస్టీ ఉత్సవ ర్యాలీ

యడ్లపాడు, అక్టోబర్ 3, ప్రభాతవార్త : మండల పరిధిలోని లింగారావుపాలెం గ్రామంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌లో భాగంగా వ్యవసాయ అనుబంధ రంగాలపై జీఎస్టీతో అదా గురించి




మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్ అవగాహన నిర్వహించారు. వ్యవసాయ రంగంలోని ఉత్పాదకాలకు పన్ను తగ్గింపు ద్వారా రైతులకు లబ్ది చేకూరుతుందని తెలిపారు. గ్రామంలో రైతులతో జీఎస్టీ ఉత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ రకాల యంత్రాలను ప్రదర్శించి వాటి పై తగ్గే జీఎస్టీ తదితర అంశాలపై అవగాహన కలుగ జేసారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి బి కబ్బిరెడ్డి, బి లక్ష్మీ శేషసాయి, ఎంపీటీసీ తోకల వీరరాఘవయ్య, గ్రామ పెద్దలు కట్టా శ్రీహరి, నంబూరు కృష్ణారావు, తోకల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడ ఉత్సవ్ రాష్ట్ర సాంస్కృతిక వైభవానికి ప్రతిరూపం : ముగింపు సభలో ప్రత్తిపాటి




చిలకలూరిపేట,అక్టోబర్3,ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాకారంతో సొసైటీ ఫర్ వైబ్రంట్ విజయవాడ సారధ్యంలో పున్నమీ ఘాట్‌లో వరల్డ్ బిగ్గెస్ట్ ఫెస్టివల్ కార్నివల్ ఉత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి, రాష్ట్ర బిజెపి అధ్యక్షులు మధవ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డ్రోన్ షో, ఫైర్ వర్క్స్, సాంస్కృతిక కార్యక్రమాలు నాయకులను, ప్రజలను ఎంతగానో ప్రజలకు ఆకర్షించాయని ప్రత్తిపాటి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఎపిని దేశంలో నెంబర్1 స్థానంలో తీసుకువెళ్లడానికి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో విజయవాడలో ఇలాంటి ఉత్సవం చేయడంవలన దసరాకు విజయవాడ దుర్గమ్మకు ఎంతో ప్రాధాన్యత వస్తుందన్నారు. విజయవాడ ఐడల్ వంటి వేడుకలు యువతలోని ప్రతిభను వెలికితీసి, వారికి గుర్తింపు తీసుకువస్తున్నాయని, కళా, సాంస్కృతిక రంగాలలో విజయవాడ ప్రతిభావంతులకు పుట్టినిల్లు అని అన్నారు. ఈ తరహ ఉత్సవాలు నగరానికి మరింత గౌరవాన్ని తీసుకువస్తాయని ప్రత్తిపాటి వివరించారు. ప్రతిభకు వేదిక, కళలకు విజయవాధ భవిష్యత్ మరింత వెలుగులు నింపుతుందని అన్నారు. ఈ కార్యక్రమాన్ని ముందుండి నడుపుతున్న విజయవాడ యంపి కేశినేని శివనాధ్ (చిన్ని) ప్రత్తిపాటి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ వేడుకలలో ఎమ్మెల్యే వసంత సాయికృష్ణ ప్రసాద్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, మాజీ హోం మంత్రి వసంత నాగేశ్వరరావు, రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి కమీషన్ చైర్ పర్సన్ తేజస్వీని, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, టిడిపి అధికార ప్రతినిధి నాగూల్‌మీరా, మాజీ యంపి జివిఎల్ నరసింహారావు,మాజీ జిల్లా పరిషత్ చైర్మన్లు, గద్దె అనురాధ, పాతూరి నాగభూషణం, పరిశీలకులు చిట్టాబత్తుల శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

## 'మహాత్ముని ఆశయ సాధనే లక్ష్యంగా సిఎం చంద్రబాబు పేదరిక నిర్మూలనకు కృషి'



చిలకలూరిపేట,అక్టోబర్ 3,ప్రభాతవార్త: మహాత్ముని ఆశయసాధనే లక్ష్యంగా ఆయన నమ్మిన సిద్దాంతాలకు కట్టుబడి, ఆయన చూపిన మార్గంలో కూటమి ప్రభుత్వం పేదల సేవలో తరిస్తుందని, పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రాభివృద్ధికోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారని మాజీమంత్రి ప్రత్తిపాటి తెలిపారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని సిఆర్‌క్లబ్, ఆర్యవైశ్య కళ్యాణమండపం, ఎన్ఆర్‌టి కూడలిలోని గాంధిజి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం గాంధి మహాత్ముడు చేసిన త్యాగం, సాగించిన పోరాటం ఎప్పటికి మరువలేనివని, ఆ మహనీయుడు బోధనలలోని సత్యాన్ని నేటి యువత గ్రహించాలని ప్రత్తిపాటి సూచించారు. క్షణికావేశంతో తీసుకునే నిర్ణయాలు, చేపట్టేపనులు ఎప్పటికి సత్ఫలితాలు ఇవ్వవనే నిజాన్ని యువతరం గ్రహించాలని అన్నారు. గాంధి ఆశయ సాధనే లక్ష్యంగా పేదరికాన్ని అంతం చేయాలనే లక్ష్యంతో సాగుతున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు ఎల్లవేళలా మద్దతుగా నిలవాలని ప్రత్తిపాటి కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, టిడిపి నాయకులు పఠాన్ సమద్‌ఖాన్, మద్దుమాల రవి, పిల్లి కోటేశ్వరరావు, మక్కెన నరసింహారావు, బత్తినేని శ్రీనివాసరావు, బంగారుబాబు, కనమర్లపూడి రమేష్ పాల్గొన్నారు.

## సిఆర్ క్లబ్‌లో సింథటిక్ టెన్నీస్ కోర్టు ప్రారంభం



చిలకలూరిపేట,అక్టోబర్3,ప్రభాతవార్త: పట్టణంలోని సిఆర్‌క్లబ్‌లో లక్షల రూపాయిల వ్యయంతో నిర్మించిన సింథటిక్ టెన్నీస్ కోర్టును మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు విజయదశమి పర్వదినాన ప్రారంభించారు. పికిల్‌బాల్ కోర్టును క్లబ్ కార్యదర్శి పావులూరి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ ఎంతో ఆకర్షణీయంగా సింథటిక్ టెన్నిస్ కోర్టును తీర్చిదిద్దిన పాలకవర్గాన్ని అభినందించారు. ఇటువంటి కోర్టు ఈ ప్రాంతంలో ఇదే మొదటిది కావడం చిలకలూరిపేటకే గర్వకారణమని అన్నారు. టెన్నీస్ క్రీడాకారులతో కలసి కొద్దిసేపు కోర్టులో టెన్నీస్ ఆడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, సిఆర్ క్లబ్ ఉపాధ్యక్షులు చెరుకూరి కాంతయ్య,కోశాధికారి మక్కెన నరసింహారావులు పాల్గొన్నారు.

## దసరా శరన్నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజల్లో 'ప్రత్తిపాటి' దంపతులు





చిలకలూరిపేట,అక్టోబర్3,ప్రభాతవార్త: దసరా శరన్నవరాత్రులు పురస్కరించుకొని మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి దంపతులు పట్టణంలో పలు దేవాలయాలలో పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. పట్టణంలోని చౌత్రా సెంటర్‌లోని ధర్మసంఘం ఆధ్వర్యంలో శ్రీ వాసవీ అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ గంగా పార్వతీ సమేత ఉమామహేశ్వర స్వామి దేవస్థానం, షరాబ్ బజార్‌లోని రామాలయంలలో ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణమండపంలో వేంచేసియున్న శ్రీ పద్మావతి గోదాసమేత శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంనందు దసరా శరన్నవరాత్రులు, మరియు శ్రవణా నక్షత్రం సందర్భంగా స్వామివారికి ఏర్పాటుచేసిన అభిషేకం, ప్రత్యేక అలంకరణ కార్యక్రమాలలో ప్రత్తిపాటి దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో ధర్మసంఘం సభ్యులు, టిడిపి నాయకులు,ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

## బొప్పూడి పోలేరమ్మకు పూజలు



చిలకలూరిపేట, అక్టోబర్ 3, ప్రభాతవార్త: మండలంలోని బొప్పూడి గ్రామంలో వేంచేసియున్న పోలేరమ్మతల్లి దేవస్థానం నందు దసరా శరన్నవరాత్రుల సందర్భంగా గ్రామస్తులు, ఆలయకమిటీ వారు ఏర్పాటుచేసిన ప్రత్యేక పూజలలో మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు గైకొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులకు ప్రత్తిపాటి స్వయంగా వడ్డించారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాటితో పాటు మార్కెట్‌యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, టిడిపి నాయకులు జవ్వాజి మదన్‌మోహన్, అంబటి సోంబాబు, గుంటు కోటేశ్వరరావు, పిల్లి కోటేశ్వరరావు, గుంటు హరిబాబు, బొప్పూడి గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పెద్ద శివాలయంలో ప్రత్యేక పూజలు



చిలకలూరిపేట, అక్టోబర్ 3, ప్రభాతవార్త: విజయదశమి పండుగ సందర్భంగా పట్టణంలోని కళామందిర్ సెంటర్ వద్ద వేంచేసియున్న శ్రీ నాగేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలలో ప్రత్తిపాటి సతీమణి వెంకటకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ మేకనబోయిన సాంబశివరావు మరియు కమిటి సభ్యులు, 18వ వార్డు టిడిపి అధ్యక్షుడు ఆరెకట్ల కోటేశ్వరరావు, వార్డు టిడిపి నాయకులు మల్నేని రమేష్, తంగెళ్ల రామ్మోహన్ తదితరులు పాల్గొని వెంకటకుమారిని సత్కరించారు.

## 'చంద్రబాబు నాయకత్వం రాష్ట్రానికి, ప్రజలకు దేవుడిచ్చిన వరం'



చిలకలూరిపేట,అక్టోబర్3,ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం మంచి మానవతాదృక్పదంతో పేదల సేవకు పాటుపడుతుందని, చంద్రబాబు నాయకత్వం రాష్ట్రానిని దేవుడిచ్చిన వరమని మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. శుక్రవారం తన నివాసంలో 35మంది లబ్దిదారులకు రూ 34.34 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహయనిధి చెక్కులను లబ్దిదారులకు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను కంటికి రెప్పలా కాచే నాయకుడు ముఖ్యమంత్రిగా ఉండటం మన అందరి అదృష్టమని అన్నారు. స్త్రీశక్తి పథకంతో నష్టపోతున్న ఆటో డ్రైవర్లకు చంద్రన్న చేదోడుగా నిలుస్తున్నారని తెలిపారు. అర్హులైన ప్రతి ఆటోడ్రైవర్, యజమానికి రూ 15వేల సాయం అందించాలన్న నిర్ణయం ముఖ్యమంత్రి గొప్ప మనసుకు నిదర్శనమని ప్రత్తిపాటి చెప్పారు. రాష్ట్రంలోనే 2.90 లక్షల మంది ఆటో, ట్యాక్సీ వాలాలకు శనివారం అసలైన దసరాపండుగా అన్నారు. గత ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు తీవ్ర అన్యాయం చేసిందని, డీజిల్ ధరలు పెంచడం, రోడ్డు, గ్రీన్‌ట్యాక్స్ పెంపు వంటి భారాలతో ఇచ్చిన దానికంటే రెట్టింపు వారి వద్దనుంచి వసూలు చేసిందన్నారు. గత పాలకుల్లా మోసపూరిత సంక్షేమం, అబద్దాల పాలన, ఈ ప్రజా ప్రభుత్వం చేయదని అన్నారు. తమకు, రాష్ట్రానికి మంచి జరగకుండా కుట్రలకు పాల్పడుతున్న రాజకీయ నిరుద్యోగులకు ప్రజలు గుర్తుండిపోయేలా బుద్ది చెప్పాలని ప్రత్తిపాటి సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు,మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, టిడిపి నాయకులు పఠాన్ సమద్‌ఖాన్, మద్దుమాల రవి, జవ్వాజి మదన్‌మోహన్, బేరింగ్ మౌలాలి, షేక్ అజారుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం లాంటిది: చీఫ్‌విప్ జీ.వీ



వినుకొండ,అక్టోబర్3,ప్రభాతవార్త: సీఎం రిలీఫ్ ఫండ్ ఆపదలో ఉన్న పేదలకు వరం లాంటిదని ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని కొత్తపేట నందు గల చీఫ్‌విప్ కార్యాలయం నందు నియోజకవర్గ పరిధిలోని 49 మందికి రూ 31.89 లక్షలు విలువైన చెక్కులు లబ్ధిదారులకు జీ.వీ అందజేశారు. ఈ సందర్భంగా జీ.వీ మాట్లాడుతూ పేదలకు సహాయం చేయాలనే సంకల్పంతో సీఎం చంద్రబాబునాయుడు నిరంతరం శ్రమిస్తున్నారని చెప్పారు. గత వైకాపా పాలనలో సీఎంఆర్ఎఫ్ పూర్తిగా నిర్వీర్యమైందన్నారు. పేదలకు మంచి చేసే ప్రభుత్వంపై మాజీ సీఎం జగన్‌రెడ్డి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో 1036 మందికిగాను రూ 7.18 కోట్లు అందజేయడం జరిగిందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందని పేర్కొన్నారు. పేదలకు కార్పొరేట్ వైద్యం అందించడమే లక్ష్యంగా రూ.25లక్షలు భీమా పథకాన్ని ప్రభుత్వం అమలు చేయనుందన్నారు. జీఎస్టీ సంస్కరణల వల్ల అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 'బొల్లా'ది అవినీతి,అక్రమాలతో కూడిన చరిత్ర: డీసీసీబీ చైర్మన్ 'మక్కెన'

### స్మగ్లింగ్,భూకబ్జాలతో కోట్లు .. వినుకొండలో చేసిన అభివృద్ధి శూన్యం

### కూటమి నేతలపై నిరాధార ఆరోపణలు




వినుకొండ,అక్టోబర్3,ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వంపై అర్ధరహిత,అసంబద్ధ ఆరోపణలు చేస్తున్న వైకాపా మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుది అవినీతి,అక్రమాలతో కూడిన చరిత్ర అని డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు అన్నారు. గాంధీ జయంతి రోజు కూటమి ప్రభుత్వంపై బొల్లా చేసిన వ్యాఖ్యలపై మక్కెన విలేకరుల సమావేశం నిర్వహించి ఖండించారు. ఐదేళ్ళు అధికారంలో ఉన్న బొల్లా వినుకొండ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి గురించి చెప్పగలరా అని ప్రశ్నించారు. అధికార మదంతో రౌడీయిజం,అక్రమాలు,భూ దందాలు,దోపిడిలకు పాల్పడి వందల కోట్లు సంపాదించడం తప్ప బొల్లా చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. తాను వ్యవసాయం చేసినా,చేపల వ్యాపారాలు చేసిన ఎక్కడా అవినీతికి పాల్పడిన దాఖలాలు లేవని ఉంటే రుజువు చేయాలని బొల్లాకు సవాల్ విసిరారు. స్మగ్లింగ్,భూకబ్జాలు,అధిక వడ్డీలతో బొల్లా వల్ల బాధించబడిన వారు అనేక మంది ఉన్నారని బాధితుల మీడియోలను ప్రదర్శించారు. బొల్లా ఏబిఎం కాంపౌండ్ భూములు కొనుగోలు,కొండ వద్ద భూములు కొనుగోలు,జగనన్న కాలనీ పేరిట దోపిడి ఇలా చేసిన ప్రతి అవినీతి,అక్రమాలకు తమ వద్ద రుజువులు,సాక్ష్యాలు ఉన్నాయని చెప్పారు. అలాగే ఎన్నికల సమయంలో బొల్లా తప్పుడు విద్యార్హత పత్రాలు సమర్పించినట్లు నిరూపిస్తామని చెప్పారు. బొల్లా తమపై చేసే ఆరోపణలకు ఆధారాలు చూపించాలనే లేదంటే బహిరంగ క్షమాపణలు చెప్పాలన్నారు. సమావేశంలో సొసైటీ చైర్మన్లు పెసల వెంకటనారాయణ,తిరుమల శెట్టి బాలయ్య,పట్టణ తెదేపా అధ్యక్షులు బొంకూరి రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

## 'జీఎస్టీ తగ్గింపు ద్వారా ప్రజలకు ఎంతో మేలు'



ఈపూరు,అక్టోబర్3,ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన జీఎస్టీ తగ్గింపు వల్ల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం మండలంలోని ముప్పాళ్ళ గ్రామంలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో చీఫ్‌విప్ జీ.వీ,డీసీసీబీ చైర్మన్ మక్కెనలు పాల్గొని ర్యాలీ నిర్వహించి ప్రజలకు జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను వివరించారు. దుకాణాల వద్దకు వెళ్లి తగ్గిన జీఎస్టీ ధరల మేరకే వ్యాపారాలు చేయాలని ప్రజలకు మేలు జరిగేందుకే ప్రభుత్వం సంస్కరణలు తీసుకొచ్చిందని అవగాహన కల్పించారు. నెల రోజుల పాటు జీఎస్టీ అవగాహన కార్యక్రమాలు ఉంటాయని నాయకులు,కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## పట్టణంలో జీఎస్టీ సేవింగ్స్‌పై అవగాహన



వినుకొండ, అక్టోబర్ 3, ప్రభాతవార్త: పట్టణంలో సూపర్ జీఎస్టీ,సూపర్ సేవింగ్స్‌పై ట్రాక్టర్ ర్యాలీ అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏడిఏ రవికుమార్,మండల తహశీల్దార్ సురేష్‌కుమార్,ఉద్యాన అధికారి రసూల్,ఏవో వరలక్ష్మి,డిప్యూటీ ఎంపిడివో సుందర్‌రెడ్డి,డిటి సిహెచ్ మరళీధర్ తదితరులు పాల్గొని అవగాహన కల్పించారు. కొత్త జీఎస్టీతో వివిధ రకాల వ్యవసాయ యంత్ర పరికరాల ధరలు తగ్గాయన్నారు. మినీ ట్రాక్టర్లు,రోటోవేటర్ తదితర వాటిల్లో 12 శాతం నుంచి 5 శాతంకు తగ్గాయన్నారు. బయో ఎరువులు,పురుగు మందులు,సూక్ష్మపోషకాలపై 5శాతం మాత్రమే జిఎస్‌టి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో రైతులు,పురుగుమందుల డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రజాదర్బార్'కు 41 అర్జీలు




వినుకొండ, అక్టోబర్3ప్రభాతవార్త: ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ధ్యేయంగా ప్రజాదర్బార్ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందని ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని కొత్తపేట నందు చీఫ్‌విప్ కార్యాలయం నందు నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో జీ.వీ పాల్గొన్నారు. వివిధ సమస్యలపై పట్టణంతోపాటు నియోజకవర్గంలోని గ్రామాలకు చెందిన ప్రజలు 41 అర్జీలు వరకు జీ.వీకి అందజేశారు. ఈ సందర్భంగా జీ.వీ మాట్లాడుతూ గత వైకాపా పాలనలో ప్రజలు సమస్యలతో సతమతమయ్యారన్నారు. కూటమి ప్రభుత్వం పూర్తిగా ప్రజల పక్షపాతి అని ప్రజాదర్బార్‌కు వచ్చే ప్రతి అర్జీని అధికారులు త్వరితగతిన పరిష్కారించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లపై శునకాల స్వైరవిహారం



అమరావతి, అక్టోబరు 3 ప్రభాతవార్త : మండల పరిధిలోని లింగాపురం గ్రామంలో ప్రధాన రహదారులపై గుంపులు గుంపులుగా కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో స్థానికులు, వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఉదయం, సాయంత్రం, రాత్రి తేడా లేకుండా కుక్కలు వీధుల్లో సంచరిస్తూ ప్రజలను భయపెడుతున్నాయని తెలిపారు. ఈ కుక్కల బెడదను నియంత్రించేందుకు తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని పంచాయితీ అధికారులను గ్రామస్తులు కోరుతున్నారు.

## పెదకూరపాడు నుండి స్టేట్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఎంపిక



పెదకూరపాడు, అక్టోబరు 3 ప్రభాతవార్త : పెదకూరపాడు నియోజకవర్గం నుండి వైఎస్సార్‌సీపీ తరపున స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులుగా పక్కాల సూరిబాబు, ఈదా సాంబిరెడ్డి ఎంపికయ్యారు. నియోజకవర్గం నుండి స్టేట్ కౌన్సిల్‌లో ఇరువురికి అవకాశం లభించడం పట్ల నియోజకవర్గ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా పక్కాల సూరిబాబు, ఈదా సాంబిరెడ్డిలు తెలియజేశారు. వారికి పార్టీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలను తెలియజేశారు.

## జిఎస్‌టి పై అవగాహన ర్యాలీ




పెదకూరపాడు, (అచ్చంపేట) అక్టోబరు 3 ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వం జిఎస్‌టి కు సంబంధించి తీసుకువచ్చిన తగ్గింపు పై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. రైతులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు. ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించడం పట్ల మండల పార్టీ అధ్యక్షులు ఏటుకూరి బ్రహ్మయ్య, నాయకులు అర్తిమళ్ళ రమేష్, ఏటుకూరి రత్నకుమార్, వడ్లమూడి అప్పారావు, భాష్యం ఆంజనేయులు, కృష్ణయ్య, బాబూరావు హర్షం వ్యక్తం చేశారు.

## అయ్యప్పలకు అన్నదానం ప్రారంభం



చిలకలూరిపేట, అక్టోబర్3, ప్రభాతవార్త: పట్టణంలోని జాతీయ రహదారి ప్రక్కన ఓగేరు వాగువద్దనున్న శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయం నందు అయ్యప్ప మాల ధరించిన స్వాములకు దాతల సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభించారు. సంక్రాంతి పండుగ వరకు ఈ అన్నప్రసాద వినియోగం కొనసాగుతుందని ఆలయ కమిటి చైర్మన్ వెల్లంపల్లి రవిశంకర్ తెలిపారు. దసరా పండుగ పురస్కరించుకొని ఆలయంలో కమిటి వారు ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజలలో ప్రత్తిపాటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం అయ్యప్పమాల ధరించిన భక్తులకు అన్న ప్రసాదం వినియోగిస్తున్న కమిటి సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా కమిటి సభ్యులు ప్రత్తిపాటిని సత్కరించి జ్ఞాపిక అందచేశారు.

## తెదేపానేత బొట్ల కృష్ణమూర్తికు ఘననివాళి



నాదెండ్ల, అక్టోబర్ 3, ప్రభాతవార్త: మండలంలోని కనపర్రు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు బొట్ల కృష్ణమూర్తి శుక్రవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు కనపర్రు గ్రామంలోని వారి నివాసానికి వెళ్లి కృష్ణమూర్తి భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. ప్రత్తిపాటితో పాటు మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మండల, గ్రామ టిడిపి నాయకులు పాల్గొని కృష్ణమూర్తికి నివాళులు అర్పించారు.

## అయ్యప్పలకు అన్నప్రసాదం పంపిణీ



చిలకలూరిపేట, అక్టోబర్ 3, ప్రభాతవార్త: పట్టణంలోని ఓగేరు వాగు సమీపంలో ఉన్న అయ్యప్పస్వామి దేవాలయంలో అయ్యప్ప మాల ధరించిన భక్తులకు దాతల సహకారంతో ఏర్పాటు చేసిన అన్నప్రసాద కార్యక్రమంలో శాసనమండలి సభ్యుడు మర్రి రాజశేఖర్ పాల్గొన్నారు. అనంతరం స్వాములకు రాజశేఖర్ స్వయంగా వడ్డించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటి చైర్మన్ వెల్లంపల్లి రవిశంకర్, సభ్యులు నాగభైరు జగన్మోహనరావు, పోతిరెడ్డి, సుబ్రహ్మణ్యం, సామా శ్రీనివాసరావు, తవ్వా చలపతి, ఎ శివరామకృష్ణ, భవిరిశెట్టి మణి, సామా బుజ్జీలు రాజశేఖర్‌ను సత్కరించి జ్ఞాపిక అందచేశారు.

## నూతన ప్రారంభం



చిలకలూరిపేటటౌన్, అక్టోబర్3, ప్రభాతవార్త: నరసరావుపేట రోడ్‌లో పోలిరెడ్డిపాలెం కొత్త బైపాస్ దగ్గర నూతనంగా ఏర్పాటు చేసిన హర్షా ఫ్యామిలి రెస్టారెంట్‌ను శాసనమండలి సభ్యుడు మర్రి రాజశేఖర్ ప్రారంభించారు. రెస్టారెంట్ యజమానులు తొండెపు రాజేంద్ర, మండవ సీతారామయ్యలకు రాజశేఖర్ అభినందనలు తెలియచేశారు. రాజశేఖర్‌తో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## దిక్కులేని వృద్ధులను ఆదుకున్న స్వామి వివేకానంద ఛారిటబుల్ ట్రస్టు

మాచర్ల, అక్టోబరు 3 ప్రభాతవార్త: స్వామి వివేకానంద ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో దిక్కులేని ముగ్గురు వృద్ధులకు వస్త్రదానం, నిత్యావసర సరుకులు అందజేసినట్లు ట్రస్టు ఫౌండర్, చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. పీడబ్ల్యూడీ కాలనీలోని జడ్పీ బాలుర హైస్కూల్ ఎదురుగా పూరిగుడిసెలో నివాసం ఉంట్ను దేరంగుల వెంకటేశ్వర్లు భార్య అంజమ్మ మానసిక వికలాంగురాలు కూతురు లక్ష్మి ముగ్గురు కలిసి నివాసం ఉంటున్నారు. ముగ్గురిలో ఒకిరిక మాత్రమే పింఛను వస్తుంది. భార్యకు రెండు కళ్లు కనపడక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కూతురు లక్ష్మి మానసిక వికలాంగురాలు. ఆమె జీవచ్ఛవంలా ఉంది. ఇది గమనించిన చుట్టుపక్కల వారు గోవిందరెడ్డికి తెలియజేయగా స్పందించిన ఆయన వారికి నూతన వస్త్రాలు, నిత్యావసర సరకులు అందజేశారు. అంతేకాకుండా దేరంగుల వెంకటేశ్వర్లు భార్య అంజమ్మకు రెండు కళ్లు ఉచితంగా శుక్లాలు తీపించి ఆపరేషన్ చేయిస్తామన్నారు. మానసిక వికలాంగురాలైన లక్ష్మికి కూడా సదరం బుకింగ్ ఓపెన్ కాగానే స్లాట్ బుక్ చేసి మానసిక వికలాంగుల పింఛను వచ్చేలా ప్రయత్నిస్తామని గోవిందరెడ్డి తెలిపారు. ప్రతినెలా బియ్యం, నిత్యావసర సరకులు, వంటచెరకు అందజేస్తామన్నారు.

## వాహనమిత్ర ద్వారా డ్రైవర్లను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుంది

మాచర్ల, అక్టోబరు 3 ప్రభాతవార్త: వాహన మిత్ర ద్వారా రాష్ట్రంలోని 2 లక్షల 90 వవేల మంది ఆటో డ్రైవర్లకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి వెల్లడించారు. రాష్ట్రం లక్షల కోట్ల అప్పుల్లో ఉన్నా, ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో అభివృద్ధి, అన్ని వర్గాల సంక్షేమం పరుగులు పెడుతుందని ఆయన అన్నారు. సూపర్‌సిక్స్ హామీలన్నీ సూపర్‌హిట్‌గా సంక్షేమాన్ని అందిస్తున్నాయన్నారు. వాహన మిత్ర నగదు జమ నేపథ్యంలో మాచర్ల నియోజకవర్గ ఆటో డ్రైవర్ల ఆధ్వర్యంలో భారీ ఆటో ర్యాలీ శనివారం ఉదయం 10 గంటలకు స్థానిక రింగు రోడ్డు నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు జరుగుతుందని ఆయన చెప్పారు. అనంతరం మానుకొండ కల్యాణ మండపంలో ఆటో డ్రైవర్లతో సమావేశం ఉంటుందని పేర్కొన్నారు.

## మానవత్వం చాటిన మాచర్ల సీఐ ప్రభాకర్




మాచర్ల, అక్టోబరు 3 ప్రభాతవార్త: మాచర్ల పట్టణ సీఐ పచ్చిపాల ప్రభాకర్ మానవత్వాన్ని చాటుకున్నారు. గురువారం సాయంత్రం మాచర్ల పట్టణంలోని నెహ్రూనగర్ సమీపంలో దుర్గికి చెందిన వ్యక్తి మదనయం మత్తులో తన కారును అతివేగంగా నడుపుతూ నకరికల్లుకు చెందిన నాగూర్‌వలి కుటుంబ సభ్యులతో కలిసి సాగర్ వెళ్లి వస్తూ మాచర్ల నెహ్రూనగర్ సమీపంలో టీ తాగేందుకు ఆటో ఆపి రోడ్డు పక్కన నిలిచి ఉన్న నాగూర్‌వలిని అతివేగంతో మదనయం మత్తులో ఢీకొట్టాడు. దీంతో వలి తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో పడి ఉన్నాడు. అక్కడ ఉన్నవారు వైద్యశాలకు తరలించేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఆ సమయంలో అటుగా వెల్తున్న మాచర్ల పట్టణ సీఐ పచ్చిపాల ప్రభాకర్ వెంటనే తన వాహనాన్ని ఆపి, గాయపడిన వ్యక్తిని స్వయంగా తన వాహనాలు ఆసుపత్రికి తరలించారు. మానవత్వం చాటిన సీఐ ప్రభాకర్ పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తగ్గిన జీఎస్టీ పన్నులపై నేడు అవగాహన సదస్సు

మాచర్ల, అక్టోబరు 3 ప్రభాతవార్త: మాచర్ల మున్సిపల్ కార్యాలయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న జీఎస్టీ 2.0 కింద జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌లో భాగంగా ప్రతి కుటుంబానికి పేద మధ్య తరగతి వర్గాలకు తక్కువ జీఎస్టీ రేట్లు వర్తిస్తాయని అసిస్టెంట్ కమిషనర్ రాష్ట్ర పన్నులు పిడుగురాళ్ల పి.నారాయణశాస్త్రి, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్, రాష్ట్ర పన్నులు పి.శేషగిరి, నోడల్ ఆఫీసర్ ఎస్‌కే ఇమ్రాన్‌ఖాన్ స్పెషల్ జీఎస్టీ ఆఫీసర్ టి.పీటర్‌బాబు, ఇతర సిబ్బందితో అవగాహన కార్యక్రమంలో నిర్వహించనున్నారు. జీఎస్టీ ఫలాలు ప్రజలకు చేరువ చేయడానికి వివిధ విభాగాల అధికారులతో, వ్యాపార సంస్థ అసోసియేషన్లతో, ఆడిటర్లు, అకౌంటెంట్లు జయప్రదం చేయాలని వారు కోరారు.

## కారంపూడి ఆదినారాయణ కాలనీలో వైభవంగా బతుకమ్మ వేడుకలు



కారంపూడి, అక్టోబరు 3 ప్రభాతవార్త: కారంపూడి ఆదినారాయణ కాలనీలో గత తొమ్మిది రోజుల నుంచి బతుకమ్మ వేడుకలను కాలనీవాసులు ఘనంగా నిర్వహించారు. చివరి రోజున బతుకమ్మను ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఆదినారాయణ కాలనీలో నవరాత్రుల్లో మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. సాయంత్రం భజన కార్యక్రమాలు నిర్వహించారు. వేపాకుతో బతుకమ్మ పూజలు చేసి ఘనంగా నిర్వహించారని కారంపూడి సీపీఐ మండల కార్యదర్శి షేక్ సైదా అన్నారు. బతుకమ్మ వేడుకల కార్యక్రమం మేస్త్రి సామ్రాజనయం ఆధ్వర్యంలో జరిగింది.

## కారంపూడి మండలంలో ఘనంగా గాంధీజయంతి వేడుకలు

కారంపూడి, అక్టోబరు 3 ప్రభాతవార్త: కారంపూడి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గాంధీ జయంతి, స్వచ్ఛతాహి సేవ వారోత్సవాల ముగింపు సందర్భంగా అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. గ్రామాభివృద్ధి ప్రణాళికలు, మహాత్మాగాంధీ ఉపధి హామీ పనులు, సంపూర్ణ పారిశుద్ధ్యం, ప్లాస్టిక్ నిషేధం, బహిరంగ మలవిసర్జన రహిత మండలంగా అన్ని గ్రామ పంచాయతీలు తీర్మానం చేశాయి. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి పంగులూరి అంజయ్య, ఆయా గ్రామ సర్పంచులు సరస్వతి బాలునాయక్, పుష్పావతి, కందిమళ్ల లక్ష్మయ్య, ఎంపీటీసీలు కనకదుర్గ, ఎంపీడీఓ గంటా శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు కసిన్యానాయక్, సైదమరాజు, రామరాజు, రవీంద్ర, వెంకటేశ్వర్లు, ఏపీఓ నాగేశ్వరరావు, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ సుబ్బారావు, మండల పరిధిలోని గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు, స్థానిక గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

**ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో గాంధీజయంతి వేడుకలు**

వాసవీ ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ముందుగా పూలదండలు వేసి కొబ్బరికాయ కొట్టి నివాళులర్పించారు. జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాలను కొనియాడారు. యువజన సంఘం అధ్యక్షులు సముద్రాల పవన్‌సాయి, చేపూరి రవీంద్ర, వెచ్చా ఉమా మహేష్, కొత్తూరి ఆనంద్, వెచ్చా నవీన్, కరాలపాటి బిక్షాలు, సముద్రాల అఖిల్, చిన్ని లవకుమార్, సూరె అజయ్, కర్నాటి నిఖిల్, సముద్రాల అరవింద్, జొన్నలగడ్డ సాయి, పంతంగి సుమంత్, కర్నాటి సుజిత్, కొమ్మూరి యశ్వంత్, దీరు, మహి తదితరులు పాల్గొన్నారు.

4-10Pg5exHMNWJQE 9TH_4-10Pg5exHMNWJQE.qxd 10/3/2025 11:49 PM Page 1





# వచ్చే బ్రహ్మోత్సవాలకు మాడవీధుల్లోని గ్యాలరీలకు పైకప్పు!

- అంగప్రదక్షిణటోకెన్లు విడుదలపై బోర్డులో చర్చించి నిర్ణయం
- ఆన్‌లైన్‌లో బల్క్‌బుకింగ్స్ అక్రమాలపై విచారణ
-'డయల్ యువర్ ఇఒ'లో ఎకె సింఘాల్

**తిరుమల,అక్టోబర్ 3ప్రభాతవార్తప్రతినిధి:** దేశం నలుమూలల నుండి తిరుమలకు వస్తున్న భక్తులు ఇచ్చే విలువైన అభిప్రాయాలు, సూచనలతో మరింత మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ తెలిపారు. భక్తులు సలహాలతో ఎప్పటికప్పుడు, ఎక్కడికక్కడ కొన్ని అమలుచేస్తామన్నారు. భక్తుల అభిప్రాయాలతోనే టిటిడి తిరుమలలో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. దేవదేవుని ఆశీస్సులు, భక్తుల ఆశీర్వాదాలతోనే టిటిడి ఇఒగా రెండవసారి రావడం తనపై సిఎం చంద్రబాబు మరింత బాధ్యతలు గుర్తుచేశారన్నారు. శుక్రవారం ఉదయం తిరుమల అన్నమయ్యభవనంలో 'డయల్ యువర్ ఇఒ"కార్యక్రమం జరిగింది. అనంతరం ఇఒ సింఘాల్ మీడియాప్రతినిధులతో మాట్లాడారు. ఈ వారం 23మంది భక్తులు తమతమ అమూల్యమైన సూచనలు, సలహాలు చేశారన్నారు. ఇందులో ఆలయ మాఢవీదుల్లోని గ్యాలరీలకు పైకప్పు(షెల్టర్)ఏర్పాటుచేస్తే వర్షం వచ్చినా భక్తులకు ఇబ్బంది ఉండదని సూచించారన్నారు.దీనిపై ఆగమపండితులతో, బోర్డుతో చర్చించి అవకాశం ఉన్నవరకు వచ్చే బ్రహ్మోత్సవాలకు ఈ పనులు చేపడతామన్నారు. అంగప్రదక్షణటోకెన్లు ఆన్‌లైన్‌లో విడుదల చేయడంలో లక్కీడిప్‌లో కేటాయించడం మంచిదికాదని, దీన్ని మార్పుచేయాలని భక్తులు కోరారన్నారు. ఈ విషయంపై బోర్డు సమావేశంలో చర్చించి తగిన విధంగా నిర్ణ యం తీసుకుంటామన్నారు. బ్రహ్మోత్స వాల్లో భక్తులకు అందించిన సేవలు, సౌకర్యాలపై ప్రశం సలు వెల్లువెత్తుతున్నా యన్నారు. ఆన్‌లైన్ లక్కీడిప్‌లో బల్క్ బుకింగ్స్‌లో అవక తవకలు జరిగా యంటూ భక్తుల నుండి ఫిర్యాదులు వచ్చాయని, దీనిపై విచారణ చేయాల్సిన అవసరం ఉంద న్నారు. భక్తుల సూచనలు, సలహాలను టిటిడి బోర్డు దృష్టికి తీసుకెళ్ళి సానుకూలమైన నిర్ణయాలు తీసుకుంటామన్నా రు. భక్తుల సహకారంతో బ్రహ్మోత్స వాలు విజయవంతంగా నిర్వహించా మన్నారు. హైదరాబాద్‌నుండి శంకరయ్య గౌడ్ మాట్లాడుతూ నవంబర్ 14నుండి 16వతేదీ వరకు పరకామణిసేవ బుక్‌చేసుకున్నామని, 14వతేదీ రిపోర్టుచేయాలని ఉందన్నారు. దీనిపై ఇఒ సింఘాల్ సమాధానంగా సాఫ్ట్‌వేర్‌లో మార్పులుచేశామని, 13వతేదీనే రిపోర్టుచేయాలని తెలిపారు. తిరువూర్‌నుండి నాగేశ్వరరావు మాట్లాడుతూ వెండివాకిలినుండి బంగారువాకిలి వరకు భక్తుల మధ్య తోపులాట ఎక్కువగా ఉందని, అక్కడ విదుల్లో ఉండే సెక్యూరిటీ సిబ్బంది, శ్రీవారిసేవకులు, టిటిడి సిబ్బంది భక్తులపట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని ఫిర్యాదు చేశాడు. ఈ ప్రశ్నకు సమాధానంగా ఇఒ ఆ ప్రాంతంలో భక్తుల పట్ల వ్యవహరించాల్సి న విధానంపై శిక్షణనిస్తున్నామన్నారు. స్వామివారి దర్శనానికి 20గంటలపైగా పడుతోంది,కావున భక్తులు నిమిషంపాటు స్వామివారిని చూడాలనుకుంటున్నారు. క్యూలైన్లు సాఫీగా ఉండేలా చర్యలు చేపడతామన్నారు. హైదరాబాద్‌నుండి సుబ్బలక్ష్మి,అరుంధతి మాట్లాడుతూ వయోవృద్ధులు, దివ్యాంగులకు ఇదివరకు తిరుమలలోనే ప్రతిరోజూ కేటాయించే విధంగా దర్శన టోకెన్లు విధానం మార్చాలని, ఆన్‌లైన్‌లో మూడునెలల ముందుగాకుండా 15రోజుల ముందు విడుదల చేయాలని కోరారు. ఇందుకు ఇఒ సింఘాల్ స్పందిస్తూ వీలైనంతవరకు పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ మీడియా సమావేశంలో టిటిడి సివిఎస్ఓ మురళీకృష్ణ, సిఇ సత్యనారాయణ, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి, పిఆర్ఓ నీలిమ, డిప్యూటీ ఇఒలు భాస్కర్, రాజేంద్రకుమార్, సోమన్నారాయణ, డిఎఫ్ఒ ఫణికుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



# భారత దేశమే అతిపెద్ద మార్కెట్.. యాచించే స్థాయి పోయింది..శాసించే స్థాయికి రావాలి

## - సిఎం చంద్రబాబునాయుడు

**విజయవాడ,అక్టోబరు3,ప్రభాతవార్తప్రతినిధి:** మన దేశం ప్రపంచాన్ని యాచించే స్థాయిని దాటిపోయిందని...ఇకపై శాసించే స్థాయికి భారత్ చేరుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఎస్ఎస్ కన్వెన్షన్ సెంటర్ లో విజయదశమి సందర్భంగా ఏర్పాటు చేసిన ఖాదీ సంత కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆత్మ నిర్బర్ అభియాన్ లో భాగంగా ఏర్పాటు చేసిన స్వదేశీ ఖాదీ సంత కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ముందుగా వేదిక వద్ద ఏర్పాటు చేసిన జాతిపిత మహాత్మా గాంధీకి ముఖ్యమంత్రి చంద్రబాబు నివాళులు అర్పించారు. స్వదేశీ ఉద్యమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఖాదీ సంత ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సీఎం పరిశీలించారు. దేశీయంగా చేతివృత్తుల కళాకారులు ఉత్పత్తి చేసిన వివిధ ఉత్పత్తులను, ఆర్గానిక్ ఉత్పత్తులను ముఖ్యమంత్రి పరిశీలించారు. ఖాదీ ఉద్యమంలో...స్వాతంత్ర్య పోరాటంలో పాలుపంచుకున్న వారి ఫొటో ఎగ్జిబిషన్ ను ముఖ్యమంత్రి చంద్రబాబు తిలకించారు. అలాగే ఆర్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్ ను సీఎం సందర్శించారు. ఖాదీసంత ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రాట్నంపై చంద్రబాబు నూలు వడికారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.."దసరా రోజు సంకల్పించిన ప్రతీ పని విజయవంతం అవుతుంది. స్వదేశీ పేరిట ఏర్పాటు చేసిన ఈ ఖాదీ సంత కార్యక్రమం కూడా విజయం సాధిస్తుంది. ఖాదీసంత, స్వదేశీ భారతీయ ఉత్పత్తులకు గ్లోబల్ సంతగా తయారవుతుందని ఆశిస్తున్నాను. ఆ దిశగానే భారత్ ముందడుగులు వేస్తోంది. ఇప్పటి వరకూ విదేశీ వస్తువులు, విదేశీ టెక్నాలజీనే వాడుతూ వచ్చాం. ఇప్పుడు ప్రధాని మోదీ టెక్నాలజీ రంగంలోనూ స్వదేశీకి పిలుపునిచ్చారు. అందుకే బీఎస్ఎన్ఎల్ ఇటీవలే స్వదేశీ 4 స్టాక్ ను దేశ ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. కోవిడ్ సమయంలో భారత్ ఉత్పత్తి చేసిన వ్యాక్సిన్లే వివిధ దేశాల ప్రజల ప్రాణాలు కాపాడాయి."అని సీఎం అన్నారు. గతంలో ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి నుంచి భారత్ ఇప్పుడు పటిష్టమైన స్థానానికి ఎదిగింది. 2038కి ఆర్థికంగా రెండో స్థానానికి భారత్ చేరుతుంది.

2047 నాటికి అగ్రస్థానంలోకి వస్తాం. ఇదే భారత మాతకు నిజమైన నివాళి అవుతుంది. గతంలో శాటిలైట్ లను ఇతర దేశాల నుంచి ప్రయోగించే పరిస్థితి నుంచి ప్రైవేటు వ్యక్తులు కూడా ఉపగ్రహాలను తయారు చేసి లాంచ్ చేసే పరిస్థితికి వచ్చేశాం. ప్రధాని మోదీ భారత దేశ మూలాలను ఎప్పుడూ గుర్తు తెస్తూనే ఉంటారు. ఆ మూలాలను వదిలిపెట్టకుండా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోంది. స్వాతంత్ర్యానికి పూర్వం 60 శాతం మేర వివిధ ఉత్పత్తుల ఎగుమతులు భారత్ నుంచి జరిగేవి. బ్రిటిషర్లు వచ్చాక పరిస్థితులు మారి విదేశీ వస్తువులు మనం వాడే స్థితికి చేరుకున్నాం. ఈ పరిస్థితి మారాలి. బీ ఇండియన్ బై ఇండియన్ అన్న నినాదం దేశమంతా రావాలి. దేశంలో ఉండే జనాభా మనకు అతిపెద్ద ఆస్తి, సంపద, అతిపెద్ద మార్కెట్.



## అమరావతిలో పర్యటించిన మలేసియా బృందంతో మంత్రి నారాయణ

**విజయవాడ,అక్టోబరు 3,ప్రభాతవార్తప్రతినిధి:** మలేషియా ప్రజాప్రతినిధుల బృందం రాజధాని అమరావతిలో శుక్రవారం పర్యటించింది. రాజధానిలోని నిర్మాణాల గురించి వారికి మంత్రి నారాయణ, సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, అదనపు కమిషనర్ భార్గవ్ తేజ వివరించారు. సీడ్ యాక్సెస్ రహదారి పక్కనే నిర్మిస్తున్న సీఆర్డీఏ నూతన కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. ఈ సముదాయాల వివరాలను మలేషియా బృందానికి అధికారులు తెలిపారు. రెండున్నరేళ్లలో రాజధాని నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి నారాయణ వెల్లడించారు. సిఎం చంద్రబాబు నాయకత్వంలో ప్రపంచలో టాప్ 5 రాజధానుల్లో అమరావతిని ఒకటిగా రూపుదిద్దుతామని స్పష్టం చేశారు. అమరావతిలో పెట్టుబడులు పెట్టడానికి మలేషియాకు చెందిన పలు ప్రైవేటు సంస్థలు ఆసక్తి కనబరిచినట్లు మంత్రి తెలిపారు. రాబోయే 5 ఏళ్లలో రూ.6 వేల కోట్ల నుంచి రూ.10 వేల కోట్ల వరకు పెట్టుబడులు పెట్టేలా పలు ప్రాజెక్టులను మంత్రి నారాయణకు మలేషియా ప్రతినిధులు వివరించారు



లల్లాదేవి

## ప్రముఖ నవలా రచయిత లల్లాదేవి కన్నుమూత

**విజయవాడ, అక్టోబరు 3, ప్రభాతవార్త ప్రతినిధి:** లల్లాదేవిగా తెలుగు పాఠకులకు సుపరిచితులైన నప్రముఖ నవలా రచయిత పరుచూరి నారాయణ చార్యులు(82) శుక్రవారం వేకువజామున కన్ను మూశారు. ఆయన 150పైగా నవలలు రాశారు. 150కిపైగా నవలలు, కొన్ని నాటకాలు.. చారిత్రక ప్రాధాన్యత కలిగిన రచనలు.. ఆమ్రపాలి, మహామంత్రి తిమ్మరుసు, వైద్య విజ్ఞానం పంచే రచనలు ఎయిడ్స్, వాత్సాయన కామసూత్రాలు వగైరా.. ఇలా బహుముఖీనమైన ప్రతిభతో రచనా వ్యాసంగం ద్వారా తెలుగు సాహిత్యాన్ని పరిపుష్టం చేశారు. లల్లాదేవి శ్వేతనాగు గత శతాబ్దంలో అంటే 1980-90వ దశకంలో ఒక సంచలనం. వేలకొలది కాపీలు అమ్ముడు పోవడమేకాక కీర్తిప్రఖ్యాతలు తెచ్చిన నవల. ఆ నవలను సినిమా కూడా తీశారు. 1982లో యార్లగడ్డ రాజ్యలక్ష్మివెంకన్నచౌదరి కళాపీఠం అవార్డు, యల్లాప్రగడ సుబ్బారావు మెమోరియల్ పురస్కారం, డా. పఠాభి కళాపీఠం విజయవాడవారిచే ఉత్తమ నవలారచయితగా ఎంపికై 'గోల్డ్ మెడల్', ప్రశంసా పత్రం, లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్‌అవార్డు, గుంటూరు జిల్లా ఉగాది పురస్కారాలు మూడుసార్లు, 1985 ప్రపంచ తెలుగు మహాసభల సావనీర్‌కు ఎంపికై, కథ ప్రచురితమైంది. 14 నవలలు కన్నడంలోకి అనువాదమై, వివిధ కన్నడ పత్రికల్లో ధారావాహికంగాను, నవలలుగాను వెలువడ్డాయి. ఆయన తిరుచరణాలు చారిత్రక నవల 'శ్రీచరణ్'గా హిందీలోకి అనువాదమై వెలువడింది. ఇక తిరుమల తిరుపతి దేవస్థానంలో, ధర్మప్రచార పరిషత్ (గుంటూరు) పురాణ పండిట్‌గాను, ఎండోమెంట్స్ డిపార్ట్‌మెంట్‌లోను, ఎపి ఆస్థాన పౌరాణిక ప్రవచకారునిగాను, స్వగ్రామంలో వైష్ణవ అర్చకస్వామిగాను, కొన్ని ఛానల్స్‌లో ఆస్ట్రాలజీ ప్రోగ్రామర్‌గా పనిచేసారు. రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ లల్లాదేవి మృతి పట్ల విచారం వ్యక్తం చేసారు.


## సమష్టిగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు విజయవంతం

### - 32లక్షల లడ్డూలు విక్రయం - టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు




**తిరుమల,అక్టోబర్ 3ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్స వాలను సమష్టిగా అందరి సహకారంతో విజయవంతంగా నిర్వహించామని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు వెల్లడించారు. తొమ్మిదిరోజులు సామాన్యభక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాలు, అన్ని శాఖలు సమన్వయంతో సమష్టిగా సేవ లందించాయని తెలిపారు. టిటిడి పాలకమండలి,అనుభవజ్ఞులైన అధికారులతో కలసి బ్రహ్మోత్స వాలు విజయవంతంగా నిర్వహించడంపై మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఈ ఏడాది తిరుమలేశుని సాలకట్ల బ్రహ్మోత్స వాలను దిగ్విజయం చేసిన టిటిడి అర్చకులు, సీనియర్ అధికారులు, ఉద్యోగులు, జిల్లా అధికారులు, పోలీస్ యంత్రాంగం, శ్రీవారి సేవకులు, భక్తులకు, మీడియాకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రపంచం నలుమూలల నుండి విచ్చేసిన లక్షలాదిమంది భక్తులకు 16రకాల వాహనసేవలతోబాటు మూలవిరాట్టు దర్శనం కల్పించామన్నారు. తొమ్మిదిరోజులు 7.30లక్షలమంది భక్తులు మూలవిరాట్టును దర్శనం చేసుకున్నారన్నారు. కానుకల ద్వారా హుండీ ఆదాయం 30.51కోట్ల రూపాయలు చేకూరిందన్నారు. ప్రతిరోజూ తాను, టిటిడి ఈఓ,జిల్లా ఎస్పీ అధికారులతో కలసి గ్యాలరీలను పరిశీలించడం, గ్యాలరీల్లో భక్తులతో మాట్లాడామన్నారు. టిటిడి కల్పించిన సౌకర్యాలు,ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారన్నారు.

## బాలాజీ ఆరోగ్యవరప్రసాదినికి రూ.30లక్షలు విరాళం



**తిరుమల,అక్టోబర్ 3ప్రభాత వార్తప్రతినిధి:** ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహిస్తున్న అనేక పథకాలు, ట్రస్ట్‌లకు దాతలు విరివిగా విరాళాలందిస్తున్నారు. ఖమ్మంకు చెందిన గుర్రం వెంకటేశ్వర్లు టెక్స్‌టైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ అంకిత్ టిటిడి బాలాజీ ఆరోగ్యవరప్రసాదినికి 30లక్షలు రూపాయలు డిడి విరాళంగా టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు అందజేశారు. ఈ సందర్భంగా టిటిడి బోర్డుసభ్యుడు శాంతారామ్ ఉన్నారు.

## అరకు కాఫీకి ఛేంజ్ మేకర్ అవార్డుపై సిఎం చంద్రబాబు అభినందనలు..



అరకు కాఫీకి ఛేంజ్ మేకర్ అవార్డును అందుకున్న మంత్రి సంధ్యారాణిని అభినందిస్తున్న సీఎం చంద్రబాబు

**విజయవాడ అక్టోబర్ 3, ప్రభాత వార్తప్రతినిధి:** అరకు కాఫీ ద్వారా జాతీయ స్థాయిలో బిజినెస్ లైన్ ఛేంజ్ మేకర్ అవార్డు దక్కించుకున్న గిరిజన సహకార సంస్థను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందించారు. అరకు వ్యాలీకి కాఫీకి ఫైనాన్షియల్ ట్రాన్స్‌ఫర్మేషన్ విభాగంలో అవార్డు దక్కడంపై గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, జీసీసీ ఎండీ కల్పన కుమారిని ముఖ్యమంత్రి ప్రశంసించారు. శనివారం సీఎం చంద్రబాబును మంత్రి సంధ్యారాణి, ఎండీ కల్పన కుమారి సచివాలయంలో కలిశారు. ఈ సందర్భంగా బిజినెస్ లైన్ నుంచి స్వీకరించిన అవార్డును, ప్రశంసా పత్రాన్ని సీఎం పరిశీలించారు. జీఐ ట్యాగ్ పొందిన తర్వాత అరకు కాఫీ అంతర్జాతీయ స్థాయిలో ప్రముఖ బ్రాండ్ గా మారిందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

ఏజెన్సీ ప్రాంతంలో సేంద్రీయ విధానంలో సాగు అవుతున్న అరకు కాఫీ స్వచ్ఛత, సువానలతో పాటు... ప్రత్యేక రుచిని కలిగి ఉందన్నారు. ఈ విశిష్టత కారణంగా అరకకు మంచి బ్రాండ్ అనే పేరు వచ్చిందని సీఎం చెప్పారు. కాఫీ సాగు ద్వారా అరకులోని గిరిజనుల జీవన శైలిలో మార్పు వచ్చిందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### : స్పీకర్ అయ్యన్నపాత్రుడు

**చోడవరం, అనకాపల్లి జిల్లా:** రైతుల సంక్షేమమే లక్ష్యంగా తమ కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని, సహకార సంఘాలను బలోపేతం చేసి రైతన్నలకు అండగా నిలుస్తామని గౌరవ ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి శ్రీ అయ్యన్నపాత్రుడు గారు అన్నారు. శుక్రవారం అనకాపల్లి జిల్లా చోడవరంలో నిర్వహించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) అధ్యక్షుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, సహకార రంగం ద్వారానే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టమవుతుందని అన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు, వారికి అవసరమైన రుణాలు, విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించే బాధ్యత పీఏసీఎస్‌లపై ఉందని గుర్తుచేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, వారి అభ్యున్నతే తమ ప్రథమ కర్తవ్యమని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో ప్రతి రైతుకు చేరేలా చూడటంలో పీఏసీఎస్ అధ్యక్షులు కీలక పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు. చిరు వ్యాపారులకు రుణాలు ఇచ్చి వారిని ప్రోత్సహించాలని పేర్కొన్నారు.

# జిఎస్టీ వసూళ్లలో ఎపి దేశంలో రెండో స్థానం

## రాష్ట్ర పన్నుల ప్రధాన కమిషనర్ బాబు

**విజయవాడ,అక్టోబరు 3,ప్రభాత వార్తప్రతినిధి:** ఏపీలో గతంలో ఎన్నడూ లేని విధంగా సెప్టెంబర్ నెలలో జీఎస్టీ వసూళ్లలో అత్యధికంగా 7.45 శాతం నమోదు చేయడం జరిగిందని రాష్ట్ర పన్నుల ప్రధాన కమిషనర్ బాబు. ఏ శుక్రవారంఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 2025 లో విడుదల చేసిన జీఎస్టీ 2.0 ద్వారా పలు లావాదేవీలపై పన్నుల శాతం తగ్గడం వల్ల వ్యాపార లావాదేవీలు మందగించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 2025 లో జీఎస్టీ వసూళ్ల లో గరిష్టంగా రూ. 2,789 కోట్ల నికర జీఎస్టీ వసూళ్లతో నమోదయ్యిందన్నారు. 3,653 కోట్ల స్థూల జీఎస్టీ వసూళ్లతో రెండవ అత్యధిక రికార్డుగా నమోదుకాగా సెప్టెంబర్ 2023 తో పోల్చితే, సెప్టెంబర్ 2025లో నికర జీఎస్టీ వృద్ధి 12.67 పెరిగిందన్నారు. సెప్టెంబర్ 2024 తో పోల్చితే, నికర జీఎస్టీ సేకరణలు 7.45 పెరగగా, స్థూల సేకరణలు అదే కాలక్రమంలో 4.19 కు పెరిగిందన్నారు. సెప్టెంబర్ 2025 లో రాష్ట్ర జీఎస్టీ (వసూళ్లు రూ. 1,185 కోట్లకు చేరాయని, ఇది సెప్టెంబర్ 2024 తో పోల్చితే 8.28 వృద్ధి సాధించాయన్నారు. కఠినమైన అమలు ఈ వృద్ధికి దోహదపడ్డాయన్నారు. సెప్టెంబర్ 2023 తో పోల్చితే 5.50 వృద్ధి నమోదు కావడం జరిగిందన్నారు. సెప్టెంబర్ 2025 లో ఐజీఎస్టీ సెటిల్‌మెంట్ ద్వారా రాష్ట్రానికి రూ. 1,605 కోట్లు లభించగా, సెప్టెంబర్ 2024 తో పోలిస్తే 6.84 ఎక్కువని, సెప్టెంబర్ 2023 తో పోల్చితే 18.62 వృద్ధి నమోదయ్యిందని, దీనికి ప్రధానంగా సమర్థవంత పర్యవేక్షణ వ్యవస్థలు, నిర్ణీత కాలంలో జరిగిన సమన్వయం, మెరుగైన సెటిల్‌మెంట్ విధానాలని చెప్పారు.సెప్టెంబర్ 2024 తో పోల్చితే నికర జీఎస్టీ వసూళ్ల గణనీయంగా పెరగడం, పన్ను చెల్లింపుల్లో మెరుగైన క్రమశిక్షణ, సమర్థవంతమైన ఐజీఎస్టీ సెటిల్‌మెంట్లు, అలాగే పన్ను పరిధి క్రమంగా పెరగడం వల్ల సాధ్యమైందని అన్నారు. ప్రభుత్వం అమలు కట్టుదిట్టం చేయడం, పన్ను చెల్లింపుదారుల సేవలను మెరుగుపరచడం, డేటా విశ్లేషణ వినియోగం పెరగడం నమర్థవంతమైన పన్ను విధానం, వినియోగించడం స్వచ్ఛంద అనుసరణలను పెంచి ఆదాయాన్ని బలోపేతం చేశాయని పేర్కొన్నారు.

# తిరుమల సమాచారం

## భక్తుల పుణ్యస్నానాలతో ముగిసిన చక్రస్నానమహోత్సవం



**తిరుమల,అక్టోబర్ 3ప్రభాత వార్త ప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలలో తొమ్మిదిరోజులు జరిగిన శ్రీవారి సాలకట్లవార్షిక బ్రహ్మోత్స వాలుచివరిరోజు గురువారం ఉదయం చక్రధారుడి చక్రస్నాన మహోత్స వంతో వైభవంగా ముగిశాయి. విశేష సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారి పుష్కరిణిలో పుణ్యస్నానాలా చరించారు. ఉదయం 6గంటల నుండి 9గంటల వరకు శ్రీభూవరాహస్వామి ఆలయం ముఖమండపంలో శ్రీదేవిభూదేవి సమేత శ్రీమలయప్ప స్వామివారికి శ్రీసుదర్శన చక్రత్తాళ్వారుకు స్నపనతిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ఇందులో ముందుగా విశ్వక్సే నారాధన, పుణ్యాహవచనం, ,ముఖప్రక్షాళన, దూపదీపనైవేద్యం,రాజోపచారం నిర్వహించారు. అర్ఘ్యపాదనివేదనలో భాగంగా పాలు,తేనె, కొబ్బరినీళ్ళు ,పసుపు,గంధంతో స్నపనం నిర్వహించారు. అభిషేకానంతరం వివిధ పాశురాలను పెద్దజియ్యర్‌స్వామి, చిన్నజియ్యర్‌స్వామి పఠించారు. చక్రస్నానంలో శ్రీవారి సుదర్శనచక్రంకు పుష్కరిణిలో స్నానం నిర్వహించే ముందు శ్రీభూసమేత మలయప్పస్వామివారికి స్నపనతిరుమంజనం నిర్వహించారు.చక్రస్నానసమయంలో అర్చకులు కర్పూరహారతులిచ్చారు. అదే సమయంలో భక్తులు పుష్కరిణిలో గోవిందనామాలతో పుణ్యస్నానాలాచరించారు. తొలినుండి పక్కాప్రణాళికలతో పోలీసుయంత్రాంగం తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్ఓ మురళీకృష్ణ, తిరుమల డిఎస్పీ విజయశేఖర్, విజిలెన్స్ విఎస్ఓలు తదితర అధికారులు,సిబ్బంది పక్కాప్రణాళికతో భక్తులను క్రమబద్దీకరించారు. చక్రస్నానమహోత్స వంలో పెద్దజీయర్‌స్వామి,చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు దంపతులు, టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ దంపతులు, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం ,సివిఎస్ఒ మురళీకృష్ణ, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, నరేశ్, శాంతారాం, పనబాకలక్ష్మి,సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి, అర్చకులు,వేదపండితులు పాల్గొన్నారు.

## శ్రీవారి సేవలో న్యాయమూర్తులు



**తిరుమల,అక్టోబర్ 3ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని శుక్రవారం ఉదయం నైవేద్యవిరామ సమయంలో పలువురు న్యాయమూర్తులు కుటుంబంతో కలసి దర్శనం చేసుకున్నారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పుల్లా కార్తీక్, ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అమిత్‌శర్మ, రాజస్థాన్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భూశ్వన్‌గోయల్ కుటుంబసభ్యులతో కలసి వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. రంగనాయకులు మండపంలో వేదాశీర్వచనం చేశారు. తీర్థప్రసాదాలు అందజేశారు.

## అనంతాళ్వారు తోటకు మలయప్ప

### - కన్నులపండువగా 'భాగ్ సవారి' ఉత్సవం



**తిరుమల,అక్టోబర్ 3ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో నిర్వహించే ఉత్సవాలలో ఒకటైన భాగ్‌సవారి ఉత్స వం శుక్రవారం సాయంత్రం అత్యంత వైభవంగా జరిగింది. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్స వాలు పూర్తయిన మరుసటిరోజు భాగ్‌సవారి ఉత్స వం నిర్వహించడం ఆనవాయితీ. సాయంత్రం ఆలయంలో నిత్యకైంకర్యాలు ముగిసిన తరువాత శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామి మాఢవీధుల్లో అప్రదక్షిణంగా అనంతాళ్వారు తోటకు చేరి ప్రత్యేక పూజలందుకొని తిరిగి ఆలయంలోనికి ప్రవేశించడంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం ,ఆలయ పేష్కార్ రామకృష్ణ, ఆలయ పారుపత్తేదార్ హిమత్‌గిరి, పోటుపేష్కార్ శ్రీనివాసులు,అర్చకులు పాల్గొన్నారు.

## భగవంతుని కృప అందరిపై ఉండాలని వేడుకున్నా - బిజెపి ఎంపి పురందేశ్వరి



**తిరుమల,అక్టోబర్ 3ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్స వాలు విజయవంతంగా నిర్వహించిన టిటిడి బోర్డు, అధికారులు, సహకరించిన భక్తులకు అభినందనలు తెలిపారు బిజెపి ఎంపి దగ్గుబాటి పురందేశ్వరి. తిరుమలకు వచ్చి భగవంతుడ్ని దర్శనం చేసుకోవడమేగాక క్రమశిక్షణతో మెలగి, ఆ దేవుని వాహనసేవలను వీక్షించడంలో భక్తులు కూడా ఎంతో సంయమనం పాటించడం శుభపరిణామమన్నారు. దేవుని ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని వేడుకున్నానని, తప్పుచేసిన వారిని భగవంతుడు శిక్షస్తాడని ఆమె అన్నారు. శుక్రవారం ఉదయం ఎంపి పురేందేశ్వరి కుటుంబంతో కలసి ఆలయం వద్దకు వచ్చారు. ఆలయ అధికారులు, బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి స్వాగతం పలికి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అదికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. అందరికీ భగవంతుని ఆశీస్సులు ఉండాలని ఆమె ఆకాంక్షించారు.

## బాంబు బెదిరింపుల ఈమెయిల్స్‌తో పుణ్యక్షేత్రాల్లో హైఅలర్ట్ !

### - తిరుపతి, తిరుమల, తిరుచానూరు, శ్రీకాళహస్తిలలో రంగంలోకి బాంబ్‌స్క్వాడ్



**తిరుమల,అక్టోబర్ 3ప్రభాతవార్తప్రతినిధి:** తమిళనాడు చెన్నై నగరంతోబాటు ఆంధ్రప్రదేశ్‌లోని పుణ్యక్షేత్రాలు తిరుమల,తిరుపతి, శ్రీకాళహస్తిల్లో బాంబుబెదిరింపు ఈ మెయిల్స్ తో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ మెయిల్‌ద్వారా గుర్తుతెలియని వ్యక్తులు తిరుపతి నగరానికి బాంబు బెదిరింపు రావడంతో శుక్రవారం ఉదయం తీవ్ర కలకలం సృష్టించింది.నగరాన్ని బాంబులతో పేల్చేస్తామంటూ హెచ్చరికలతో తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, అదనపు ఎస్పీలు రవిమనోహరచారి, వెంకట్రావు, డిఎస్పీలు, బాంబునిర్వీర్యం తనిఖీ సిబ్బంది వెంటనే తిరుపతినగరంలోకి రంగంలోకి దిగారు. తిరుపతితోబాటు తిరుమల, తిరుచానూరు, శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రాల్లో హైఅలర్ట్ ప్రకటించి బాంబుస్క్వాడ్ బృందాలతో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. ఆర్టీసిబస్టాండు, రైల్వేస్టేషన్, అలిపిరి, విష్ణునివాసం, శ్రీనివాసంతోబాటు కపిలతీర్థం ఆలయం, కోర్టు ప్రాంగణం, తిరుపతికి వచ్చే అన్ని ప్రధాన కూడళ్ళలో, ముఖద్వారాల వద్ద నిరంతరాయంగా తనిఖీలు చేస్తున్నారు.

అయినా పోలీసులు అన్ని రకాల ముందు జాగ్రత్తచర్యలు తీసుకుంటున్నా ఈ బాంబు బెదిరింపులతో మరింతగా అప్రమత్తమయ్యారు. ఇప్పటికే పలు రాష్ట్రాలకు బాంబు బెదిరింపు కాల్స్ రావడంతో ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, అనుమానిత వ్యక్తులు, వస్తువులు పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. ప్రజలు ఎలాంటి భయభ్రాంతులకు గురికావద్దని, అనవసరమైన అపోహలకు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. ఐఎస్ఐ మాజీ ఎల్టీటిఇ మిలిటెంట్ల కుట్ర అంటూ ఈ మెయిల్స్ రావడంతో తిరుపతిలో అలర్ట్అయిన పోలీసులు వెంటనే తనిఖీలు చేపట్టారు. ఇప్పటికే తిరుమల శ్రీవారి బ్రహ్మోత్స వాల సమయంలో పోలీసు యంత్రాంగం భారీ భద్రత,అనూహ్యరీతిలో తనిఖీలు చేపట్టిన విషయం విదితమే.

4-10pg6exHMNWJQE MN 10_4-10pg6exHMNWJQE.qxd 10/3/2025 11:35 PM Page 1



# అమ్మా భవాని... వెన్నంటి ఉండు తల్లి!

## ముగిసిన విజయదశమి ఉత్సవాలు



శ్రీరాజరాజేశ్వరి దేవి

**విజయవాడ, అక్టోబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా దసరాను ప్రజలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. నిన్నటితో ఈ ఉత్సవాలు ముగిసాయి. విజయదశమి రోజు అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. 11 అలంకరణలతో పూజలందుకున్న జగన్మాత చివరిరోజు శ్రీ రాజరాజేశ్వరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శాస్త్రోక్త పూజల తర్వాత కలశ ఉద్వాసన ఇతర వైదిక కార్యక్రమాలతో ఉత్సవాలు పరిసమాప్తమయ్యాయి. కనకదుర్గ మాల ధారులు ఇరుముడులతో వచ్చి అమ్మవారిని దర్శించుకొని దీక్ష విరమించారు. తలనీలాలు సమర్పించారు. ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి, ఎంపీ కేశినేని శివనాథ్ నటుడు శర్వానంద్ అమ్మవారి సేవలో పాల్గొన్నారు. నెల్లూరులో రాజరాజేశ్వరీ, కన్యకాపరమేశ్వరీ ఆలయాలతో పాటు జొన్నవాడ, పెంచలకోనలోని అమ్మవారి ఆలయాలు కిటకిటలాడాయి. మహిషాసుర మర్ధిని ఆలంకరణలో దర్శనమిచ్చారు. మహిళలు జమ్మి చెట్టుకు పూజలు చేశారు. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారిని రూ.30 లక్షల విలువైన కరెన్సీ నోట్లతో అలంకరించారు.

అనంతపురం జిల్లా తాడిపత్రిలో శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో పార్వతి దేవి విజయదుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కర్నూలులో దసరా పండుగను భక్తి శ్రద్దలతో జరుపుకున్నారు. నగరంలోని జమ్మిచెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. బుధవారపేట వద్దనున్న జమ్మిచెట్టు చూట్టూ భక్తులు వాహనాలతో ప్రదక్షిణలు చేసారు. ఏలూరులో ఆలయాలు దుర్గమ్మ నామస్మరణతో మార్మోగాయి. సత్రంపాడులోని సౌభాగ్యలక్ష్మి ఆలయానికి భక్తులు తరలివచ్చారు. అంబికానగర్‌లోని అంబికా దేవి ఆలయం పడమర వీధిలోని పెద్దమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. జంగారెడ్డిగూడెంలో శ్రీ గంగానమ్మ అమ్మవారి ఆలయానికి వేలాదిగా భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు.

పశ్చిమగోదావరి జిల్లా తణుకులో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి, శ్రీకనకదుర్గ అమ్మవారు రాజరాజేశ్వరి అలంకారంలో దర్శనమిచ్చారు. దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేసే విజయరూపిణి అయిన అమ్మవారిని ఆరాధిస్తే సకల శుభాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మండపాకలో వేంచేసియున్న ఎల్లారమ్మ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో విజయదశమి పర్వదినాన్ని ఘనంగా చేసుకున్నారు. రాజమహేంద్రవరం దేవీ చౌక్‌లో బాలాత్రిపురసుందరీ దేవి అమ్మవారి 92వ దసరా మహోత్సవాలు వైభవంగా సాగాయి. ఉండ్రాజవరం మండలం పాలంగిలో రాజరాజేశ్వరి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు కుంకుమ, గాజులతో పూజలు చేశారు. కాకినాడ జిల్లా ముమ్మిడివరంలో దుర్గామాతకు ప్రత్యేక పూజలు జరిగాయి. కేంద్రపాలిత యానాం గోపాల్‌నగర్‌లో సరస్వతీదేవి రూపంలో సర్వాలంకరణ భూషితురాలైన అమ్మవారు భక్తులకు అభయప్రదానం చేశారు. కోనసీమ జిల్లా ముమ్మిడివరంలో దుర్గామాతను 18 రకాల కూరగాయలతో శాకాంబరిగా అలంకరించారు. అంబాజీపేట, అయినవిల్లి, మామిడికుదురు, పి గన్నవరం మండలాల్లోని అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో దుర్గా మల్లేశ్వరి అమ్మవారిని స్పీకర్ అయ్యన్న పాత్రుడు దర్శించుకున్నారు.



కనకాచలంపై వెలసిన దుర్గమ్మకు శాంతి అభిషేకాలు

# దుర్గమ్మకు శాంతి అభిషేకాలు

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 3 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా కనకాచలంపై వెలసిన కనకదుర్గమ్మకు శుక్రవారం శాంతి అభిషేకాలు జరిపారు. దసరా ఉత్సవాలను 10రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించారు. దసరా చివరి రోజు అమ్మవారికి ఆలయ కార్యనిర్వాహణాధికారి డి.బాపిరెడ్డి ప్రత్యేకంగా సారెను అందించారు. కాగా శుక్రవారం అమ్మవారికి శాంతతి అభిషేకాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి ఆలయ సూపరింటెండెంట్ సారధ్యంలో ప్రత్యేకంగా శాంతి అభిషేకాలకు సంబంధించిన సుగంధ ద్రవ్యాలను తీసుకొచ్చారు. ఆలయం నుంచి తేరువీధి గుండా సారెను మేళ తాళాలు మంగళవాయిద్యాలతో ఊరేగింపు జరిపారు. 360మెట్ల మీద ఎక్కి అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు జరిపారు. అలాగే కనకాచలంపై వెలసిన దుర్గమ్మ ఆలయం ఎదురుగా కలశస్థాపన చేసారు. ఆలయ పారోహితులు అర్ధగిరి స్వామి వేద మంత్రాలను పఠిస్తుండగా ఉప ప్రధానార్చకులు దక్షిణామూర్తి, ఆలయ పూజారి తులసీ శర్మలు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. భవాని మాల ధరించిన మహిళా భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారి స్తోత్తాన్ని పఠిస్తుండగా శాస్త్రోక్తంగా శాంతి పూజలు నిర్వహించారు. కలశాన్ని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు జరిపారు. ఆ కలశ నీటితో అమ్మవారికి అభిషేకించారు. ఈ కార్యక్రమాల్లో చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య, సూపరింటెండెంట్ రవి, కడప సుదర్శనం, రమేష రాజు, సిద్దులయ్య తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరులో మెడికల్ విద్యార్థిని ఆత్మహత్య



**నెల్లూరు, అక్టోబర్ 3 ప్రభాతవార్త-వైద్యం:** నెల్లూరు ఏసీఎస్ఆర్ ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థిని బన్నెల గీతాంజలి (20) శుక్రవారం ఉదయం హాస్టల్‌లోని తన గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. దసరా హాలిడేస్ అనంతరం గురువారం సాయంత్రం ఆమె మెడికల్ కాలేజీలోని హాస్టల్‌కు చేరుకుంది. ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం విద్యార్థులు ప్రాక్టికల్స్ ఉన్న నేపథ్యంలో గీతాంజలి గురువారమే హాస్టల్‌కి చేరుకుంది. నలుగురు విద్యార్థులు ఉండాల్సిన గదిలో తన తోటి విద్యార్థినితో పాటు ఇద్దరే ఉన్నారు. శుక్రవారం ఉదయం 9గంటలకు బ్రేక్‌ఫాస్ట్ పూర్తయి విద్యార్థులంతా ప్రాక్టికల్స్‌కి చేరుకున్నారు. గీతాంజలి కూడా అందరితో పాటు సంతోషంగా టిఫిన్ చేసింది. గీతాంజలిని తన స్నేహితురాలు ప్రాక్టికల్స్‌కు రమ్మని పిలువగా, తాను మళ్ళీ వస్తానంటూ గదిలోనే ఉండిపోయింది. కాసేపటి అనంతరం కేర్ టేకర్స్ హాస్టల్ గదుల్లో ఎవరైనా ఉన్నారేమోనని పరిశీలించగా గీతాంజలి తన హాస్టల్ రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించింది. నాలుగవ పట్టణ పోలీసులు హుటాహుటిన అక్కడకు చేరుకుని మృతదేహాన్ని కిందకి దించి పరిశీలించగా, అప్పటికే ఆమె మృతి చెందినట్లు గ్రహించారు. గీతాంజలి తల్లి దండ్రులకు సమాచారం అందించి ఆమె మృతికి గల కారణాలపై వివరాలు సేకరిస్తున్నారు. గీతాంజలికి అనారోగ్యంగా ఉండడంతో గురువారం వైద్యం అందించి, కళాశాలకు పంపినట్లు ఆమె తల్లిదండ్రులు నుంచి సమాచారం అందిందని పోలీసులు తెలిపారు. ఆరోగ్యం సరిగా లేని నేపథ్యంలో గీతాంజలి ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందిందా మరేమైనా ఇతర కారణాలున్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఏదీ ఏమైనా ఇంటి నుండి కళాశాలకు వచ్చిన రెండో రోజే గీతాంజలి మృతి చెందడంతో మెడికల్ కళాశాల హాస్టల్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

# గాంధీ కొండ గొప్ప విజ్ఞాన వికాస కేంద్రం

● దశల వారీగా కొండ అభివృద్ధికి చర్యలు ● స్వాతంత్ర్య సమరంలో విజయవాడ పాత్రకు గాంధీకొండ గొప్ప దర్పణం



గాంధీ పర్వతంపై డా. జి.వి.పూర్ణచందు రాసిన ఆంధ్రగాంధీయం పుస్తకాలను ఆవిష్కరించిన ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, యలమంచిలి సుజనా చౌదరి, కలెక్టర్ లక్ష్మీశ

**విజయవాడ, అక్టోబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** సమష్టి కృషితో గాంధీ కొండ చారిత్రక ఔన్నత్యానికి పునర్వైభవం వచ్చిందని పలువురు రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర సమరయోధులు అన్నారు. 50 రోజుల్లోనే ఆధునీకరణ పనులతో కొండ కొత్త శోభను సంతరించుకుందన్నారు. అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ, సమష్టి కృషితో దశల వారీగా కొండ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. 156వ గాంధీ జయంతి వేడుకలు నగరంలోని గాంధీ హిల్స్‌పై జరిగాయి. ఈ కార్యక్రమంలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశతో పాటు గాంధీ హిల్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొని మహాత్మునికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ విజయవాడ ఎంత సుందర నగరమో గాంధీహిల్ పైనుంచి చూస్తే తెలుస్తుందన్నారు. వైబ్రెంట్ విజయవాడ నినాదంతో నగర అభివృద్ధికి కృషిచేస్తున్నామని పేర్కొన్నారు. గాంధీ హిల్ ఫౌండేషన్ ఛైర్మన్ డా. గాంధీ పీసీ కాజా మాట్లాడుతూ... స్వల్ప వ్యవధిలోనే లిఫ్ట్, ర్యాంప్, హరిత విస్తీర్ణం పెంపు, సుందరీకరణ, వ్యూ పాయింట్, టాయ్ ట్రెయిన్ ట్రాక్ మరమ్మతులు తదితర అభివృద్ధి పనులను పూర్తిచేశామని తెలిపారు. మహాత్ముని ఆశయాల స్ఫూర్తితో గాంధీ కొండ గాంధీ గ్లోబల్ సెంటర్‌గా ఎదగాలని కోరుకుంటున్నానని.. దీన్ని సాకారం చేసేందుకు ఫౌండేషన్ చేసే నిర్మాణాత్మక కృషిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ... గాంధీ కొండ వెనుక విజయవాడ చారిత్రక ఔన్నత్యం ఉందని పేర్కొన్నారు. స్వాతంత్ర్య పోరాటం పరంగా విజయవాడ పాత్రకు గాంధీ కొండ గొప్ప దర్పణమని పేర్కొన్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు సుజనా చౌదరి మాట్లాడుతూ... యువతలో దేశభక్తిని పెంపొందించేందుకు, సన్మార్గంలో నడిపించేందుకు గాంధీ కొండ నాంది కావాలన్నారు. ఇదో విజ్ఞాన కేంద్రంగా భాసిల్లాలని కోరుకుంటున్నట్లు శాసనసభ్యులు సుజనా చౌదరి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ... గాంధీ కొండ గొప్ప విజ్ఞాన కేంద్రమని, మహాత్ముని ఆశయాల స్ఫూర్తిగా ముందడుగు వేసేందుకు ఇదో గొప్ప వేదికని అన్నారు. ఈ మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా నివాళి అర్పించారు. డా. రావి శారద రాసిన తెలుగు నేలపై గాంధీజీ అడుగుజాడలు, డా. జి.వి.పూర్ణచందు రాసిన ఆంధ్ర గాంధీయం పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గాంధీ హిల్ ఫౌండేషన్ కార్యదర్శి వై.రామచంద్రరావు, గాంధీ హిల్ ఫౌండేషన్ మాజీ ఛైర్మన్ గోకరాజు గంగరాజు, ఏపీ గాంధీ స్మారక నిధి వైస్ ఛైర్మన్ డా. చక్రపాణి, గాంధీ హిల్ ఫౌండేషన్ వైస్ ఛైర్మన్ డా. జంధ్యాల శంకర్, ఫౌండేషన్ సలహాదారులు కేవీఎల్ హరినాథ్, ప్రొఫెసర్ బి.పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

# 6న స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానం

● స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎండీ వెల్లడి

**విజయవాడ, అక్టోబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** స్వచ్ఛభారత్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రధానం చేస్తున్న స్వచ్ఛ్ సర్వేక్షణ్ అవార్డుల తరహాలో రాష్ట్ర స్థాయిలో స్వచ్ఛాంధ్ర అవార్డులను ఈ నెల 6వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అందజేయనున్నట్లు శుక్రవారం స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ బి. అనీల్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేసారు. రాష్ట్ర స్థాయిలో అనంతపురం జిల్లా స్వచ్ఛ జిల్లాగా అవార్డుకు ఎంపికయ్యిందన్నారు. రాష్ట్ర స్థాయిలో 69 మంది, జిల్లా స్థాయిలో 1,257 మంది, మొత్తంగా 1,326 మంది విజేతలకు బహుమతులు అందజేయ నున్నారన్నారు. ఒకటి నుంచి మూడు లక్షల జనాభా ఉన్న పట్టణాల విభాగంలో గుంటూరు జిల్లాలోని మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్, అనంతపురం జిల్లా తాడిపత్రి మున్సిపాలిటీ, విజయనగరం జిల్లా బొబ్బిలి మున్సిపాలిటీలు అగ్రస్థానాల్లో నిలిచాయని అన్నారు. 50,000 లోపు జనాభా ఉన్న పట్టణాల విభాగంలో చిత్తూరు జిల్లా పలమనేరు మునిసిపాలిటీ, కుప్పం మున్సిపాలిటీ, నెల్లూరు జిల్లా ఆత్మకూరు మునిసిపాలిటీ గుర్తింపు పొందాయని తెలిపారు. ఈ నెల 6న నగరంలోని తుమ్మలపల్లి కళా క్షేత్రంలో సాయంత్రం 4గంటలకు అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ బి. అనిల్ కుమార్ రెడ్డి తెలియజేశారు.

# దసరా కార్నివాల్ ... గిన్నెస్ బుక్ రికార్డు



దసరా కార్నివాల్ డప్పు కళాకారులు సాధించిన గిన్నిస్ బుక్ అవార్డును స్వీకరిస్తున్న సీఎం చంద్రబాబు



**విజయవాడ. అక్టోబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకుని భావితరాలకు అందివ్వాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. విజయవాడ నగరంలో గత 11 రోజుల నుంచి విజయవాడ ఉత్సవ్ పేరుతో జరుగుతున్న వివిధ కార్యక్రమాల్లో సీఎం పాల్గొన్నారు. దసరా వేడుకల్లో భాగంగా చేపట్టిన సాంస్కృతిక సంబరాల్లో భాగంగా ఇందిరా గాంధీ స్టేడియం నుంచి బెంజ్ సర్కిల్ వరకూ సాంస్కృతిక కవాతు నిర్వహించారు. ఈ కవాతును ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించారు. సుమారు 3 వేల మందితో వివిధ కళా రూపాలు, నృత్యాలతో భారీ ఎత్తున కవాతు జరిగింది. ఇక వేల మంది కళాకారులతో నిర్వహించిన దసరా కార్నివాల్ గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించింది. అత్యధిక మంది డప్పు కళాకారులు పాల్గొన్న వేడుకగా గుర్తింపు పొందింది. ప్రశంసా పత్రాన్ని గిన్నిస్ బుక్ ప్రతినిధులు సీఎం చంద్రబాబుకు అందజేశారు.

అనంతరం గొల్లపూడి ఎక్స్‌పో గ్రౌండ్సులో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ముఖ్యమంత్రి సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ఎక్స్ పోలో ఏర్పాటు చేసిన ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్సుతో కూడిన రోబో కిచెన్ విశేషాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... "సంక్షేమం, అభివృద్ధి అవసరం... అదే సమయంలో మానసిక ఆనందం కూడా అవసరమే. మన సంస్కృతీ సంప్రదాయాలు కాపాడుకోవాలి. మానసికంగా ప్రజలకు ఉల్లాసం ఉండాలి. నృత్య రీతులు, సంగీతం, సాహిత్యం, కళలు అన్నీ మన సంస్కృతిలో భాగం. కనుమరుగవుతున్న ఇలాంటి కళల్ని కాపాడుకోవాలి. వారసత్వంగా వచ్చిన ఈ కళలను భావితరాలకు అందివ్వాలి" అని సీఎం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్, కలెక్టర్ జి.లక్ష్మీశ, నగర పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. రహదారిపై రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ మళ్లింపు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయారు. భద్రతను దృష్టిలో ఉంచుకుని అదనపు సిబ్బందిని నియమించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి వాసు, పాలచూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమజంటలు, ఒంటరి అమ్మాయిలే టార్గెట్

● గోప్యతను వీడియో తీసి ఆపై బెదిరించడం
● మైనర్ బాలిక అత్యాచార ఘటనలో ముగ్గురు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు



**చిత్తూరు, అక్టోబర్ 3 ప్రభాతవార్త:** చిత్తూరు మురకంబట్టు నగరవనం పార్కు పరిసరాల్లో ప్రేమజంటలు, ఒంటరి అమ్మాయిలను లక్ష్యంగా చేసుకుని వారి గోప్యతను వీడియోలు తీసి వారిని బెదిరించి వారి వద్ద వున్న నగదు దోచుకోవడంతో పాటు వారిని శారీరకంగా అనుభవించడమే మైనర్ బాలిక అత్యాచారం కేసులో అరెస్టైన నిందితుల వృత్తి అని చిత్తూరు డిఎస్పీ సాయినాధ్ పేర్కొన్నారు. మురకంబట్టు నగరవనంలో అత్యాచారంకు గురైన మైనర్ బాలిక కేసులో ముగ్గురు నిందితులను శుక్రవారం చిత్తూరు తాలుకా పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలను డిఎస్పీ సాయినాధ్ శుక్రవారం చిత్తూరు జిల్లా పాత పోలీసు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. నిందితులైన చిత్తూరు మురకంబట్టు జికెనగర్‌కు చెందిన ఎం.మహేష్ అలియాస్ కట్టమంచి మహేష్(21), మురకంబట్టు ఎం.ఆగ్రహారంకు చెందిన పి.కిషోర్(31), సంతపేట మంగసముద్రంకు చెందిన జె.హేమంత్ ప్రసాద్(27)లను పోలీసులకు అందిన సమాచారం మేరకు శుక్రవారం చిత్తూరు నగరంలోని చెన్నమగుడిపల్లి రహదారి వద్ద వాకర్స్ అసోసియేషన్ నిర్మించిన యోగ అరుగుల సమీపంలో అరెస్టు చేశామన్నారు. ఈ కేసులో నిందితుడైన మహేష్ 2019 సంవత్సరంలో చిత్తూరు తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మైనర్ అమ్మాయిని ఈవ్‌టీజింగ్ చేసిన కేసులో నిందితుడిగా వున్నాడన్నారు. అలాగే మరో నిందితుడు కిషోర్ 2022 సంవత్సరంలో నగరంలోని ఓ వైన్ షాపులో పని చేస్తూ షాపులోని మద్యంను బ్లాక్‌లో విక్రయిస్తున్నాడని కేసు నమోదు అయ్యిందన్నారు. ఈ కేసులోని నిందితులు ముగ్గురు కాలక్షేపం కోసం పార్కులకు వచ్చే ప్రేమజంటలను లక్ష్యంగా చేసుకుని వారి గోప్యతను వీడియోలు తీసి వారిని బెదిరించి వారి వద్ద వున్న నగదును దోచుకుని వారిని శారీరకంగా అనుభవించడం వీరి నేర ప్రవృత్తి అని తెలిపారు. నిందితులను అరెస్టు చేసిన పోలీసులు వారి వద్ద వున్న సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.



# కొడుకును రోకలిబండతో చంపేశాడు!

**విడవలూరు (నెల్లూరు), అక్టోబర్ 3 ప్రభాతవార్త:** మద్యం మత్తులో పట్టపగలే కన్న కొడుకును కన్న తండ్రి అతి దారుణంగా హత్య చేసిన సంఘటన నెల్లూరు జిల్లా విడవలూరు మండలం ముదివర్తి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి నిందితుడు తాండ్ర రవికుమార్ కుమారుడు ప్రేమ్ చందు(19) హత్యకు గురయ్యాడు. నిందితుడు నిత్యం మద్యం సేవించి భార్య సుప్రజతో గొడవలు పడుతూ ఉండేవాడు. వీరి మధ్యలో ప్రేమ్ చందు సర్దుబాటు చేసేవాడు ప్రేమ చందు శుక్రవారం నిద్రిస్తున్న సమయంలో తలపై తండ్రి రవికుమార్ రోకలి బండతో కొట్టడంతో అక్కడికక్కడే రక్తమడుగులో మృతి చెందాడు. బయటకు వెళ్లి వస్తున్న తల్లి ఘోరమైన ఘటనను చూసి కేకలు వేయడంతో నిందితుడు పరారయ్యాడు. స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మృతుడు తల్లి కన్నీరు మున్నీరయ్యారు. విషయం తెలుసుకున్న రూరల్ డి.ఎస్.పి ఘట్టమనేని శ్రీనివాసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారించారు. నిందితుడిని అదుపులకు తీసుకుని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించి కోవూరు సీఐ సుధాకర్ రెడ్డి, ఎస్సై నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అంబేద్కర్ విగ్రహానికి నిప్పు

● చిత్తూరు జిల్లా దేవళంపేటలో ఘటన ● దోషులను శిక్షించాలని రోడ్డెక్కిన దళిత సంఘాలు ● సీఎం సీరియస్... విచారణకు ఆదేశం ● సంఘటనా స్థలానికెళ్ళి కలెక్టర్, ఎస్పీ విచారణ



**చిత్తూరు, అక్టోబర్ 3 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం దేవళంపేటలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండుగలు నిప్పు పెట్టారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన విషయం తెల్లవారుజాముకు రాష్ట్ర వ్యాప్తంగా తెలియడంతో దళిత సంఘాలు రోడ్డెక్కాయి. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన వారిని సత్వరం అరెస్టు చేయాలని డిమాండ్‌తో జిల్లా వ్యాప్తంగా ధర్నాలు నిర్వహించాయి. సంఘటన జరిగిన దేవళంపేటకు శుక్రవారం తెల్లవారుజాము కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుషార్ డూడిలు చేరుకుని ప్రత్యక్షంగా విచారణ చేపట్టారు.

ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. దేవళంపేట గ్రామంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి సమీపంలోని గుడిసెకు రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో ప్రక్కనే వున్న అంబేద్కర్ విగ్రహానికి నిప్పు అంటుకుంది. ఈ ఘటనలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం కింది భాగం ఎక్కువగా కాలిపోయింది. ఈ విషయం విస్తృతంగా ప్రచారం కావడంతో దేవళంపేటకు అత్యధిక సంఖ్యలో దళిత సంఘాలు చేరుకుని ఆందోళన చేపట్టారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన దోషులను పట్టుకుని సత్వరం శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విప్ డాక్టర్ విఎం థామస్, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లు సంఘటనా స్థలం చేరుకుని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన వారిని గుర్తించి అరెస్టు చేయాలని పోలీసులను కోరారు. మరోవైపు మాజీ మంత్రి నారాయణస్వామి సంఘటనా స్థలం చేరుకుని దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన విషయంపై పంచాయతీ కార్యదర్శి రఘు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### సీఎం ఆరా... విచారణకు ఆదేశం

విజయవాడ, అక్టోబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి: చిత్తూరు జిల్లాలో అంబేద్కర్ విగ్రహానికి మంటలు అంటుకున్న ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరా తీసారు. ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశిస్తూ, నేతల విగ్రహాలకు అవమానం జరిగేలా ఎవరు ప్రవర్తించినా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సీఎం చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు.

### కఠిన చర్యలు తప్పవు

రాజ్యాంగ నిర్మాత డా. బి. ఆర్ అంబేద్కర్‌కి అవమానం చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి హెచ్చరించారు. అంబేద్కర్ విగ్రహానికి మంటలు అంటుకున్న ఘటనను మంత్రి స్వామి తీవ్రంగా ఖండించారు. ఘటన జరగడం దురదృష్టకరం, జిల్లా ఎస్పీ, కలెక్టర్ ఇప్పటికే సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. దోషులు ఎవరైనా వదిలే ప్రసక్తే లేదు, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌కి అవమానం చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవు అని మంత్రి పేర్కొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి నిప్పు

# జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఎంపీ గురుమూర్తి ఫిర్యాదు

**వెంకటగిరి, అక్టోబర్ 3, ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం దేవళంపేట గ్రామంలో అక్టోబర్ 2న గుర్తు తెలియని వ్యక్తులు డా. బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన ఘటనపై తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై తక్షణమే విచారణ జరిపి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ జాతీయ ఎస్సీ కమిషన్ ఫిర్యాదు చేసారు. ఇది కేవలం విగ్రహ ధ్వంసం మాత్రమే కాదు, దళితుల గౌరవం, ఆత్మగౌరవం, రాజ్యాంగ హక్కులపై నేరుగా దాడి అని ఎంపీ ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామస్తులు తమ సొంత కృషితో, ఆర్థిక సహకారంతో విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారని, దానిని ధ్వంసం చేయడం దళిత సమాజానికి తీవ్ర ఆవేదన కలిగించిందని అన్నారు. ఈ ఘటనకు ముందే కొంతమంది రాజకీయ నాయకులు విగ్రహ స్థలంపై అభ్యంతరాలు వ్యక్తం చేసి, తొలగించాలని హెచ్చరించారని ఆయన ప్రస్తావించారు. ఇలాంటి సంఘటనలు ఆంధ్రప్రదేశ్‌లో పదేపదే చోటు చేసుకోవడం ఆందోళనకరమని, డా. అంబేద్కర్ విగ్రహాలపై దాడులు అణగారిన వర్గాల్లో నమ్మకాన్ని దెబ్బతీస్తున్నాయని ఎంపీ గురుమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటనపై ఎస్సీ కమిషన్ సుమోటోగా తీసుకుని, పక్షపాతం లేకుండా సమగ్ర విచారణ జరిపి, నిందితులను శిక్షించడమే కాకుండా ధ్వంసమైన విగ్రహాన్ని తిరిగి నిర్మించాలని ఎంపీ గురుమూర్తి విజ్ఞప్తి చేశారు. ఈ ఘటన దళితుల గౌరవాన్ని అవమానపరచడమే కాక ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని లేఖలో స్పష్టం చేశారు.

## వేణుగోపాలస్వామి దసరా వేడుకలు

ప్రత్తిపాడు అక్టోబర్ 3(ప్రభాత వార్త): మండల పరిధిలోని జూనం చుండూరు గ్రామంలో దసరా పండుగ సందర్భంగా పురాతనమైన సమ్మోహన వేణుగోపాల స్వామివారి దేవాలయంలో వేడుకగా జరిగిన దసరా ఉత్సవాలు ముగింపు కార్యక్రమంలో భాగంగా స్వామివారి గ్రామోత్సవం ఆలయ అర్చకులు తరిమిష శ్రీధర్ ఆధ్వర్యంలో భక్తులు,గ్రామస్తులు,యువకులు పాల్గొని ఘనంగా నిర్వహించారు.వివరాల్లోకి వెళితే1500 సంవత్సరముల పూర్వ చరిత్ర కలిగిన సమ్మోహన వేణుగోపాల స్వామికి ఈ గ్రామంలో సంప్రదాయ బద్ధంగా ప్రతి ఒక్కరు పండుగలను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది

## హంసవాహనంపై ఆదిదంపతుల విహారం

**ఇంద్రకీలాద్రి, అక్టోబర్ 3 ప్రభాతవార్త:** అమ్మలగన్న అమ్మ బెజవాడ దుర్గమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. విజయ దశమి పర్వదినాన ఆదిదంపతులు హంసవాహనంపై పవిత్ర కృష్ణానదిలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజాది కాలు నిర్వహించిన అర్చకస్వాములు శ్రీ స్వామి అమ్మవార్లకు ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. దుర్గమ్మవారిని బాట్మింటన్ క్రీడాకారిణి పివి సింధు దంపతులు, కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు.

## కారంపూడి మండలంలో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి పర్యటన



కారంపూడి, అక్టోబరు 3 ప్రభాతవార్త: మాచర్లమాజీ ఎమ్మెల్యే వైసీపీ పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి శుక్రవారం కారంపూడి మండలంలో పర్యటించారు ముందుగా చింతపల్లి చేరుకొని వైసీపీ నాయకులు పంగులూరి రామకృష్ణయ్య నివాసంలో శుభకార్యంలో పాల్గొని నూతన వధువును ఆశీర్వదించారు. కారంపూడి స్టేట్‌బ్యాంకు సెంటర్‌లో సీనియర్ వైసీపీ నాయకుడు, పల్నాడు జిల్లా మాజీవక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అక్బర్‌జానీ బాషాను పరామర్శించారు అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

## ఆరోగ్యాంధ్రనే కూటమి ప్రభుత్వ ధ్యేయం

వెల్దుర్తి, అక్టోబరు 3 ప్రభాతవార్త: ఆరోగ్యాంధ్రనే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి స్పష్టం చేశారు. శనివారం వెల్దుర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 66 మంది లబ్ధిదారులకు రూ.47 లక్షల 72 వేలు విలువచేసే ముఖ్యమంత్రి సహాయ నిధి నగదు చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యం, సంక్షేమం రెండు కళ్లుగా భావించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పలు మండలాల కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దశాబ్దాలుగా పడకేసిన మౌళిక వసతులకు మోక్షం
## రూ.1.35 కోట్ల నిధులతో పనులకు శ్రీకారం

వెల్దుర్తి, అక్టోబరు 3 ప్రభాతవార్త: వెల్దుర్తి మండల కేంద్రంలో దశాబ్దాలుగా పడకేసిన మౌలిక వసతులకు కూటమి ప్రభుత్వంలో మోక్షం లభిస్తోంది. దాదాపు రూ. కోటి 35 లక్షల నిధులు మంజూరుకావడంతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పొలంబాటల అభివృద్ధి పనులకుశ్రీకారం చుట్టారు. చెంచుకాలనీలో సీసీ రోడ్లకు రూ.20 లక్షలు, గ్రామంలో సీసీ రోడ్లకు రూ.65 లక్షలు, నడిమి డొంక పొలం బాటకు రూ.15 లక్షలు, గొట్టిపాళ్ల డొంక పొలం బాటకురూ.25 లక్షల నిధులతో ప్రారంభమైన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి గురువారం సమీక్షించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ సీనియర్ నాయకులు జూలకంటి చిరంజీవిరెడ్డి, వెంకటరెడ్డి, యువ నాయకులు జూలకంటి అక్కిరెడ్డి, జూలకంటి నాగార్జునరెడ్డి, కేశిరెడ్డి హనిమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పుష్కరాల నాటికి పోలవరం పూర్తి

● 2026 జనవరి కల్లా ఎడమ కాలువ పనులు పూర్తి కావాలి ● ఈ నవంబరు నుంచే ప్రధాన డ్యామ్ పనులు మొదలెట్టండి ● సమీక్షలో అధికారులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం



**విజయవాడ, అక్టోబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి కావాలనే లక్ష్యంతో పనులు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను, కాంట్రాక్టు సంస్థలను ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా లక్ష్యానికి అనుగుణంగా వేగంగా పనులు పూర్తి చేయాలని సీఎం సూచించారు. సచివాలయంలో శుక్రవారం పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. కేంద్ర జలసంఘం, నిపుణుల కమిటీ నుంచి ఎప్పటికప్పుడు ప్రాజెక్టు పనులపై అనుమతులు తీసుకుని పనుల్ని పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ వద్దని ముఖ్యమంత్రి అధికారులకు సూచనలు జారీ చేశారు. డయాఫ్రం వాల్ మొత్తం 63,656 క్యూబిక్ మీటర్లకు గానూ 37,302 క్యూబిక్ మీటర్ల మేర పనులు పూర్తి అయ్యాయని అధికారులు వివరించారు. బట్రస్ డ్యామ్ పనులు వందశాతం పూర్తి అయినట్టు తెలిపారు. వైబ్రో కాంపాక్షన్ పనులు కూడా 74 శాతం మేర పూర్తైనట్టు సీఎంకు తెలియచేశారు. ఈ ఏడాది డిసెంబరు నాటికి డయాఫ్రం వాల్ పనులు పూర్తి కావాలని సీఎం స్పష్టం చేశారు. ప్రాజెక్టులో ప్రధాన డ్యామ్ ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ పనుల్ని నవంబరు 1 నుంచే ప్రారంభించాలన్నారు. 2027 డిసెంబరుకు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పోలవరం కుడి కాలువను అనుసంధానించే సొరంగాల నిర్మాణం, ఎడమ కాలువకు అనుసంధానం చేసేలా అప్రోచ్ ఛానల్, హెడ్ రెగ్యులేటర్, ఇరిగేషన్ టన్నెల్, కేఎల్ బండ్‌లను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

ప్రధాన ఎడమ కాలువను 2026 జనవరి నాటికల్లా అనకాపల్లి వరకూ పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ, నిర్వాసితులకు పరిహార, పునరావాసాన్ని నిర్దేశిత గడువు లోగా పూర్తి చేయాలని అధికారులకు సూచనలు జారీ చేశారు.

### పోలవరం వద్ద పర్యాటక ఆకర్షణలు

దేశంలోనే అత్యుత్తమ ప్రాజెక్టుగా నిర్మిస్తున్న పోలవరం వద్ద పర్యాటకులను ఆకర్షించేలా నిర్మాణాలు ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రాజెక్టు నుంచి భద్రాచలం, పాపికొండలు, దిగువన ధవళేశ్వరం వరకూ వివిధ ప్రాంతాలను అద్భుతంగా తీర్చిదిద్దాలన్నారు. పోలవరం ప్రాజెక్టు కనెక్టివిటీ కింద ఐకానిక్ రోడ్డు నిర్మించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. దీనిని జాతీయ రహదారికి అనుసంధానించేలా చూడాలన్నారు. రాజమహేంద్రవరం కేంద్రంగా పర్యాటకాన్ని అభివృద్ధి చేసేలా అఖండ గోదావరి ప్రాజెక్టును చేపట్టాలన్నారు. పోలవరం ప్రాజెక్టులో పనుల పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునేలా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ఆర్టీజీఎస్‌కు అనుసంధానించాలని సూచించారు. వచ్చే వర్షాకాల సీజన్‌లోగా వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ఈ సమీక్షకు సీఎస్ కె.విజయానంద్, జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# పంటల నష్టాన్ని ప్రాథమికంగా అంచనా వేయాలి

**- వ్యవసాయ, హార్టికల్చర్ ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు**



**విజయవాడ, అక్టోబర్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ఒడిశాలోని గోపాల్‌పూర్ సమీపంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో విస్తృతంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు శుక్రవారం వ్యవసాయ, హార్టికల్చర్ ఉన్నతాధికారులతో అత్యవసర టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా పంటలు దెబ్బతినే అవకాశం ఉందని, వ్యవసాయ మరియు హార్టికల్చర్ అధికారులు తక్షణమే ఫీల్డ్‌లోకి దిగి పంటల నష్టాన్ని ప్రాథమికంగా అంచనా వేయాలని ఆదేశించారు. అవసరమైతే ఇతర జిల్లాల సిబ్బందిని కూడా ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాలకు తరలించి పంటల అంచనాలు వేయడంలో, రైతులకు సహాయం చేయడంలో వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. వాయుగుండం ప్రభావం తగ్గిన తరువాత ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉందని అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలపై స్పష్టమైన సూచనలు అందించాలంటూ వ్యవసాయ శాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు. కాల్వలు, చెరువులకు గండ్లు పడకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరపాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఏ పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు రెవెన్యూ, విద్యుత్, పోలీస్, ఇరిగేషన్ శాఖలతో సమన్వయంగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రైతులు నష్టపోకుండా ప్రతి ఒక్క అధికారి కట్టుదిట్టమైన పర్యవేక్షణతో పనిచేయాలని మంత్రి సూచించారు. ప్రభుత్వం రైతుల పక్కన నిలబడి ఉంది. వాయుగుండం, వర్షాల ప్రభావం ఎంతటి సవాళ్లను విసిరినా, అధికారులు క్షేత్రస్థాయిలో జాగ్రత్తలు తీసుకుని రైతులకు అండగా నిలవాలని మంత్రి పేర్కొన్నారు.

ఒడిశా, ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాలలో కురుస్తున్న భారీ వర్షాలతో నాగావళి, వంశధార నదులు ఉప్పొంగుతున్న నేపథ్యంలో మంత్రి అచ్చెన్నాయుడు శ్రీకాకుళం, విజయనగరం, మన్యం జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ఫోన్ ద్వారా ప్రస్తుత పరిస్థితిని తెలుసుకున్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని, ప్రాణనష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని మంత్రి అచ్చెన్న అధికారులను ఆదేశించారు. జిల్లాల్లో కంట్రోల్ రూములు 24/7 ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వరద సహాయక చర్యల్లో విడిఆర్ఎఫ్, ఎస్డిఆర్ఎఫ్, పోలీసు, ఫైర్ సిబ్బంది సమర్థంగా, వేగంగా స్పందించాలని మంత్రి స్పష్టం చేశారు. వంశధార, నాగావళి నదుల తీర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరిక సందేశాలు పంపాలని అధికారులను ఆదేశించారు.

## పలువురు కార్యకర్తలను పరామర్శించిన పిన్నెల్లి

విజయపురిసౌత్, అక్టోబరు 3 ప్రభాతవార్త: మాచర్ల మండలం కొప్పునూరు, జవుకుతండా, విజయపురిసౌత్‌లోని పలువురు కార్యకర్తలు, నాయకులను పల్నాడు జిల్లా వైసీపీ అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పరామర్శించారు. అందులో భాగంగా గ్రామానికి చెందిన భవిరి నాగరాజు, చీకురిమెల్లి రాంప్రసాద్, ఇటీవల మరణించిన గ్రామ వలంటీర్ పగిడిమారి ప్రభుకుమార్ (టింకు) వారి ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామానికి చెందిన మట్టపల్లి బ్రహ్మం, మట్టపల్లి రాజ్యం, కొప్పునూరు గ్రామానికి చెందిన కాసు శేఖర్‌రెడ్డి, జోగుతండాకి చెందిన కరంటోత్ జబ్బార్ హాస్పిటల్ నుంచి డిశ్చార్జి అయిన విషయం తెలుసుకొని వారిని పరామర్శించారు. గ్రామానికి వచ్చిన పిన్నెల్లికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు, బాణాసంచాలతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో విజయపురిసౌత్ వైసీపీ అధ్యక్షుడు తంగిరాల రామిరెడ్డి, పోతిరెడ్డి కోటిరెడ్డి, బూడిద శ్రీనివాసరావు, వైసీపీ మహిళా మండలి అధ్యక్షురాలు లాకా వెంకటరమణ, సీనియర్ నాయకులు రామదాసు, మత్స్యకారుల మాజీ ప్రెసిడెంట్ ముసలయ్య, పూరి, ఇస్మాయిల్, అప్పలస్వామి, బాలస్వామి, బూడిద సైదులు, సునీల్, సాగర్ బాబు, సుమన్, బీర్నేడి రమేష్, మల్లె శ్రీను, నారి శ్రీనునాయక్, హసన్, చైతన్య, ఉమెరు, వంశీ, యజ్ఞల కృష్ణ, కొప్పరపు శ్రీను, లక్ష్మీనారాయణ, బ్రహ్మం పలువురు నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు



## తెప్పోత్సవం కార్యక్రమం విజయవంతం

విజయపురిసౌత్, అక్టోబరు 3 ప్రభాతవార్త: దసరా ఉత్సవాల సందర్భంగా స్థానిక రామాలయంలో పూజారి గుడిపూడి బ్రహ్మాచార్యులు ప్రత్యేక పూజల అనంతరం ఆలయ ప్రెసిడెంట్ కోలా వసంతకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సాయంత్రం 6 గంటలకు షెమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు భారీగా పాల్గొన్నారు. అనంతరం పేటరు అమ్మవారి దేవాలయంలో కూడా దసరా పండుగ సందర్భంగా దేవాలయ ధర్మకర్త సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామంలో మొదటిసారిగా తెప్పోత్సవం కార్యక్రమాన్ని కృష్ణానదీ తీరంలో సుందరంగా ఉత్సవ విగ్రహాలను హారతులతో దేవస్థానం ప్రధాన అర్చకులు రామకృష్ణశర్మ పర్యవేక్షణలో వేదోక్తంగా, శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామిని మేళతాళాలతో జలవిహారం చేయించారు. కృష్ణమూర్తి, సత్తిబాబు, పవన్, బాలస్వామి, శివ, నరసింహమూర్తి, సాయి, రామకృష్ణారెడ్డి, శ్రీనివాసరావు, బాష, బాబానాయుడు, నాగరాజు, శంకర్, భజన మండలి పాల్గొన్నారు.

## దసరా పండుగ వేడుకలు చేయలేదంటూ గ్రామస్తుల ఆగ్రహం

కాకుమాను అక్టోబర్ 3(ప్రభాత వార్త): మండల పరిధి గరికపాడు గ్రామంలో శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో గురువారం దసరా సందర్భంగా దసరా పండుగ వేడుకలు చేయలేదంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆలయ పూజారి, ఈవో పండగ చేయన కారణం తెలియజేయాలని గ్రామస్తులు ఆగ్రహం కారణం తెలియాలని పూజారి నీ నిలదీశారు. ఈ వో అందుబాటులో లేని కారణంగా పండుగ జరపలేదని పూజారి సమాధానం చెప్పడంతో ,సరైన కారణం తెలిపి ఇక్కడి నుంచి కదలాలని అంటూ గ్రామస్తులు పూజారిని కట్టడి చేశారు.

## జల నిమగ్నానికి తరలివెళ్లిన దుర్గమ్మ

పెదనందిపాడు అక్టోబర్ 3 (ప్రభాతవార్త). పెదనందిపాడు లో శరన్నవరాత్రుల వేడుకలు ఘనంగా ముగిశాయి. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఏర్పాటు చేసిన దుర్గమ్మ ప్రతిమను శుక్రవారం పూలతో అలంకరించిన ట్రాక్టర్ పై. మహిళల కోలాటంతో పురవీధుల్లో ఊరేగించి. అప్పాపురం కాలంలో నిమగ్నం చేసేందుకు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు దాసరి శేషగిరిరావు. డిఎల్ఎస్ఆర్ ప్రసాద్. శ్రీధర్. వేణు. రామారావు. నాగేశ్వరరావు. రాఘవరావు .వసంతరావు. నాగలక్ష్మి ్మ. సురేఖ. మణిమాల. చంద్రిక. పరమేశ్వరి. తేజ. శ్రీలక్ష్మి ్మ పాల్గొన్నారు.

## సాయి మందిర్ అన్నదానానికి రూ. 50వేల విరాళం

పెదనందిపాడు అక్టోబర్ 3 (ప్రభాతవార్త) పెదనందిపాడు సాయి మందిర్ అన్నపూర్ణాలయంలో ప్రతి గురువారం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి విరాళంగా కాకుమాను మండలం గార్లపాడు కు చెందిన కోట సాంబశివరావు ధనలక్ష్మి ్మ దంపతులు శుక్రవారం సాయి మందిర్ కమిటీ సభ్యులకు 50,000 ఒక్క రూపాయి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా సాయి మందిర్ కమిటీ అధ్యక్షులు డిఎల్ఎస్ఆర్ ప్రసాద్. కమిటీ సభ్యులు కొత్త శేషగిరిరావు. చెన్నుపాటి శ్రీనివాసరావు లు దాత సాంబశివరావు దంపతులను ఘనంగా సత్కరించారు.

## జిఎస్టి తగ్గింపుపై ట్రాక్టర్ల ర్యాలీతో రైతుల హర్షం

పెదనందిపాడు అక్టోబర్ 3 (ప్రభాతవార్త)పెదనందిపాడు మండల వ్యవసాయ అధికారి ఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో శుక్రవారం జిఎస్టి సూపర్ సేవింగ్స్ అనే కార్యక్రమం పై ట్రాక్టర్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఏఓ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రైతులకు 18 పర్సెంట్ జిఎస్టి నుంచి 13 తగ్గి కేవలం 5 మాత్రమే రైతులు చెల్లించవలసి ఉంటుందని తెలిపారు. రైతులు ఆనందంతో నాగులపాడు మార్కెట్ యార్డ్ నుండి 25 ట్రాక్టర్లతో ర్యాలీని పెదనందిపాడు బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీని నిర్వహించారు

# ఇక జనాభా పునరుత్పత్తిపై దృష్టి

● ఫెర్టిలిటీ రేటు 2.1శాతం వృద్ధి చేసేందుకు చర్యలు
● స్థానిక సంస్థల్లో పోటీకి ఎందురు పిల్లలున్నా అర్హులు
● సాగు, తాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయింపు
● ధాన్యం సేకరణ బకాయిల చెలింపునకు కేబినెట్ ఆమోదం
● మంత్రివర్గ భేటీ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి



**విజయవాడ, అక్టోబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలో ఇకపై జనాభా పునరుత్పత్తిపై అత్యంత దృష్టిని పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేసారు. స్థానిక సంస్థల్లో పోటీకి, నీటి సంఘాలకు ఎంపికకు సంబంధించి ఇద్దరు పిల్లల మించి ఉండకూడదనే నిబంధన ఉండేదని ఇప్పుడు ఇక ఆ రూల్ లేదన్నారు. గతంలో అధిక జనాభాను నియంత్రించే క్రమంలో ఇద్దరు పిల్లలు అనే నిబంధనను ఏర్పాటు చేశారని తెలిపారు. మంత్రి పార్థసారథి శుక్రవారం సాయంత్రం తరువాత ఏపీ సమాచార శాఖ సమావేశ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడుతూ 28 సంవత్సరాలు అమలు చేసిన తర్వాత ప్రస్తుతం రాష్ట్రంలో సంతాన ఉత్పత్తి రేటు గణనీయంగా తగ్గింది. ప్రస్తుతం టోటల్ ఫెర్టిలిటీ రేటు 1.6గా ఉంది. ఇది ఇలాగే కొనసాగితే రాష్ట్ర భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది. అందుకే టోటల్ ఫెర్టిలిటీ రేటు కనీసం 2.1 ఉండాలి. ఇద్దరు పిల్లలు మించి ఉండరాదు అనే నిబంధనను తొలగించాల్సి ఉంది. ఈ విషయంపై సీఎం చంద్రబాబు స్థిర నిర్ణయంతో ఉన్నారన్నారు. ఆయన ప్రతిపాదన మేరకు నేడు జరిగిన మంత్రి మండలి సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నామన్నారు. ఈ క్రమంలోనే జలవనరుల శాఖ పరిధిలో మేనేజింగ్ కమిటీ సభ్యునిగా చైర్మన్, వైస్‌చైర్మన్, ప్రెసిడెంట్, వైస్‌ప్రెసిడెంట్) ఎంపికకు లేదా కొనసాగడానికి అనర్హతకు సంబంధించిన ఉపసెక్షన్ (5)ని తొలగించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ రైతుల నిర్వహణ నీటిపారుదల వ్యవస్థ చట్టం, 1997లోని సెక్షన్ 14కి సవరణ చేయడానికి రూపొందించిన ముసాయిదా బిల్లుకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెల్పిందని మంత్రి పార్థసారథి వివరించారు.

ఇకనుంచి ఇద్దరి నుంచి పిల్లలు కలిగిన వ్యక్తులను కూడా మేనేజ్మెంట్ కమిటీలో సభ్యులుగా ఎంపిక చేయవచ్చు, కొనసాగించవచ్చు. ఈ సవరణ ద్వారా ఏపీ ఎఫ్ఎంఐఎస్ చట్టం, 1997 సెక్షన్ 14లోని సబ్ సెక్షన్ 5 తొలగించబడుతుంది.

- హెచ్ఎన్ఎస్ఎస్-దశ 1: రాకెట్ల గ్రామం సమీపంలో అమిద్యాల లిఫ్ట్ పథకాన్ని ప్రారంభించేందుకు, హెచ్ఎన్ఎస్ఎస్ ప్రాజెక్ట్-దశ 2: ప్యాకేజీ 52ఏ (బ్యాలెన్స్ వర్క్)కు రూ.72.30 కోట్ల విలువైన రెండు పనులకు పరిపాలనా ఆమోదాన్ని ఇచ్చే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెల్పింది. 2019లో ప్రారంభించిన పనులను గత ప్రభుత్వం రద్దు చేసింది.
- ప్రకాశం బ్యారేజీ, దివిసీమ ప్రాంతంరెండింటి యొక్క కీలకమైన భద్రత మరియు నిర్మాణ సమగ్రత కోసం రూ.449.92 లక్షల విలువైన 4వ వరద నష్ట మరమ్మతు పనులకు పరిపాలనా ఆమోదం ఇచ్చే ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం తెల్పింది. గత సంవత్సరం వచ్చిన వరద కారణంగా జరిగిన నష్ట నివారణకు 517 పనులను రూ. 107 కోట్లతో ఇప్పటికే చేపట్టడం జరిగింది.
- రూ.3,19,48,000/ అంచనా వ్యయంతో "వైఎస్ఆర్ కడప జిల్లాలోని మైలవరం ఆనకట్టకు అవసరమైన ప్లేట్లు, యాంగిల్స్, హై టెన్షన్ బోల్టులు, నట్లలతో రేడియల్ క్రెస్ట్ గేట్లను బలోపేతం చేసే పనికి పరిపాలనా ఆమోదం ఇచ్చే ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం తెల్పింది. 2021 నవంబరులో వచ్చిన భారీ ఇన్‌ఫ్లో మూలంగా ఇవి అన్ని డ్యామేజీ అయితే గత ప్రభుత్వం ఏమీ పట్టించు కోలేదు.
- 1154.03 ఎకరాల ఆయకట్టుకు నీళ్ళు అందజేయడానికి తిరుపతి జిల్లాలోని తిరుపతి, తిరుమలకు మంచి నీరు అందించడానికి ములపల్లి ట్యాంక్ (నారావారిపల్లె సమీపంలో) 4 క్యాస్కేడింగ్ ట్యాంకులు, కల్యాణి డ్యామ్‌కు నీటి సరఫరా పనులకు రూ.126.06 కోట్లతో పరిపాలనా ఇచ్చే ఆమోదం ఇచ్చే ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం తెల్పింది.
- అనంతపురం జిల్లాలోని ఉరవకొండ, వజ్రకరూర్, విడపనకల్ మండలాల్లోని 10,500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించడానికి వజ్రకరూరు మండలం, రాగులపాడు గ్రామం సమీపంలోని కొట్టాలపల్లి లిఫ్ట్ పథకం నుండి ప్రధాన కాలువ నుండి 177.000 కి.మీ. వద్ద 100 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోయడానికి రూ.55.60 కోట్లకు పరిపాలనా ఇచ్చే ఆమోదం ఇచ్చే ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం తెల్పింది. 10,500 ఎకరాలకు సాగు, మంచినీరు అందజేయడం జరుగుతుంది.
- అనంతపురం మిడ్ పెన్నార్ ప్రాజెక్ట్‌కు రబ్బరు సీల్స్ మార్చడం, కొత్త వాక్‌వే వంతెన నిర్మాణం, రేడియల్ క్రెస్ట్ గేట్లకు ఇసుక బ్లాస్టింగ్ పెయింటింగ్, కొత్త ప్రధాన కంట్రోల్ ప్యానెల్ బోర్డుల సరఫరా నిర్మాణం, సబ్‌డిస్ట్రిబ్యూషన్ ప్యానెల్ బోర్డులు, కంట్రోల్ ప్యానెల్ బోర్డులు, ఆనకట్ట సుందరీకరణ పనులకు రూ.5.20 కోట్లకు పరిపాలనా ఇచ్చే ఆమోదం ఇచ్చే ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం తెల్పింది.
- ఆటో డ్రైవర్ల సేవ పథకం అమలు ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 2,90,669 డ్రైవర్లకు రూ.436 కోట్ల మేర లబ్ధి చేకూరనుంది. 4వ తేదీన ఈ పథకాన్ని అమలుపర్చనుంది. అర్హులు ఎవరికైనా ఈ పథకం అందకపోతే వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చే తగు చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

మహిళా శక్తి పథకాన్ని ఇప్పటికే 10 కోట్లు మంది మహిళలు వినియోగించుకున్నారు. ఈ కారణంగా ఆటో డ్రైవర్లకు ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, వారి సమస్యలను పరిష్కరించేందుకు ఈ పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

- నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుండి స్టేట్ కోఆపరేటివ్ మార్కెలింగ్ ఫెడరేషన్ లిమిటెడ్ ద్వారా రూ.1,000 కోట్ల అదనపు వర్కింగ్ క్యాపిటల్ రుణాన్ని పొందేందుకు ప్రభుత్వ హామీని పొడిగించడానికి మరియు ఆ మొత్తాన్ని విజయవాడలోని స్టేట్ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ లెఫ్టినెంట్కి ఇంటర్‌కార్పొరేట్ రుణంగా బదిలీ చేయడానికి, మంత్రి మండలి ఆమోదం తెల్పింది.
- ఈ ఏడాది దాదాపు 53 లక్షల టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించి, 95 శాతం ధాన్యానికి 24 గంటల్లోనే చెల్లింపులు చేయడం జరిగింది. 20 మిలియన్ కేజీల పొగాకును ప్రభుత్వం కొనుగోలు చేసింది. కోకో రైతులకు అదనంగా కేజీకి రూ.50లు, మామిడి రైతులకు అదనంగా కేజీకి రూ.4/ ప్రభుత్వం ఇవ్వడం జరిగింది.
- ఛారిటబుల్ హిందూ మత సంస్థలు. ఎండోమెంట్స్ చట్టం, 1987 (1987 చట్టం నం.30) లోని సెక్షన్ 19(1) ను సవరిస్తూ ఆ సెక్షన్ నుండి "లేదా కుష్టు వ్యాధితో బాధపడుతున్నారు" అనే పదాలను తొలగించే ముసాయిదా బిల్లు ఆమోదం కోసం ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెల్పింది.
- ఏపీ. నిరంతరం పనిచేసే రిఫరెన్స్ స్టేషన్ నెట్‌వర్క్‌ను నేషనల్ సిఓఆర్ఎస్ ప్లాట్‌ఫామ్‌తో అనుసంధానించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు సర్వే ఆఫ్ ఇండియా, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, బీవీ। మధ్య కుదిరే అవగాహన ఒప్పందాన్ని ఆమోదించడానికి మరియు మంగళగిరిలోని సర్వే సెటిల్‌మెంట్స్ ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్‌కు అవగాహన ఒప్పందంపై సంతకం చేయడానికి అధికారం ఇచ్చే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెల్పింది. ఈ డాటా బేస్ వల్ల భూ వివరాలు సర్వే చేయడానికి ఉపయోగపడుతుంది. ఎవరికైనా ఈ డాటా సరఫరా చేసేందుకు అవకాశం ఏర్పడుతుంది.
- నంద్యాల జిల్లా పాణ్యం మండలం పిన్నపురం గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూమిని 174.10 ఎకరాల భూమిని మెస్సర్స్ గ్రీన్కో ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్ స్థాపన కోసం నెడకాప్‌కు బదిలీ చేయడానికి అప్పటి విధానం ప్రకారం జీవో ఎంఎస్ 16, ఎనర్జీ డిపార్ట్‌మెంట్, తేదీ జూన్ 13న 2020 ప్రకారం ఎకరాకు రూ.5,00,000/ నిర్ణయించిన భూమి రేటును ఆ సమయంలోని అన్ని అంశాలను దృష్టిలో ఉంచుకుని సాధారణ షరతులకు లోబడి నిర్ణయించడం అయిందని, అయితే జిల్లా కలెక్టర్ ప్రతిపాదించిన విధంగా ఇంధన శాఖ స్పష్టం చేసిన విధంగా ఎకరా మార్కెట్ విలువ రూ. 6.25 లక్షలుగా నిర్ణయిస్తూ రెవిన్యూ శాఖ చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.
- విజయవాడలోని ఏపీ ట్రాన్స్కొ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ అభ్యర్థన మేరకు, జీవో నెంబర్ 36 సవరణకు ఆ శాఖ చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెల్పింది, ఏపీలోని గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ డిక్లరేషన్ ప్రకారం గ్రీన్ హైడ్రోజన్ దాని ఉత్పన్నాల ప్రమోషన్ కోసం ఒక సలహా కమిటీని ఏర్పాటు చేయడానికి రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెల్పింది. దేశంలోనే తొలిసారిగా గ్రీన్ హైడ్రోజన్ మన రాష్ట్రంలోనే అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టడం జరిగింది.
- కాకినాడలోని 1.0 ఎంఎంటిపిఏ గ్రీన్ హైడ్రోజన్ ఆధారిత గ్రీన్ అమ్మోనియా తయారీ కంపెనీ గ్రీన్ అమ్మోనియా (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ అభ్యర్థన మేరకు పత్రాల సమర్పించడంలో జాప్యానికి విధించిన జరిమానాతో పాటు, ఇండియన్ స్టాంప్ చట్టం, 1899లోని సెక్షన్ 9 (1) కింద స్టాంప్ డ్యూటీని,రిజిస్ట్రేషన్ చట్టం, 1908లోని సెక్షన్ 78 కింద రిజిస్ట్రేషన్ రుసుమును మినహాయించడానికి రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెల్పిందని మంత్రి పార్థసారథి వివరాలు వెల్లడించారు.

# విజయవాడలో దారుణం

**తెలంగాణ మహిళకు**
**విజయవాడలో వేధింపులు**
**ఇద్దరు యువకులపై కేసు నమోదు**

**విజయవాడ, అక్టోబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** తెలంగాణ మహిళపై విజయవాడలో ఇద్దరు యువకులు వేధింపులుకు గురిచేసినట్లు కీలక సమాచారం. ఈ వ్యవహారనఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.దసరా సందర్భంగా శ్రీ దుర్గాదేవి దర్శనం కోసం వచ్చిన తెలంగాణ నుంచి ఒక మహిళ వచ్చింది. ఆమెను ఇద్దరు యువకులు వెన్నంటి చాకచక్యంగా నగ్న వీడియోలు చిత్రీకరించారు. గవర్నర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన చోటు చేసుకుంది. గవర్నర్ పేటలోని ఓ లాడ్జిలో స్నానం చేస్తున్న మహిళను పక్క రూంలో నుంచి ఇద్దరు యువకులు వీడియో చిత్రీకరించారు. అలజడి కావడంతో యువకుల్ని గుర్తించిన బాధితురాలు. వెంటనే గవర్నర్ పేట పోలీసులను బాధితురాలు ఆశ్రయించింది. అయితే ఈ విషయంలో పోలీసులు తాత్సారం చేసినా చివరికి ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసినట్లు సమాచారం.

## ప్రముఖ రచయిత పరుచూరి నారాయణచార్యులు (లల్లాదేవి) మృతి



ప్రత్తిపాడు అక్టోబర్ 3 (ప్రభాతవార్త) ప్రముఖ రచయిత పరుచూరి నారాయణ ఆచార్యులు (కలంపేరు. లల్లాదేవి) శుక్రవారం ఉదయం వారి స్వగ్రామమైన గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం. నిమ్మగడ్డవారిపాలెం లో మృతి చెందారు. వారు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలిసింది. వారికి. భార్య ఆదిలక్ష్మి ్మ. కుమారుడు నందగోపాల్. కుమార్తె హరి ప్రసన్నారాణి ఉన్నారు. వారి మృతి పట్ల పలువురు అభిమానులు. ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారు వివిధ మాస పత్రికలు వార పత్రికలు పక్షపత్రికలు దినపత్రికలందు సుమారు 40 సీరియల్స్ పైగా వెలువడ్డాయి. ఆయన రచించిన కథలు. జానపద బ్రహ్మ బి విఠలాచార్య దర్శకత్వంలో కరుణించిన కనకదుర్గ. శ్వేత నాగు. అరణ్యదల్లి అభిమన్యు సినిమాలు గా రూపుదిద్దుకొని ప్రేక్షకుల మన్ననలు పొందాయి. వారి సినిమాలు టీవీల్లో కూడా ప్రచారం అయినాయి. వారికి 5 అవార్డులు వచ్చాయి. వారి 14 నవలలు కన్నడంలోకి అనువదించ బడి ధారావాహికంగా ప్రచురింప బడ్డాయి. వారు అనేక రేడియో ప్రసంగాలు చేశారు. తిరుపతి తిరుమల దేవస్థానం ఆర్థిక సహాయంతో. లల్లా రామాయణం. డబ్ల్యూహెచ్వో సమాచారం ఆధారంగా ఎయిడ్స్ నవల. తదితర తదితర ప్రచురణ లు జనాదరణ పొందినవి. వివేకాక వారు అనేగా చారిత్రాత్మక రచనలు రచించి పలువురు అభిమానుల మన్ననాలు

04-10P10 12 GNT_04-10P10.qxd 10/3/2025 10:55 PM Page 1



# వెస్టిండీస్ టెస్టులో.. భారత్ 286 రన్స్ ఆధిక్యం





## బౌలర్లపై విరుచుకుపడిన జురెల్, జడేజా

## ముగిసిన రెండో రోజు ఆట

**న్యూఢిల్లీ:** వెస్టిండీస్‌తో జరుగుతున్న టెస్టు మ్యాచ్‌లో భారత్ పట్టుబిగించింది. అహ్మదాబాద్ లోని నరేంద్ర మోడీ స్టేడియంలో వెస్టిండీస్‌తో జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్‌లో రెండో రోజు శుక్రవారం ఆట ముగిసే సమయానికి భారత్ తొలి ఇన్నింగ్స్‌లో ఐదువికెట్ల నష్టానికి భారీగా 448 పరుగులు చేసింది. క్రీజులో రవీంద్రజడేజా (104), వాషింగ్టన్ సుందర్ (9)లు ఉన్నారు. భారత్ ప్రస్తుతం 286 పరుగుల ఆధిక్యంలో ఉంది. తొలి ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్ 162 పరుగులకే ఆలౌటైంది. ఓవర్ నైట్ స్కోరు 121/2తో రెండో రోజు ఆటను ప్రారంభించిన భారత్, మరో 327 పరుగులు జోడించి 3 వికెట్లు మాత్రమే కోల్పోయింది. ఓవర్ నైట్ బ్యాటర్లు గిల్ (18), కేఎల్ రాహుల్ (53) లు రెండో రోజు విండీస్ బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. హాఫ్ సెంచరీ సాధించిన తరువాత గిల్ (50) రోస్టన్ ఛేజ్ బౌలింగ్‌లో జస్టిన్ గ్రేవ్స్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్‌కు చేరుకున్నాడు. గిల్, రాహుల్ జోడీ 3వ వికెట్‌కు 98 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది.

తొలి రోజు హాఫ్ సెంచరీ చేసిన రాహుల్ రెండో రోజూ పరుగులు రాబట్టి శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. అయితే లంచ్ తర్వాత తొలి ఓవర్‌లో ఔట్ అయ్యాడు. స్వల్ప వ్యవధిలో గిల్, రాహుల్ ఔటనప్పటికి వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్, రవీంద్ర జడేజా విండీస్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. ఇద్దరూ పోటాపోటీగా పరుగులు సాధించారు. ధ్రువ్ జురెల్ (125) సెంచరీ సాధించిన అనంతరం ఖరీ పియర్ బౌలింగ్‌లో షై హోప్ క్యాచ్ అందుకోవడంతో పెవిలియన్‌కు చేరుకున్నాడు. జడేజా, ధ్రువ్ జురెల్ జోడి 5వ వికెట్‌కు 206 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. జురెల్ ఔటైన కాసేపటికే జడేజా కూడా టెస్టుల్లో తన ఆరో సెంచరీని నమోదు చేశాడు. వాషింగ్టన్ సుందర్‌తో కలిసి మరో వికెట్ పడకుండా రెండో రోజును ముగించారు.



# వరల్డ్ వెయిట్ లిఫ్టింగ్‌లో మీరాబాయికి రజతం

**న్యూఢిల్లీ:** ప్రపంచ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఒలింపిక్ పతక విజేత, భారత వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను రజత పతకాన్ని సాధించింది. నార్వేలోని ఫోర్డ్‌లో శుక్రవారం జరిగిన ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా 48 కిలోల వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో ఈ రజతాన్ని గెలుచుకుంది. ఇది మార్క్యూ ఈవెంట్‌లో మూడవ పతకం. 2024 పారిస్ తర్వాత ఈ ఏడాది ఆగస్టులో జరిగిన కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో 48 కిలోల స్వర్ణం గెలుచుకోవడం ద్వారా తిరిగి పోటీలోకి దిగిన మీరా మొత్తం 199 కిలోలు (84 కిలోల స్నాచ్ + 115 కిలోలు క్లీన్ అండ్ జెర్క్) ఎత్తింది. ఇక ఉత్తర కొరియాకు చెందిన రి సాంగ్ గమ్ మొత్తం 213 కిలోల (91 కిలోలు + 122 కిలోలు) ఎత్తి స్వర్ణం గెలుచుకుంది. క్లీన్ అండ్ జెర్క్‌తో పాటు మొత్తం మీద కొత్త ప్రపంచ రికార్డులను సృష్టించింది. థాయిలాండ్‌కు చెందిన థాన్యాథోన్ సుక్చారోయెన్ మొత్తం 198 కిలోల (88 కిలోల స్నాచ్ + 110 కిలోలు క్లీన్ జెర్క్) ఎత్తి కాంస్యం గెలుచుకుంది.

# మహిళల వన్డేలో.. చిత్తుగా ఓడిన పాకిస్థాన్

## 7 వికెట్లు తేడాతో బంగ్లా సూపర్ విక్టరీ



**న్యూఢిల్లీ:** ఐసిసి మహిళల వన్డే ప్రపంచ కప్ 2025లో పాకిస్తాన్ తమ తొలి మ్యాచ్‌లోనే ఘోర పరాజయాన్ని చవిచూసింది. బంగ్లా దేశ్ మహిళల జట్టు 7 వికెట్ల తేడాతో పాకిస్తాన్‌ను ఓడించి అద్భుతమైన విజయాన్ని నమోదు చేసింది. బంగ్లా బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి పాక్‌ను 38.3 ఓవర్లలో 129 పరుగులకే ఆలౌట్ చేశారు. బంగ్లాదేశ్ తరఫున 20 ఏళ్ల యువ పేసర్ మారుఫా అక్తర్ అద్భుతంగా రాణించింది. ఆమె తొలి ఓవర్లోనే ఓపెనర్ ఓమైమా సోహైల్, సిద్రా అమీన్‌ను డకౌట్ చేసి పాకిస్తాన్ పతనాన్ని ప్రారంభించింది. ఆ ఓవర్ ముగిసేసరికి పాకిస్తాన్ స్కోరు 2 పరుగులకే 2 వికెట్లుగా ఉంది. ఎడమచేతి స్పిన్నర్ నాహిదా అక్తర్ కూడా 19పరుగులిచ్చి రెండు వికెట్లు పడగొట్టి పాక్‌ను మరింత కష్టాల్లోకి నెట్టింది. బ్యాటింగ్‌లో ఎవరూ పెద్దగా రాణించకపోవడంతో రాణించకపోవడంతో పాకిస్తాన్ తక్కువ స్కోరుకే పరిమితమైంది. రమీన్ షమీమ్ (23) టాప్ స్కోరర్‌గా నిలిచింది. ఇక 130 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని బంగ్లాదేశ్ కేవలం 31.1 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. రూబియా హేదర్ 77 బంతుల్లో 8 ఫోర్లతో నాటౌట్ 54 పరుగుల కీలక ఇన్నింగ్స్‌తో విజయంలో కీలకపాత్ర పోషించింది. ఆమె కెప్టెన్ నిగర్ సుల్తానా (23) తో కలిసి మూడో వికెట్‌కు 62 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి బంగ్లాను సునాయాసంగా గెలుపు తీరాలకు చేర్చింది. గత 2022 ప్రపంచ కప్‌లో కూడా పాకిస్థాన్, బంగ్లాదేశ్ చేతిలో ఓడిపోవడం గమనార్హం.



# ఐసిసిర్యాంకింగ్స్‌లో.. అభిషేక్ వరల్డ్ రికార్డు

## బ్యాటర్ల ర్యాంకింగ్‌లో అగ్రస్థానం

## టాప్ బౌలర్‌గా వరుణ్ చక్రవర్తి

**న్యూఢిల్లీ:** ఆసియా కప్‌లో అద్భుతమైన బ్యాటింగ్‌తో 7 మ్యాచ్‌లలో 314 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ గెలుచుకున్న యంగ్ సెన్సేషన్ అభిషేక్ శర్మ చరిత్ర సృష్టించాడు. తాజా ఐసీసీ పురుషుల టీ20 బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్న అభిషేక్ ఏకంగా 931 రేటింగ్ పాయింట్లు సాధించాడు. ఇది టీ20 క్రికెట్ చరిత్రలోనే అత్యధిక రేటింగ్ పాయింట్లు. అభిషేక్ 2024లో టీ20 క్రికెట్‌లోకి అడుగుపెట్టినప్పటి నుండి కేవలం 15 నెలల్లోనే 849 పరుగులు చేసి సంచలనం కలిగించాడు. అతని స్ట్రైక్ రేట్ దాదాపు 200గా ఉంది. ఈ స్వల్ప కాలంలోనే అభిషేక్ రెండు సెంచరీలు కూడా నమోదు చేసుకున్నాడు. అభిషేక్ సాధించిన 931 పాయింట్లు, టీ20 క్రికెట్‌లో గతంలో ఇంగ్లండ్ బ్యాటర్ డేవిడ్ మలన్ 2020లో నెలకొల్పిన 919 పాయింట్ల రికార్డును బద్దలు కొట్టాయి. అంతేకాకుండా, గతంలో భారత నంబర్ వన్ బ్యాటర్లుగా ఉన్న సూర్యకుమార్ యాదవ్ (912 పాయింట్లు), విరాట్ కోహ్లీ (909 పాయింట్లు) రికార్డులను కూడా అభిషేక్ అధిగమించాడు. ప్రస్తుత ర్యాంకింగ్స్‌లో అభిషేక్ అగ్రస్థానంలో కొనసాగుతుండగా, ఫిల్ సాల్ట్ రెండో స్థానంలో ఉన్నాడు. ఆసియా కప్ ఫైనల్‌లో అద్భుతంగా రాణించిన తిలక్ వర్మ మూడో స్థానంలో నిలిచాడు. టోర్నమెంట్‌లో భారత్‌పై అద్భుతమైన సెంచరీ సాధించిన పథుమ్ నిస్సంక ఐదో స్థానానికి ఎగబాకాడు. ఇక టీ20 క్రికెట్‌లో వరుణ్ చక్రవర్తి టాప్ బౌలర్‌గా కొనసాగుతున్నాడు. అలాగే ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో అనూహ్య మార్పు చోటు చేసుకుంది. ఆల్‌రౌండర్ల జాబితాలో అగ్రస్థానంలో ఉన్న హార్దిక్ పాండ్యా తన స్థానాన్ని కోల్పోయాడు. పాకిస్తాన్ ఆటగాడు సైమ్ అయూబ్ హార్దిక్ పాండ్యాను అధిగమించి అగ్రస్థానంలో నిలిచాడు. ఈ టోర్నమెంట్‌లో సైమ్ అయూబ్ బౌలింగ్‌లో మంచి ప్రదర్శన కనబర్చినప్పటికీ, బ్యాటింగ్‌లో మాత్రం ఘోరంగా విఫలమయ్యాడు. ఏడు ఇన్నింగ్స్‌లలో నాలుగుసార్లు డకౌట్ అయి, కేవలం 37 పరుగులు మాత్రమే చేశాడు.





# వరల్డ్ పారా అథ్లెటిక్స్‌లో.. ధరమ్‌బీర్ రజతం, కౌశిక్ కాంస్యం

**న్యూఢిల్లీ:** ప్రపంచ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2025లో భారత్ తన ఖాతాలో మరో రెండు పతకాలను జోడించింది. ధరంబీర్ నైన్, అతుల్ కౌశిక్ రజతం, కాంస్య పతకాలను దక్కించుకున్నారు. పారిస్ పారాలింపిక్స్ స్వర్ణ పతక విజేత ధరంబీర్ పురుషుల ఎఫ్51 క్లబ్ త్రోలో తృటిలో స్వర్ణ పతకాన్ని కోల్పోయి రజతం గెలుచుకున్నాడు. 36 ఏళ్ల అతను తన చివరి ప్రయత్నంలో 29.71 మీటర్లు నమోదు చేశాడు. సెర్బియాకు చెందిన అలెగ్జాండర్ రాడిసిక్ 30.36 మీటర్లతో అగ్రస్థానంలో నిలిచాడు. అలాగే పారాలింపిక్ పతక విజేత అయిన మరో భారతీయుడు ప్రణవ్ సూర్మా 28.19 మీటర్లు ఎగిరి ఐదవ స్థానంలో నిలిచాడు. పురుషుల డిస్కస్ త్రో ఎఫ్57లో, అతుల్ కౌశిక్ 45.61 మీటర్ల ప్రయత్నంతో కాంస్యం సాధించాడు. దానితో, యోగేష్ కథునియా తర్వాత ఈ విభాగంలో ప్రపంచ పతకం గెలుచుకున్న రెండవ భారతీయుడిగా నిలిచాడు. లిబియాకు చెందిన మహమూద్ రజాబ్ 46.73 మీటర్లతో గెలుచుకోగా, క్యూబాకు చెందిన గిల్లెర్మో వరోనా గొంజాలెజ్ 46.21 మీటర్లతో రెండవ స్థానంలో నిలిచాడు. మిగతా చోట్ల, భారత్ పతకాలను తృటిలో కోల్పోయింది. పురుషుల 400 మీటర్ల టీ47 ఫైనల్‌లో దిలీప్ గవిట్ సగం వరకు ఆధిక్యంలో నిలిచి, చివరి దశలో నాల్గవ స్థానానికి పడిపోయాడు. పురుషుల డిస్కస్ ఎఫ్37లో 19 ఏళ్ల హానీ తన ప్రపంచ ఛాంపియన్‌షిప్‌ల అరంగేట్రంలో 51.22 మీటర్లతో పోడియం వెలుపల నాల్గవ స్థానంలో నిలిచాడు.



# ఇకపై అదేరోజు బ్యాంకుల్లో చెక్కుల క్లియరెన్సులు

**ముంబయి,అక్టోబరు 3:** బ్యాంకు కస్టమర్లకు ఇది శుభవార్త. చెక్కుల క్లియరెన్స్ కోసం ఇకపై రోజుల తరబడి వేచి చూడాల్సిన అవసరం లేదు. రిజర్వ్ బ్యాంకు తీసుకొచ్చిన కొత్త నిబంధనల ప్రకారం, ఈనెల 4 నుంచి 'అదే రోజు చెక్ క్లియరెన్స్' విధానం అమల్లోకి రానుంది. దేశంలోని ప్రముఖ ప్రైవేట్ బ్యాంకులైన హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ సహా పలు బ్యాంకులు ఈ కొత్త విధానాన్ని ప్రారంభించనున్నట్లు ప్రకటించాయి. ఈ నూతన విధానం వల్ల, కస్టమర్లు తమ ఖాతాలో జమ చేసిన చెక్కులు కేవలం కొన్ని గంటల్లోనే క్లియర్ అవుతాయి. చెల్లింపుల ప్రక్రియను మరింత వేగంగా, సురక్షితంగా మార్చేందుకు ఆర్‌బీఐ ఈ మార్పులు తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో, చెక్కులు బౌన్స్ కాకుండా ఉండేందుకు ఖాతాదారులు తమ అకౌంట్లలో సరిపడా నగదు నిల్వలు ఉంచుకోవాలని బ్యాంకులు సూచిస్తున్నాయి. అలాగే చెక్కులపై వివరాలను తప్పులు లేకుండా స్పష్టంగా నింపాలని కోరుతున్నాయి. చెక్కుల భద్రతను పెంచేందుకు 'పాజిటివ్ పే సిస్టమ్'ను తప్పనిసరిగా ఉపయోగించాలని బ్యాంకులు స్పష్టం చేశాయి. దీని ప్రకారం, రూ.50,000 కంటే ఎక్కువ విలువైన చెక్కులను బ్యాంకులో జమ చేయడానికి కనీసం 24 గంటల ముందు ఖాతాదారులు కొన్ని కీలక వివరాలను బ్యాంకుకు అందించాలి. అకౌంట్ నంబర్, చెక్ నంబర్, తేదీ, చెక్ మొత్తం, లబ్ధిదారుడి పేరు వంటి వివరాలను బ్యాంకుకు తెలియజేయాలి. ఈ వివరాలను రీజనల్ ఆఫీసులకు కేటాయించిన ఈమెయిల్ ఐడీలకు పంపించాల్సి ఉంటుంది. బ్యాంకులో చెక్కును సమర్పించినప్పుడు, ముందుగా అందించిన వివరాలతో సరిపోల్చి చూస్తారు. అన్నీ సక్రమంగా ఉంటేనే చెక్కును క్లియర్ చేస్తారు. వివరాలు సరిపోలకపోతే ఆ చెక్కును తిరస్కరిస్తారు. రూ.5 లక్షలు దాటిన చెక్కులకు పాజిటివ్ పే విధానం తప్పనిసరి అని ఆర్‌బీఐ ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం చెక్కుల క్లియరెన్స్ కోసం బ్యాంకులు చెక్ ట్రంకేషన్ సిస్టమ్ (సీటీఎస్)ను వాడుతున్నాయి. దీనివల్ల ఏటీఎం లేదా డ్రాప్ బాక్సుల్లో వేసిన చెక్కులు క్లియర్ కావడానికి కనీసం రెండు రోజులు పడుతోంది. కొత్త విధానంతో ఈ జాప్యం పూర్తిగా తొలగిపోనుంది.

# ఆవిష్కరణల రంగంలో గ్లోబల్ లీడర్ 'భారత్'

## మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్

**సియాటెల్, అక్టోబరు 3:** మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు, బిలియనీర్లలో ఒకరైన బిల్ గేట్స్ భారత్‌పై ప్రశంసల జల్లు కురిపించారు. ఆవిష్కరణల రంగంలో భారత్ ఒక ప్రపంచ స్థాయి నాయకుడిగా నిలుస్తోందని, అనేక అభివృద్ధి చెందుతున్న దేశాలకు మార్గదర్శకంగా ఉందని ఆయన కొనియాడారు. భారత పరిష్కారాలు ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది జీవితాలను మెరుగుపరిచే శక్తిని కలిగి ఉన్నాయన్నారు. అమెరికాలోని సియాటిల్‌లో భారత కాన్సులేట్ జనరల్, బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్ సంయుక్తంగా మహాత్మా గాంధీ 156వ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో బిల్ గేట్స్ మాట్లాడుతూ. 'ఈ రోజు భారత్ ఆ వి ష్క ర ణ ల్లో గ్లోబల్ లీడర్‌గా ఉంది. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది జీవితాలను కాపాడి, మెరుగుపరిచే పరిష్కారాలను అందిస్తోంది. వికసిత భారత్ 2047 లక్ష్య సాధనలో భారత్‌తో మా భాగస్వామ్యం కొనసాగుతుందని ఆశిస్తున్నాం" అని తెలిపారు. గాంధీజీ ఆశయాలైన సమానత్వం, గౌరవం తమ ఫౌండేషన్ పనికి పునాది వంటివని గేట్స్ పేర్కొ న్నారు. ఈ వేడుకల్లో భారతీయ సంస్కృతి, కళలు, సంప్రదాయ వంట కాలను ప్రదర్శిం చా రు. వాషిం గ్టన్, సియాటిల్ నగర ప్రభు త్వాల నుంచి సీనియర్ నాయకులు కూడా ఈ కార్యక్ర మంలో పాల్గొన్నారు. ఇదే కార్యక్రమంలో ప్రస్తుత ప్రపంచంలో గాంధీ విలువల ప్రాముఖ్యత అనే అంశంపై యూఎస్ గ్లోబల్ సెక్యూరిటీ ఇన్‌స్టిట్యూట్ అధ్యక్షుడు జొనాథన్ గ్రానోఫ్ ప్రసంగం చేశారు. బెల్వ్యూ పబ్లిక్ లైబ్రరీ వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి, సియాటిల్ సెంటర్‌లోని



గాంధీ విగ్రహానికి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. వాషింగ్టన్ స్టేట్ సెనేటర్ వందనా స్లాటర్ పుష్పాంజలి ఘటించారు. సియాటిల్, బెల్వ్యూ నగరాల్లో జరిగిన కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భారతఅమెరికన్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు గాంధీజీకి ఇష్టమైన భజన గీతాలను ఆలపించినట్లు భారత కాన్సులేట్ కార్యాలయం వెల్లడించింది.

# బయటి సవాళ్లు తట్టుకునే సత్తా భారత్‌కే ఉంది..

## ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్

**న్యూఢిల్లీ, అక్టోబరు 3:** ప్రపంచ ఆర్థికవ్యవస్థ నిర్మాణాత్మక మార్పును చూస్తోందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఇలాంటి తరుణంలో బయటి నుంచి ఆకస్మికంగా తగిలే షాక్‌లను తట్టుకోవడంతో భారత్ సామర్థ్యం బలంగా ఉందని పేర్కొన్నారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన కౌటిల్య ఎకనామిక్ కాన్‌క్లేవ్2025లో ఆమె పాల్గొన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి మాట్లాడుతూ ఆర్థిక, ఇంధన అసమతుల్యతను ఎదుర్కోవడం కూడా దేశాల ముందున్న కర్తవ్యమని పేర్కొన్నారు. భౌగోళిక రాజకీయ సంఘర్షణలు



తీవ్రమవుతున్నాయని, ఆంక్షలు, సుంకాలు, విభేదాలు ప్రపంచ సరఫరా గొలుసులను దెబ్బతీస్తున్నాయని ఆమె ఆందోళన వ్యక్తంచేశారు. ఇవి భారత్‌కు కూడా దెబ్బేనని, వీటన్నింటినీ బలంగా ఎదుర్కొనే సామర్థ్యం భారత్‌కు ఉందని అన్నారు. దేశ ఆర్థిక పరపతి కూడా అభివృద్ధి చెందుతోందని నిర్మలాసీతారామన్ చెప్పారు. యుద్ధాలు, వ్యూహాత్మక పోటీలు, సంఘర్షణ సరిహద్దులను తిరగ రాస్తున్నాయని అన్నారు. గతంలో బలంగా ఉన్న సంబంధాలు ఇప్పుడు పరీక్షలు ఎదుర్కొంటున్నాయి, కొత్త సంకీర్ణాలు ఉద్భవిస్తున్నాయని చెప్పారు. అయితే భారత ఆర్థిక వ్యవస్థ నిలకడగా ఉందని, స్థిరంగా వృద్ధి చెందుతూనే ఉందని తెలిపారు. యాదృచ్ఛికంగా భారత్ ఈ స్థాయికి రాలేదని, అనేక శక్తిమంతమైన సంస్కరణల ద్వారా వచ్చిందని చెప్పారు.

# మ్యూచువల్‌ఫండ్స్‌లో కొత్తగా 12 ఫండ్స్..

**ముంబయి, అక్టోబరు 3:** ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో మరో 12 కొత్త ఫండ్స్ అందుబాటులోకి వస్తున్నాయి. వాటితో పాటుగా 3 స్ట్రాటజిక్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ (ఎస్ఎఫ్ఐ)లు సైతం ఉన్నాయి. ఇప్పటికే కొన్ని ఫండ్స్ కొనుగోళ్లు మొదలయ్యాయి. తమ కంపెనీ పోర్ట్‌ఫోలియోలో ఉన్న గ్యాప్స్ పూరించేందుకు కొత్త స్కీమ్స్ లాంచ్ చేస్తున్నట్లు మ్యూచువల్ ఫండ్ కంపెనీలు ప్రకటించాయి. న్యూ ఫండ్ ఆఫర్ ద్వారా మార్కెట్లకు కొత్త తరం ఫండ్స్ తీసుకొస్తున్నట్లు పేర్కొన్నాయి. ఎస్ఎఫ్ఐ స్కీమ్స్ క్యాసిఫ్ హైబ్రిడ్ లాంగ్ షార్ట్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ఇప్పటికే మొదలైంది. ఈనెల 9వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. ఇక అల్టివా హైబ్రిడ్ లాంగ్ షార్ట్ ఫండ్, మ్యాగ్నమ్ హైబ్రిడ్ లాంగ్ షార్ట్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ఈనెల15వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. ఈటీఎఫ్ స్కీమ్స్ కోటక్ నిఫ్టీ 200 మూమెంటమ్ 30 ఈటీఎఫ్, డీఎస్‌పీ నిఫ్టీ 500 ఫ్లెక్సీ క్యాప్ క్విలిటీ 30 ఈటీఎఫ్ స్కీమ్స్ సబ్‌స్క్రిప్షన్ ఈనెల్ 6వ తేదీతో ముగుస్తోంది. జిరోధా నిఫ్టీ 50 ఈటీఎఫ్ సబ్‌స్క్రిప్షన్ 10వ తేదీతో ముగుస్తుంది. వాటితో పాటుగా జియో బ్లాక్ రాక్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్, ద వెల్త్ కంపెనీ ఫ్లెక్సీ క్యాప్ పండ్ సబ్‌స్క్రిప్షన్స్ వరుసగా ఈనెలలోనే 7వ తేదీ, 8వ తేదీల్లో ముగుస్తున్నాయి. సెక్టోరల్ ఫండ్ కేటగిరీలో మోతీలాల్ ఓస్వాల్ కన్సంప్షన్ ఫండ్, ఇన్వెస్కో ఇండియా కన్సంప్షన్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ఈనెల15, 17వ తేదీల్లో ముగుస్తున్నాయి. ద వెల్త్ కంపెనీ ఎథికల్ ఫండ్, ఐసీఐసీఐ ప్రూ కాంగ్లమరేట్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ఈనెల 9, 17 తేదీల్లో ముగుస్తున్నాయి. ద వెల్త్ కంపెనీ ఆర్బిట్రేజ్ ఫండ్, ద వెల్త్ కంపెనీ లిక్విడ్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ఈనెల 8వ తేదీన ముగుస్తుంది. జిరోధా నిఫ్టీ 50 ఇండెక్స్ పండ్ సబ్‌స్క్రిప్షన్ అక్టోబర్ 10వ తేదీతో ముగుస్తుంది. ఈ ఫండ్ హౌస్ అందిస్తోన్న ఏకైక డైరెక్ట్ ప్లాన్ ఇదే. మ్యూచువల్ ఫండ్స్‌లోనూ హైరిస్క్ ఉంటుంది.



# వాణిజ్యం

# యూరోప్, ఆఫ్రికా దేశాలకు భారత్ చమురు ఎగుమతులు

**న్యూఢిల్లీ, అక్టోబరు 3:** అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో భారత్ తన ఇంధన ఉత్పత్తుల ఎగుమతులను వేగవంతం చేసింది. రష్యా రిఫైనరీలపై దాడులు తీవ్రం కావడంతో ప్రపంచ ఇంధన మార్కెట్‌లో కొరత ఏర్పడింది. ఈ కొరతను భర్తీ చేయడానికి భారత్ ఎగుమతులను ముమ్మరం చేసింది. ప్రైవేటు రంగంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్, నయారా ఎనర్జీ సంస్థలు బ్రెజిల్, టర్కీ, యూఏఈ, ఇంకా పలు ఆఫ్రికా దేశాలకు భారీగా ఎగుమతులు చేస్తున్నాయి. రష్యాలో శుద్ధి చేసిన ఇంధనంపై ఈ దేశాలు ఆధారపడ్డాయని చెబుతున్నారు. అయితే, చమురు శుద్ధి సామర్థ్యం దెబ్బతినడంతో రష్యా దేశీయ అవసరాలపైనే ఎక్కువగా దృష్టి సారించింది. సెప్టెంబర్ నెలలో రోజుకు రెండు లక్షల బ్యారెళ్ల ఇంధన ఎగుమతులను రష్యా తగ్గించిందని కెప్లర్ నివేదిక వెల్లడించింది. భారత్ నుంచి బ్రెజిల్‌కు శుద్ధి చేసిన ఇంధన ఎగుమతులు గణనీయంగా పెరిగి రోజుకు 97 వేల బ్యారెళ్లకు చేరాయి. ఆగస్టులో ఈ సంఖ్య కేవలం 40 వేల బ్యారెళ్లుగా మాత్రమే ఉంది. టర్కీకి అంతకుముందు నెలతో పోలిస్తే 20 వేల బ్యారెళ్ల నుంచి 56 వేల బ్యారెళ్లకు ఎగుమతులు పెరిగాయి. గత ఏడాది మన దేశం నుంచి టర్కీకి చమురు ఎగుమతులు జరగలేదు. ప్రస్తుతం బ్రెజిల్, టర్కీ దేశాలకు రిలయన్స్ ఇండస్ట్రీస్ చమురును ఎగుమతి చేస్తోంది. యూఏఈకి భారత్ నుంచి శుద్ధి చేసిన ఇంధన ఎగుమతి పెరిగింది. ఆగస్టులో 1.4 లక్షల బ్యారెళ్ల ఇంధనం కొనుగోలు చేసిన యూఏఈ, సెప్టెంబర్‌లో 2.01 లక్షల బ్యారెళ్లకు పెంచింది. భారత్ నుండి శుద్ధి చేసిన ఇంధన ఎగుమతులు సెప్టెంబర్ నెలలో 14 శాతం వృద్ధిని నమోదు చేశాయి.



# 500 బిలియన్ డాలర్లతో మస్క్ టాప్ బిలియనీర్

**న్యూయార్క్, అక్టోబరు 3:** టెస్లా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ) ఎలాన్ మస్క్ చరిత్ర సృష్టించారు. ప్రపంచంలో 500 బిలియన్ డాలర్ల నికర సంపద కలిగిన మొదటి వ్యక్తిగా నిలిచారు. టెస్లా షేర్లలో పెరుగుదల, ఇతర టెక్ కంపెనీల విలువల పెరుగుతున్న వేగంగా కారణంగా ఆయన రికార్డు సాధించారు. ఫోర్బ్స్ బిలియనీర్ల జాబితా ప్రకారం మస్క్ సంపద 500.1 బిలియన్లకు చేరింది. మస్క్ సంపదలో ఎక్కువ భాగం టెస్లాదే. సెప్టెంబర్ 15 నాటికి టెస్లా షేర్లలో 12.4 శాతానికి పైగా వాటా మస్క్‌కి ఉన్నది. ఈ సంవత్సరం ఇప్పటివరకు టెస్లా షేర్లు 14 శాతానికిపైగా పెరిగాయి. బుధవారం మరో 3.3 శాతం పెరగడంతో ఒకేరోజు మస్క్ సంపదకు 6 బిలియన్లకుపైగా వృద్ధి చెందింది. వాస్తవానికి ఈ ఏడాది ప్రారంభంలో టెస్లా షేర్లు దారుణంగా పడిపో యాయి. కానీ, ప్రస్తుతం పుంజుకుంటున్నాయి. మస్క్ వ్యాపారంపై మళ్లీ దృష్టి పెట్టడం ప్రారంభించడంతో పెట్టుబడిదారుల విశ్వాసం మరింత పెరిగింది. టెస్లా డైరెక్టర్ల బోర్డు చైర్మన్ రాబిన్ డెన్‌హోమ్ గత నెలలో మస్క్ ఇప్పుడు కంపెనీ వ్యవహారాల్లో చురుగ్గా ఉన్నట్లు తెలిపారు. కొన్ని నెలలు వైట్ హౌస్ సంబంధిత పనుల్లో బిజీగా గడిపిన విషయం తెలిసిందే. మస్క్ దాదాపు బిలియన్ డాలర్ల విలువైన టెస్లా షేర్లను కొనుగోలు చేస్తున్నట్లు ప్రకటించాడు. ఇది టెస్లా భవిష్యత్తుపై బలమైన విశ్వాసాన్ని చూపించింది. కంపెనీ సాంప్రదాయ కార్ల తయారీదారుని దాటి ముందుకు సాగడానికి ఏఐ, రోబోటిక్స్ ప్రపంచంలో ప్రధాన శక్తిగా మారడానికి కృషి చేస్తోంది. ఫోర్బ్స్ లెక్కల ప్రకారం రెండో బిలియనీర్‌గా ఒరాకిల్ కోఫౌండర్ లార్రీ ఎలిసన్ నిలిచారు. ఆయన నికర విలువ 351.5 బిలియన్ డాలర్లు.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14